Postel No. MBN/08/2016-2018


పురాతనమైన సమస్త రోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు, చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు, ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :112 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు ఆదివారం 10 ఆగస్టు 2025 పేజీలు :12 వెల రూ5 /-

## కాళేశ్వరం బాధ్యత
# నిర్మాణ సంస్థదే

**హైదరాబాద్, ఆగస్టు 9:**తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా భావించిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణంలో తీవ్రమైన లోపాలు, నిర్లక్ష్యం, ఆర్థిక అక్రమాలు చోటు చేసుకున్నట్లు జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని విచారణ కమిషన్ తేల్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బారేజీల నిర్మాణంలో జరిగిన ప్లానింగ్, డిజైన్, నిర్మాణ సంబంధిత తప్పిదాలపై సుమారు 15 నెలల పాటు జరిపిన విచారణ అనంతరం ఆయన నివేదికను ఇటీవల సమర్పించారు. ఈ నివేదిక ప్రకారం.. పనులపై ఎలాంటి బలమైన పర్యవేక్షణ లేకపోవడం, నాణ్యత నియంత్రణలో విఫలమయినట్లు.. నిర్మాణ సమయంలో అవకతవకలకు తావిచ్చే విధంగా నిర్వహణ సాగినట్లు తేలింది.ఘోష్ కమిషన్ ప్రధానంగా ఎల్అండ్‌టీ సంస్థపై తీవ్ర విమర్శలు చేసింది. మేడిగడ్డ బారేజ్‌లో 7వ బ్లాక్ పూర్తిగా దెబ్బతినడంతో, ఆ బ్లాక్ మరమ్మత్తు బాధ్యతను ఎల్అండ్‌టీనే భరిస్తుందని స్పష్టం చేసింది. తమ ఖర్చుతోనే దాన్ని పునరుద్ధరించాలని, అలాగే ఎల్అండ్‌టీకి ఎలాంటి పూర్తి ధృవపత్రాలు ఇవ్వకూడదని నివేదిక పేర్కొంది. ఇదే విధంగా అన్నారం, సుందిల్ల బారేజీలకు బాధ్యత వహించిన సంస్థలు కూడా డిఫెక్ట్ లైయబిలిటీ పీరియడ్‌లో తలెత్తిన లోపాలను తమ ఖర్చుతో పరిష్కరించాలని సూచించింది.కమిషన్ తన నివేదికలో వివిధ స్థాయిల్లో తలెత్తిన లోపాలను వెలుగులోకి తీసుకొచ్చారు. నిర్మాణాల్లో మౌలిక లోపాలు(బ్యారెజ్ పొడవు.. నది వెడల్పు విషయంలో) స్పష్టంగా ఉన్నాయని, ఇవి సాంకేతిక ప్రమాణాలను, నిబంధనలను ఖచ్చితంగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ముఖ్యంగా బ్యారేజీలు పెర్మియబుల్ ఫౌండేషన్ మీద డిజైన్ చేశారని, వాటిని స్టోరేజ్ స్ట్రక్చర్‌గా వాడారని కమిషన్ పేర్కొంది. మోడల్ స్టడీలు లేకుండానే డిజైన్‌లను ఆమోదించారని, పనులపై టెక్నికల్ రివ్యూ చేపట్టలేదని తీవ్రంగా ఆక్షేపించారు.ప్రాజెక్టులో నాణ్యత నియంత్రణ పూర్తిగా అదుపుతప్పిన స్థాయిలో ఉందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా సెకంట్ పైల్స్ వంటి కీలక నిర్మాణ



భాగాల్లో నాణ్యతా ప్రమాణాలు అనుసరించలేదని స్పష్టం చేశారు. పనుల అనంతరం ఎలాంటి నిర్వహణ జరగకపోవడం, ప్రీ-పోస్ట్ మాన్సూన్ తనిఖీలను పూర్తిగా విస్మరించడం, నిర్వహణ రిపోర్టులు లేకపోవడం%ఞా% ఇవన్నీ ప్రొటోకాల్‌ను ధిక్కరించడమే అని కమిషన్ అభిప్రాయపడింది.ప్రాజెక్ట్ వ్యయం కూడా అంచనాలను మించి మూడు రెట్లు పెరిగింది. ప్రారంభంలో రూ. 38,500 కోట్లతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్.. చివరకు రూ. 1,10,248.48 కోట్ల ఖర్చుతో ముగిసింది. ఇది 186 శాతం అధిక వ్యయంగా నమోదైంది. ప్లానింగ్ దశలో నుంచి ఆర్థిక నియంత్రణ పాటిస్తే.. పరిస్థితి ఇంత ఇబ్బందికరంగా మారేది కాదని ఘోష్ తెలిపారు. పలు పనులు పూర్తి కాకముందే ఆయా కంపెనీలకు పూర్తయినట్టు ధృవీకరణ పత్రాలు ఇచ్చారని, ఇది సిస్టమటిక్ ఫెయిల్యూర్‌గా రిపోర్ట్ ఇచ్చారు.ఇతర అంశాల్లో, ప్రాజెక్ట్‌కు సంబంధించి ఉన్న సీనియర్ ఇంజినీర్లు సీ మురళీధర్, బీ హరిరామ్, ఏ నరేందర్ రెడ్డి, టి శ్రీనివాస్, ఓంకార్ సింగ్‌లు కమిషన్ ముందు తప్పుల సమాచారం ఇచ్చినట్టు తేలింది. కొంతమంది నిజాలను దాచారని, కొంతమంది తప్పుడు వివరాలతో కమిషన్‌ను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించారని నివేదికలో పేర్కొనడం గమనార్హం.

## 334 పార్టీలను
# జాబితా రద్దు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:**దేశంలోని రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన దిశగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. గత ఆరేళ్లుగా కనీసం ఒక్క ఎన్నికలో కూడా పోటీ చేయని, క్రియారహితంగా ఉన్న 334 రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటించింది. కేవలం కాగితాలకే పరిమితమైన ఈ పార్టీలపై వేటు వేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచాలని ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, రిజిస్టర్ అయిన పార్టీలు క్రమం తప్పకుండా ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, 2019 నుంచి ఇప్పటివరకు ఈ 334 పార్టీలు ఏ ఎన్నికలోనూ తమ అభ్యర్థులను నిలబెట్టలేదు. అంతేకాకుండా, ఈ పార్టీలు రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన చిరునామాలలో వాటి కార్యాలయాలు భౌతికంగా లేవని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిందని ఈసీ స్పష్టం చేసింది. ఈ రెండు కీలక నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకే వాటి గుర్తింపును రద్దు చేసినట్లు వివరించింది.ఈ ప్రక్షాళన చర్యకు ముందు దేశంలో మొత్తం 2,854 రిజిస్టర్డ్ గుర్తింపు లేని పార్టీలు ఉండేవి. తాజా నిర్ణయంతో 334 పార్టీలను జాబితా నుంచి తొలగించగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2,520కి తగ్గింది. ఈ చర్య దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నమోదైన




పార్టీలకు వర్తిస్తుంది.అయితే, ఈ నిర్ణయం కేవలం గుర్తింపు లేని, క్రియారహితంగా ఉన్న పార్టీలకు మాత్రమే వర్తిస్తుందని ఈసీ తెలిపింది. ప్రస్తుతం దేశంలో చురుకుగా ఉన్న 6 జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర స్థాయి పార్టీల కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. ఎన్నికల వ్యవస్థలో జవాబుదారీతనం పెంచేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు కొనసాగుతాయని ఎన్నికల సంఘం వర్గాలు సూచించాయి.

## సీఎం రేవంత్ ను కలిసిన ఎన్టీపీసీ సీఎండీ

**హైదరాబాద్:**జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులకు సుముఖంగా ఉన్నట్లు ఎన్టీపీసీ బృందం తెలిపింది. సోలార్, విండ్ విద్యుత్ ప్రాజెక్టుల్లో దాదాపు 80 వేల కోట్ల పెట్టుబడులు



పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎంకు ఎన్టీపీసీ సీఎండీ వివరించారు. ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్రంలో 6700 మెగావాట్ల సామర్థ్యానికి అవకాశం ఉందని ఎన్టీపీసీ బృందం తెలిపింది.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు.

## ఆత్మీయత.. అనుబంధానికి
# ప్రతీక రక్షాబంధన్

గవర్నర్ జిష్ణుదేవ వర్మ



**హైదరాబాద్:**ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రక్తసంబంధాన్ని, మనుషుల మధ్య మమతను గుర్తు చేసే పవిత్రమైన పండుగ రాఖీ పౌర్ణమి అని అభిప్రాయపడ్డారు. సోదర భావాన్ని పెంపొందించి, కుటుంబ వాతావరణన్ని కాపాడే పండుగ అని అభివర్ణించారు. శనివారం రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కి విశ్వహిందూ పరిషత్ ,మాతృశక్తి, దుర్గావాహిని నాయకులు రాఖీ కట్టారు. మంగళ హారతులు ఇచ్చి దీవెనలు అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ విశ్వహిందూ పరిషత్ మహిళా నాయకులకు శుభాశీస్సులు అందజేశారు. ధర్మకార్యంలో విజయం సాధించాలని దీవించారు. కులమతాలకు అతీతంగా సమస్త మానవాళికి సోదర తత్వాన్ని అందించే పండగ రాఖీ పౌర్ణమి అని గవర్నర్ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం అయిన మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ పద్మశ్రీ, కోకన్వీనర్లు శ్రీవాణి, లక్ష్మీ సరోజ, వాణి దేవి, దుర్గా వాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి, రాష్ట్ర బాల సంస్కార ప్రముఖ్ శిరీష, మహంకాళి కన్వీనర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ
# సర్కార్ ఏం చేయబోతుంది..?

**హైదరాబాద్, ఆగస్టు 9:**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. అధికార పార్టీనే కాదు బీఆర్ఎస్, బీజేపీతో పాటు ఇతర రాజకీయ పార్టీలు, కుల సంఘాలు కూడా ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తున్నాయి. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే దిశగా అడుగులు వేశామని కాంగ్రెస్ చెబుతుండగా%ఞా%. బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఆరోపిస్తున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై క్లారిటీ లేకపోవటంతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కూడా ముందుకు సాగటం లేదు. చాలా రోజులుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మరోవైపు సర్కార్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఈసీ నోటిఫికేషన్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. కానీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తుండటతో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగటం లేదు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో బిల్లును పాస్ చేసింది. ఈ బిల్లును కేంద్రానికి పంపింది. కానీ ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర పడలేదు. ఇదే



విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తాజాగానే ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేపట్టింది. సీఎం రేవంత్ తో పాటు కేబినెట్ లోని మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నారు. ఇందుకు పలు రాజకీయపక్షాలు కూడా సంఘీభావం కూడా ప్రకటించాయి.రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు ఆమోదముద్ర రాకపోవటంతో%ఞా% బీసీ రిజర్వేషన్లపై ఏం చేయాలనే దానిపై సర్కార్ మల్లగుల్లాలను పడుతోంది. ప్రత్యామ్నాయాలపై ఫోకస్ చేస్తోంది. హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబరు మాసం ముగిసే లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో ముందున్న అన్ని మార్గాలను పరిశీలిస్తోంది. కోర్టు విధించిన గడువు దగ్గరపడటంతో%ఞా% ఎన్నికల వేళ్లే విషయంపై ఆలోచన చేస్తోంది.జీఓ ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తే ఎలా ఉంటుందనే దానిపై ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలుస్తోంది. ఇలా చేస్తే ఎవరైనా కోర్టుకు వెళ్తే ప్రక్రియకు బ్రేకులు పడే అవకాశం ఉంటుంది. ఇలా కాకుండా%ఞా% పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని చూస్తోంది. ఇది కాకుండా%ఞా%. ఎన్నికలను కొంత కాలం పాటు వాయిదా వేయవచ్చు. ఇలా చేస్తే స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోయే ప్రమాదం ఉంటుంది. పైగా రిజర్వేషన్ల అమలు విషయంలో ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.మొత్తంగా చూస్తే ఏ క్షణమైనా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సర్కార్ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇందులో రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది..? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తారా..? లేదా..? అనేది తేలాల్సి ఉంది..!

## రాజకీయాలకు
# సెలవు ఇవ్వబోతున్నా

మాజీ మంత్రి మల్లారెడ్డి



**మేడ్చల్:**మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసం బోయిన్ పల్లిలో రాఖీ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి... తన సోదర సోదరిమణుల తో ఇల్లంత సందడిగా మారింది... ప్రతి సంవత్సరం అన్న దమ్ములకు రాఖీ కట్టడం సంతోషంగా ఉంటుందని మల్లారెడ్డి అక్క చెల్లెలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు... మల్లారెడ్డి మాట్లాడుతూ రాఖీ పండగ తన జీవితం లో ఎంతో ప్రత్యేకమని, రాఖీ పండగ రోజే తన తొలి ఇంజనీరింగ్ కాలేజి ని ప్రారంభించి పాల మల్లారెడ్డి కాస్తా విద్యావేత్త గా మారానని, ఇపుడు అంచెలంచెలుగా ఎదిగి డీమ్డ్ యూనివర్సిటీ స్థాపించే స్థాయికి వెళ్లానని మల్లారెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా డీమ్డ్ యూనివర్శిటీ లు స్థాపించి పేద ప్రజలకు విద్య వైద్యం ను అందించే దిశగా కృషి చేస్తున్నాని అన్నారు..ఈ రాఖీ పండగ రోజున అందరికి అందుబాటులో ఉండే విధంగా వన్ హెల్త్ పేరిట మెడికల్ షాప్ లు ప్రారంభిస్తున్నామని, వీటిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన తెలిపారు... మల్లారెడ్డి ఆసుపత్రి లో కేసీఆర్ కిట్ తరహా CMR ఫండ్, మల్లారెడ్డి కిట్ ను అందిస్తున్నట్లు మల్లారెడ్డి తెలిపారు... 108 తరహాలో త్వరలో వన్ హెల్త్ పేరిట 100 అంబులెన్స్ లను ప్రారంభించి ఎమర్జెన్సీ సర్వీసులను అందించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు...

# S-400 డిఫెన్స్ సిస్టమ్ సూపర్ సక్సెస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:**ఆపరేషన్ సింధూర్‌పై ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. %వా%-400 డిఫెన్స్ సిస్టమ్ అద్భుతంగా పనిచేసిందని కితాబు ఇచ్చారు. పాకిస్థాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్స్‌తో సహా ఆరు విమానాలను కూల్చేసినట్లు ప్రకటించారు. 9 ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసినట్టు వెల్లడించారు. మురిద్కే , బహావల్‌పూర్ ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసినట్టు వెల్లడించారు. దీంతో పాటు, మరో పెద్ద విమానం కూడా ధ్వంసమైందన్నారు. ఇందుకు సంబంధించి ఆయన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎస్-400 కు క్రెడిట్ ఇచ్చారు.కూలిపోయిన పెద్ద విమానాన్ని "బిగ్ బర్డ్" అంటే ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ అని వర్ణించారు. ఇది పాకిస్తాన్ నిఘా, కమాండ్ సామర్థ్యంలో ముఖ్యమైన భాగం. ఈ వైమానిక దాడుల క్రెడిట్‌ను రష్యన్ నిర్మిత ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌కు ఇచ్చారు ఎయిర్ చీఫ్ మార్షల్. పాకిస్తాన్



విమానాలను లక్ష్యంగా చేసుకుని సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు పేర్కొన్నారు. కేవలం ఉగ్రవాదుల స్థావరాలను మాత్రమే ధ్వంసం చేస్తామని పాక్ %ణ+మీా%కు చెప్పి మరీ దాడులు చేసినట్టు ఎయిర్‌ఫోర్స్ చీఫ్ తెలిపారు.బెంగళూరులో జరిగిన ఎయిర్ మార్షల్ కాత్రే వార్షిక ఉపన్యాసంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ మాట్లాడుతూ, బహావల్పూర్‌లోని జైష్-ఎ-మహ్మద్ ప్రధాన కార్యాలయంపై దాడికి ముందు.. తరువాత ఉపగ్రహ చిత్రాలు చుట్టుపక్కల భవనాలకు గణనీయమైన నష్టం జరగలేదని స్పష్టంగా చూపిస్తున్నాయని అన్నారు. స్థానిక మీడియా ద్వారా ఉగ్రవాద స్థావరాల లోపల నుండి ఉపగ్రహ చిత్రాలు మాత్రమే మనకు అందాయని ఆయన అన్నారు. భారత వాయుసేన 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందన్నారు ఎయిర్ మార్షల్. 100 మందికి పైగా ఉగ్రవాదులు మృతి చెందారని తెలిపారు.ఇదిలావుంటే, పహల్గామ్ దాడి తర్వాత మే 7న " ఆపరేషన్ సిందూర్" అను భారత సైన్యం సమర్థవంతంగా నిర్వహించింది. తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసింది. ఈ దాడిలో 100 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా ఈ చర్యకు దిగింది భారత్.

## సంపాదకీయం

# సుంకాలు... శాపనార్థాలు!

రాక తప్పదనుకుంటున్న ముప్పు ముంగిట్లోకొచ్చింది. అమెరికా అధ్యక్షపీఠం అధిష్ఠించింది మొదలు నిలకడలేనితనంతో, పొంతనలేని వ్యాఖ్యలతో మిత్రుల్ని, వ్యతిరేకుల్ని కూడా సమానంగా ఇరకాటంలో పడేస్తున్న డోనాల్డ్ ట్రంప్... గతంలో హెచ్చరించినట్టే సుంకాల మోత మోగించారు. శుక్రవారం నుంచి భారత్ నుంచి వచ్చే సరుకులపై 25 శాతం సుంకాలు విధిస్తామని, ఇవిగాక రష్యా నుంచి ముడిచమురు, రక్షణ సామగ్రి కొంటున్నందుకు అదనంగా జరి మానా ఉంటుందని ప్రకటించారు. అది ఎంత శాతమో చెప్పకపోయినా రష్యాతో వాణిజ్యం సాగించే భారత్, చైనాలపై 500 శాతం వరకూ అదనపు సుంకాలుంటాయని ఆయన లోగడ ప్రకటించారు. కనుక ఈ సుంకాల కన్నా జరిమానా వాటాయే ఎక్కువుంటుందని అంచనా వేయొచ్చు. తన ఆదేశాలను ఔదలదాల్చనందుకు మన ఆర్థిక వ్యవస్థను 'మృత ఆర్థిక వ్యవస్థ'గా దూషించారు. అనాల్సిన వన్నీ అన్నాక 'ఇంకా భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చూద్దాం' అని ముక్తాయించారు. ఆయన హుకుం అమలైతే వస్త్రాలు, రొయ్యలు, ఆభర ణాలు, వజ్రాలు, తోలు ఉత్పత్తులు వగైరాలపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, ఆ రంగాల్లో ఉపాధి దెబ్బతింటుందనీ నిపుణుల అంచనా. ఈ రంగాల్లో 8,700 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులుంటున్నాయి. ఈ ఏడాది జీడీపీ 6.5 శాతానికి మించి వుండొచ్చని అంచనాలున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో అది బాగా తగ్గవచ్చంటున్నారు. ట్రంప్‌కు దౌత్య మర్యాదల సంగతి అటుంచి వ్యక్తిగా ఎలా మెలగాలో కూడా తెలియదు. బహిరంగ బెదిరింపులకు దిగటం, అన్యాయమని అందరికీ తెలిసేలా ప్రవర్తించటం ఆయన నైజం. బ్రెజిల్ సంగతే తీసుకుంటే అక్కడ ఆ మధ్య అధికారం కోల్పోయిన బోల్సొనారో ఆయ నకు ఇష్టుడు. కనుక అతనిపైవున్న నేరారోపణలు ఉపసంహరించి వదిలేయమని తాఖీదు పంపారు. అంగీకరించనందుకు అదనపు సుంకాలు విధించారు. దేశాలకు సార్వభౌమత్వం ఉంటుందనీ, దానికి లోబడి సంబంధాలు నెరపాలనీ ఆయన భావించరు. వాణిజ్య ఒప్పందాలు సాకారం కావాలంటే వాటిని కుదుర్చుకోదల్చుకున్న రెండు పక్షాలకూ పరస్పర విశ్వాసం, నమ్మకం ఉండాలి. ఓపిగ్గా చర్చించాలి. బ్రిటన్‌తో మనకు ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే ఇందుకు ఉదాహరణ. దాదాపు మూడేళ్లపాటు ఆ ఒప్పందంపై చర్చలు సాగాయి. ఒప్పందం అన్నాక ఇచ్చిపుచ్చుకోవడా లుంటాయి. 'మేం పుచ్చుకుంటాం... ఇవ్వం' అంటున్నారు. 'మాతో ఒప్పందానికి భారత్ సుముఖంగా వుంది... ఇక సంతకాలే తరువాయి' అంటూ చాన్నాళ్ల క్రితమే మన ప్రభుత్వం తరఫున తానే ప్రకటించారు. ట్రంప్ ఆగ్రహావేశాలకు వేరే కారణాలున్నాయి. మన సాగు, పాడి రంగాలను పరిరక్షించేందుకు అమెరికా నుంచి వచ్చే ఆ ఉత్పత్తులపై మన దేశం అధిక సుంకాలు విధిస్తోంది. ఇందులో సహేతుకత ఉంది. అమెరికాలో ఆ రంగాలకు భారీ సబ్సిడీలుంటాయి. దాంతో తమ ఉత్పత్తుల్ని వేరే దేశాల్లో కారుచౌకగా అమ్ముకోవటానికి వీలుంటుంది. అమెరికాతో పోలిస్తే మన సబ్సిడీలు చాలా తక్కువ. అవి రైతులకు లాభదాయకం కాకపోగా, ఆ రెండు రంగాల్లోనూ వ్యయం విపరీ తంగా పెరిగింది. రైతులు అధిక వడ్డీకి బయట అప్పులు చే యాల్సి వస్తోంది. తీరా గిట్టుబాటు ధర లభించక, అప్పులు తీరక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ట్రంప్ ఒత్తిడి చేస్తున్నట్టు అధిక సుంకాలు తొలగిస్తే ఈ సంక్షోభం మరింత పెరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆసరాగా ఉన్న ఆ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చేరినప్పుడే మన పాలకులు నిక్కచ్చిగా ఉండాల్సింది. కానీ దాటవేత ధోరణి ప్రదర్శించారు. రష్యాతో వాణిజ్యంపైనా ఇంతే. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలన్నట్టు ఉంటే వేరుగా ఉండేది. కానీ మన దేశం వారి ఆదేశాలు పాటించింది. 2009%-%13 మధ్య మన ఆయుధ కొనుగోళ్లలో రష్యా వాటా 76 శాతం. అదిప్పుడు 36 శాతానికి పడిపోయింది. దీన్ని ఆపేయాలని, తన ఎఫ్%-%35 యుద్ధ విమానాలు, ఎంక్యూ%-%9బి డ్రోన్లు, పీ%-%81 సాగర ప్రాంత గస్తీ విమానాలు కొనితీరాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. నిజానికి భారత్‌కు ఆయుధ అమ్మకాలపై 1960 ప్రాంతాల్లో అమెరికా నిషేధం విధించబట్టే రష్యాపై ఆధారపడటం పెరిగింది. ముడి చమురు విషయానికొస్తే మొన్న ఫిబ్రవరికి రష్యా నుంచి కొనుగోళ్లు 25 శాతం మేర పడిపోయాయి. అదే సమయంలో అమెరికా నుంచి కొనుగోళ్లు వంద శాతం పెరిగాయి. తన అంధభక్త గణాన్ని సంతృప్తిపరచటం కోసం, ఓటుబ్యాంకు పెంచుకోవటం కోసం ట్రంప్ దశాబ్దాల తరబడి ఎంతో ఓపిగ్గా నిర్మించుకుంటూ వచ్చిన ఇరు దేశాల సంబంధాలపైనా గొడ్డలి వేటు వేశారు. దీని పర్యవ సానాలు మనపై ఉన్నట్టే, అమెరికాపైనా ఉంటాయి. ఆయన ధోరణి మారకపోతే మన ఆర్థిక వ్యవస్థ మాటేమోగానీ... అమెరికా ఆర్థిక వ్యవస్థ 'మృతప్రాయం' కావటం ఖాయం.

# వర్షాకాలంలో వచ్చే వ్యాధులు

**తీసుకోవలసిన ముందు జాగ్రత్తచర్యలు**

**డాక్టర్ ఎండి సిహెచ్. తిరుపతిరావు..**

**కరీంనగర్:** ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ, వర్షం మీకు మరియు మీకుటుంబానికి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే వైరస్ లు మరియు అంటువ్యాధులను కూడా పుష్కలంగా తీసుకువస్తుంది.

తేమతో కూడిన వాతావరణం, భారీ వర్షాలు మరియు గాలులతో కూడిన వాతావరణం అనేక అంటువ్యాధులను వ్యాప్తి చేస్తాయి. వర్షాకాలంలో,మన రోగ నిరోధక వ్యవస్థలు బలహీనపడతాయి ఇది నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు పెరగడానికి దారితీస్తుంది.వర్షాకాలంలో, అనేక వైరస్ లు, బ్యాక్టీరియా మరియు ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఇతర సీజన్ లతో పోలిస్తే రెట్టింపు అవుతుంది. పెరిగిన గాలి తేమ, మరియు తేమ బూజు, శిలీంధ్రాలు మరియు బ్యాక్టీరియాతో సహా సూక్ష్మజీవుల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది, అలాగే ప్రమాదకరమైన సూక్ష్మక్రిములు, ఇది అనేక రకాల వ్యాధుల వ్యాప్తికి దారితీస్తుంది డాక్టర్ ఎండి సిహెచ్. తిరుపతిరావు ఆన్నారు.అనేక ఋతుపవన వ్యాధులు ఒకరి ఆరోగ్యంపై గణనీయమైన ప్రతికూల ప్రభావాన్ని చూపే వరకు నిర్ధారణ చేయలేరు. ముందస్తుగా గుర్తించడం మరియు కొన్ని ప్రాథమిక నివారణ మరియు పరిశుభ్రత విధానాలు ఈ కాలంలో మిమ్మల్ని సురక్షితంగా ఉంచుతాయి.

అత్యంత తరచుగా వచ్చే కొన్ని ఋతుపవన వ్యాధులు, అదేవిధంగా కొన్ని నివారణ చిట్కాలను మనం ఇప్పుడు చూద్దాం



**మలేరియా:**

మలేరియా అనాఫిలిస్ అని పిలువబడే దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. మలేరియా కలిగించే పరాన్నజీవి అనాఫిలిస్ మినిమస్ వర్షాకాలంలో సంతానోత్పత్తి చేస్తుంది. ఈ వ్యాధి ఎక్కువగా నీటిలో మరియు నీటి ప్రవాహాలలో దోమలు సంతానోత్పత్తి చేయడం వల్ల నీరు నిలిచిపోవడం వల్ల సంభవిస్తుంది, ఇది తీవ్రమైన జ్వరాన్ని 105 డిగ్రీల సెల్సియస్ వరకు, కలిగిస్తుంది, ఇది చాలా రోజులు ఉంటుంది. మలేరియా లక్షణాలలో అధిక జ్వరం, శరీర అసౌకర్యం, చలి మరియు అధిక చెమట వంటివి ఉంటాయి.

డెంగ్యూ జ్వరం,డెంగ్యూ జ్వరం దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది, ఇది నిలకడగా ఉన్న నీటిలో సంతానోత్పత్తి చేస్తుంది. బక్కెట్లు, డ్రమ్ములు, పూల కుండలు, బావులు మరియు చెట్ల రంధ్రాలు వంటివి. దోమ కుట్టిన తరువాత డెంగ్యూ జ్వరం అభివృద్ధి చెందడానికి నాలుగు నుండి ఏడు రోజులు పడుతుంది. డెంగ్యూ జ్వరం అధిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, తక్కువ ప్లేట్ లెట్ కౌంట్ మరియు హైపర్ సెన్సిటివిటీ ద్వారా వర్గీకరించబడుతుంది.

**చికున్ గున్యా:**

చికున్ గున్యా అనేది దోమలు ద్వారా వ్యాప్తి చెందే ప్రాణాంతకం కాని వైరల్ వ్యాధి, ఇది నిలకడగా ఉన్న నీటిలో పొదగబడుతుంది. ఈ దోమలు నిలకడగా ఉన్న నీటిలో సంతానోత్పత్తి చేస్తాయి మరియు రాత్రిపూట మాత్రమే కాకుండా పగటిపూట కూడా మిమ్మల్ని కాటు వేయగలవు. వీటిని ఓవర్ హెడ్ ట్యాంకులు, మొక్కలు, పాత్రలు మరియు నీటి పైపుల్లో కనుగొనవచ్చు. చికున్ గున్యా లక్షణాలలో తలనొప్పి, కండరాల నొప్పి, తీవ్రమైన కీళ్ల నొప్పి, అధిక జ్వరం, అలసట మరియు చలి వంటివి ఉంటాయి

**టైఫాయిడ్:**

టైఫాయిడ్ అనేది సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వల్ల నీటి ద్వారా వ్యాపించే వ్యాధి, ఇది తగినంత పారిశుధ్యం లేకపోవడం వల్ల వ్యాప్తి చెందుతుంది. చెడిపోయిన లేదా బహిర్గతమైన ఆహారాన్ని తినడం మరియు కలుషితమైన నీటిని త్రాగడం ద్వారా టైఫాయిడ్ వ్యాప్తి చెందుతుంది. టైఫాయిడ్ జ్వరం అంటువ్యాధి. ఇది వర్షాకాలంలో వచ్చే అనారోగ్యం. కలుషితమైన ఆహారం మరియు నీరు ఈ వ్యాధికి అత్యంత సాధారణ కారణాలు. టైఫాయిడ్ లక్షణాలలో ఎక్కువసేపు అధిక ఉష్ణోగ్రత, బలహీనత, పొత్తికడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి, జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పి, గొంతు నొప్పి మరియు వాంతులు ఉంటాయి.

**కలరా:**

కలరా పారిశుధ్యం మరియు పరిశుభ్రత లోపించడం, అలాగే కలుషితమైన ఆహారం మరియు నీరు తీసుకోవడం వల్ల వస్తుంది, మరియు విరేచనాలు మరియు చలనాన్ని కోల్పోవడం వల్ల వస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే కలరా ప్రాణాంతకం కావచ్చు. తక్కువ రక్తపోటు, కండరాల తిమ్మిరి, వేగవంతమైన హృదయ స్పందన రేటు మరియు పొడి శ్లేష్మ పొర కలరా యొక్క కొన్ని సంకేతాలు.

**కామెర్లు:**

కామెర్లు అనేది నీటి ద్వారా వ్యాపించే వ్యాధి. ఇది కలుషితమైన ఆహారం మరియు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది, అదేవిధంగా తగినంత పారిశుధ్యం లేకపోవడం వల్ల కాలేయం విఫలం అవుతుంది. శరీరం బిలిరుబిన్ ను సరిగ్గా జీవక్రియ చేయనప్పుడు, ఇది చర్మం, శ్లేష్మ పొరలు మరియు కళ్ళు పసుపుగా మారడానికి కారణమవుతుంది. కామెర్లు సాధారణంగా అంతర్లీన పరిస్థితి వల్ల వస్తుంది, ఇది కాలేయం ఎక్కువ బిలిరుబిన్ ను ఉత్పత్తి చేయడానికి కారణమవుతుంది లేదా దానిని తొలగించకుండా నిరోధిస్తుంది.కామెర్లు బలహీనత మరియు అలసటకు కారణమవుతాయి, అలాగే పసుపు మూత్రం, కళ్లు పసుపుగా మారడం మరియు వాంతులు అవుతాయి.

**జలుబు మరియు ఫ్లూ:**

అత్యంత తరచుగా వైరల్ ఇన్ఫెక్షన్లు, జలుబు మరియు ఫ్లూ, ఋతుపవనాలు ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పుల వల్ల ప్రేరేపించబడతాయి. జలుబు మరియు ఫ్లూ అనేవి ముక్కు, నోరు, గొంతు మరియు ఊపిరితిత్తులతో సహా ఎగువ శ్వాసకోశ వ్యవస్థ యొక్క అనారోగ్యాలు. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ ఉన్న వ్యక్తులు..ముక్కు కారటం, గొంతు నొప్పి, నీరు కారడం, కళ్ళు, జ్వరాలు మరియు చలికి కారణమయ్యే అంటువ్యాధులకు ఎక్కువగా గురవుతారు.

**లెప్టోస్పిరోసిస్:**

లెప్టోస్పిరోసిస్ అనేది బ్యాక్టీరియా సంక్రమణ, ఇది జంతువుల నుండి మానవులకు వ్యాప్తి చెందుతుంది. అనేక జంతువులు ముఖ్యంగా కుక్కలు, ఎలుకలు మరియు వ్యవసాయ జంతువులు, జీవిని తీసుకువెళతాయి, ఇది వారి మూత్రం ద్వారా మట్టి మరియు నీటిలో కలుస్తుంది. నీటితో నిండిన భూభాగం గుండా వెళ్ళేటప్పుడు, ఈ వ్యాధి ప్రధానంగా బహిరంగ గాయాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. తలనొప్పి, కండరాల అసౌకర్యం, వాంతులు, విరేచనాలు మరియు చర్మంపై దద్దుర్లు వంటివి లెప్టోస్పిరోసిస్ యొక్క కొన్ని లక్షణాలు ఉంటాయి.. డాక్టర్ ఎండి సిహెచ్. తిరుపతిరావు అన్నారు.

# భారత స్వయంసమృద్ధిలో యోగా కీలక పాత్ర

**ముంబై, ఆగస్టు 9:** స్వామి రాందేవ్ దార్శనికత లక్షలాది మందికి యోగాను అందించింది. రైతులకు సాధికారత కల్పించింది. ఆయుర్వేదాన్ని ప్రోత్సహించింది. స్వావలంబనను పెంచింది. భారతదేశాన్ని ఆరోగ్యకరమైన, సాంస్కృతికంగా గొప్ప , ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దేశంగా తీర్చిదిద్దింది. బాబా రామ్‌దేవ్ ప్రతి ఇంటికి యోగాను తీసుకువచ్చారని, కంపెనీ ద్వారా రైతులకు సాధికారత కల్పించారని, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించారని పతంజలి ఆయుర్వేదం పేర్కొంది. భారతదేశాన్ని సాంస్కృతికంగా సంపన్నం చేయడంలో ఆయన సహకారం గణనీయంగా ఉందియోగా గురువుగా ప్రసిద్ధి చెందిన స్వామి రామ్‌దేవ్ భారతదేశాన్ని ఆరోగ్యంగా, స్వావలంబనగా మార్చడానికి ఒక ప్రత్యేకమైన దార్శనికతను అందించారని పతంజలి సంస్థ తెలిపింది. బాబా రామ్‌దేవ్ నాయకత్వంలో, పతంజలి ఆయుర్వేదం యోగా, ఆయుర్వేదాన్ని ప్రోత్సహించడమే కాకుండా భారతదేశ ప్రాచీన సంప్రదాయాలను ఆధునిక అవసరాలతో అనుసంధానించింది. వాటికి కొత్త దిశను ఇచ్చిందని పతంజలి తెలిపిది. ఆరోగ్యకరమైన శరీరం, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ ఏ దేశ పురోగతికైనా పునాది అని స్వామి రామ్‌దేవ్ విశ్వసిస్తున్నారు."స్వామి రాందేవ్ , ఆచార్య బాలకృష్ణ నాయకత్వంలో, దేశం ఆరోగ్యం, స్వావలంబనలో ఒక విప్లవాన్ని చూస్తోంది" అని పతంజలి ఆయుర్వేద



పేర్కొంది. ఈ సంస్థ యోగాను ప్రతి ఇంటికి తీసుకెళ్లింది, లక్షలాది మంది క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా వారి శారీరక , మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేలా చేసింది. ఒత్తిడి, మధుమేహం , గుండె జబ్బులు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడే కపాల్‌భతి , అనులోమ-విలోమ వంటి ప్రాణాయామం, ఆసనాలను స్వామి రాందేవ్ ప్రాచుర్యంలోకి తెచ్చారు. అదనంగా, మూలికా మందులు, సౌందర్య సాధనాలు ,ఆహార పదార్థాలతో సహా పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు ప్రజలకు సహజ , శీయ ప్రత్యామ్నాయాలను అందిస్తున్నాయి.""స్వామి రామ్‌దేవ్ స్వప్నం కేవలం ఆరోగ్యానికే పరిమితం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పతంజలి 'ఫామ్ టు ఫార్మసీ' నమూనాను స్వీకరించింది. దీని కింద ఔషధ మూలికలను రైతుల నుండి నేరుగా సేకరిస్తారు. ఇది రైతుల ఆదాయాలను పెంచడమే కాకుండా సేంద్రీయ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహించింది. పతంజలి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకుకూడా మద్దతు ఇచ్చింది, చిన్న వ్యాపారాలు పెద్ద మార్కెట్లను పొందే అవకాశాన్ని కల్పించింది."స్వామి రామ్‌దేవ్ దార్శనికత భారతదేశాన్ని ఆయుర్వేదంలో ప్రపంచ నాయకుడిగా మార్చడం కూడా. పతంజలి తన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో అందుబాటులో ఉంచడానికి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆచార్య బాలకృష్ణ 330 కి పైగా పరిశోధనా పత్రాలు, 200 కి పైగా పుస్తకాలు ఆయుర్వేదానికి శాస్త్రీయ పునాదిని అందించాయి" అని పతంజలి ప్రకటించింది. "స్వామి రామ్‌దేవ్ సామాజిక వ్యవస్థాపకత , గ్రామీణాభివృద్ధి చొరవలు ఆయనను లక్షలాది మందికి ప్రియమైన వ్యక్తిగా చేశాయి. భారతదేశాన్ని ఆరోగ్యకరమైన, స్వావలంబన , సాంస్కృతికంగా సంపన్న దేశంగా మార్చడంలో స్వామి రామ్‌దేవ్ సహకారం గణనీయమైనది. ఆయన ప్రయత్నాలు ప్రజల జీవితాలను మెరుగుపరచడమే కాకుండా స్వదేశీ ఉత్పత్తులు , సహజ నివారణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశం ప్రపంచ గుర్తింపును కూడా బలోపేతం చేశాయి" అని పతంజలి పేర్కొంది.

# విమానాలు ఎందుకు రద్దవుతున్నాయి...

**న్యూయార్క్, ఆగస్టు 9:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాలను విధించే పనిలో ఉండగా.. మరోవైపు ఆ దేశంలో ప్రయాణ సాధనాల్లో అంతరాలు ఏర్పడుతున్నాయి. తాజాగా అమెరికాలోని కొన్ని విమాన సర్వీసులు ఆలస్యంగా సాగగా.. మరికొన్ని విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ప్రపంచంలోని పని దేశాలతో సంబంధాలు ఉన్న అమెరికాలో ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం వల్ల చాలా దేశాలకు సమస్యలు ఏర్పడ్డాయి. ఎందుకంటే ఈ విమాన సర్వీసుల ద్వారా కేవలం ప్యాసింజర్స్ మాత్రమే కాకుండా కొన్ని వస్తువుల రవాణా కూడా నిలిచిపోయింది. 800 విమానాలు రద్దు అయినట్లు తెలుస్తోంది. హ్యూస్టన్ లోని టెర్మినల్ మొత్తం ప్రయాణికులతో నిండిపోయింది. ట్రాక్ లపై ఎక్కడికక్కడే విమానాలు నిలిచిపోయాయి. అయితే విమానాలు రద్దు కావడానికి సాంకేతిక సమస్యలే కారణమని యునైటెడ్ ఎయిర్లైన్స్ సంస్థ తెలిపింది. ఇప్పటివరకు జరిగిన సాంకేతిక సమస్యలను పరిష్కరించే పనిలో ఉన్నట్లు ఆ సంస్థ అధికారికంగా తెలిపింది.విమానాలు రద్దు కావడంతో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేటర్ కూడా స్పందించింది. విమానాల రద్దుకు సాంకేతిక సమస్య అని యునైటెడ్ సంస్థ పేర్కొన్నట్లు.. ఎఫ్ ఏ



ఏ పేర్కొంది. అయితే ఒక్కచోట ఈ సమస్య ఉండడంతో దేశవ్యాప్తంగా విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఆదేశించామని తెలిపింది. మొత్తంగా 826 విమాన సర్వీసుల్లో అంతరాయం కలగగా.. 23 విమానాలు పూర్తిగా రద్దు అయినట్లు అమెరికా మీడియా పేర్కొంది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విమానాలు తిరిగి కొనసాగించడానికి సమయం పడుతుందని తెలపడంతో ప్రయాణికులు టెర్మినల్స్ లో నిరీక్షిస్తున్నారు.అయితే చికాగోలోని ఎయిర్లైన్స్ విమాన సంస్థలు ఒక ప్రకటనలు విడుదల చేశాయి. ప్రయాణికుల సౌకర్యార్థం కోసమే విమానాలను రద్దు చేశామని చెప్పారు. సాంకేతిక సమస్యల వల్ల 35% విమానాలు ఆలస్యంగా నడుస్తాయని.. ఆరు శాతం విమానాలు పూర్తిగా రద్దు చేశామని తెలిపారు. ప్రయాణికుల భద్రతా కోసమే ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొన్నారు. మరో ఎయిర్లైన్స్ సంస్థ స్పందిస్తూ ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణలు చెబుతూనే.. మంచి కోసమే విమానాల సర్వీసులు రద్దు చేశామని తెలిపింది.కవైపు భారత్, అమెరికాల మధ్య సుంకాల విషయంలో చర్చలు కొనసాగుతున్న వేళ ఒక్కసారిగా ఇలా విమానాలు రద్దు కావడంపై ప్రయాణికులతో పాటు అమెరికాలో ఉండే భారతీయులు ఆందోళన చెందుతున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ చేసుకుంటున్న తరుణంలో ఇప్పటివరకు భారత్ పై ఉన్న 25% నుంచి 50% వరకు సుంకాలు పెంచినట్లు ట్రంపు తెలిపారు. అయితే ఇదే సమయంలో విమాన సర్వీసులు రద్దు కావడంపై తీవ్ర చర్చ సాగుతోంది.

# రేవంత్ కొత్త రాజకీయం...

**హైదరాబాద్, ఆగస్టు 9:** జల్సా సినిమాలో డైలాగ్ ఉంటుంది గుర్తుందా.. శత్రువును ఓడించడం అంటే చంపడం కాదు.. గెలవడం.. చాలామందికి ఇది అర్థం కాదు గాని.. దీనిని అర్థమయ్యేలా నిరూపించి చూపిస్తున్నాడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్. " కెసిఆర్ ను చర్లపల్లి జైలుకు పంపించడం ఎందుకు.. ఆయనకు ఫామ్ హౌస్ లో ఉండడమే పెద్ద శిక్ష. నన్ను ఓ చిన్న స్థాయి లీడర్ అని అనుకున్నాడు. తొక్కి తొక్కి అధపాతాళానికి పంపించానని అనుకున్నాడు. చివరికి నా చేతిలోనే ఆయన ఓడిపోయాడు. ఇంతకు మించిన శిక్ష ఇంకేం ఉంటుందని" రేవంత్ ఇటీవల వ్యాఖ్యానించడం విశేషం. తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడిన మాటల ద్వారా కేసిఆర్ ను జైలుకు పంపించే ఉద్దేశం లేదని తెలుస్తోంది. అలాంటి ఉద్దేశం లేని పక్షంలో కమీషన్లను ఎందుకు ఏర్పాటు చేశారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.గొర్రెల పథకం, కాళేశ్వరం, గత ప్రభుత్వం చేపట్టిన వివిధ పనులపై రేవంత్ కమీషన్లను ఏర్పాటు చేశారు. విచారణ అధికారులు ఇప్పటికే కాళేశ్వరం, గొర్రెల కుంభకోణం లో తుది నివేదికలు ఇచ్చారు. ఇందులో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి ఓ ఎస్ డి గా పనిచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాళేశ్వరం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన మురళీధర్, హరి రామ్ నాయక్ ఏసీబీ అదుపులో ఉన్నారు.. ఇంకా ఈ కేసులో మరిన్ని తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని సాక్షాత్తు గులాబీ అధిపతి అన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం



చేసుకోవచ్చు. అయితే ఇంత మందిని అరెస్టు చేస్తున్నప్పటికీ కెసిఆర్ జోలికి తెలంగాణ ముఖ్యమంత్రి వెళ్లకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. "ప్రత్యర్థి కుంగి కృశించి.. నన్ను వదిలేయ్.. ఈ ఓటమిని నేను తట్టుకోలేను. ఈ జాలిని నేను భరించలేను.. అనేతీరుగా కెసిఆర్ విషయంలో రేవంత్ వ్యవహరిస్తున్నారని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.రేవంత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. అంతకుముందు టిడిపి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కెసిఆర్ టార్గెట్ చేసి వేధించారు. ఇబ్బంది పెట్టారు. పర్యాయాలు జైలుకు కూడా తరలించారు. చివరికి ఆయన కూతురు వివాహం ఉన్నప్పటికీ కేసీఆర్ వదిలిపెట్టలేదు. తనను అంతటి ఇబ్బందులకు గురిచేసిన సమయంలో రేవంత్ అనేక పర్యాయాలు కేసిఆర్ ను జైలుకు పంపిస్తానని హెచ్చరికలు జారీ చేశారు. గజ్వేల్ లో కూడా తొడగొట్టి ఇదే తీరుగా సవాల్ కూడా విసిరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ వ్యవహార శైలి ఒక్కసారిగా మారిపోయింది. కెసిఆర్ విషయంలో రేవంత్ జాలి ప్రదర్శిస్తున్నారు. ఉదారతను చూపిస్తున్నారు. అదుపులోకి తీసుకునే అవకాశం వచ్చినప్పటికీ.. ఆ దిశగా అడుగులు వేయడం లేదు.రేవంత్ చేస్తున్న పని జాలి కాదని.. మానసికహింస అని తెలుస్తోంది. వాస్తవానికి కెసిఆర్ 2023 ఎన్నికల ఫలితాలను జీర్ణించుకోలేకపోయారు. తన రాజీనామా లేఖను గవర్నర్ కు ఇవ్వడానికి కూడా ఇష్టపడలేదు. రేవంత్ ముఖ్యమంత్రి కావడాన్ని కెసిఆర్ అసలు జీర్ణించుకోలేకపోయారు. అయినప్పటికీ రేవంత్ కెసిఆర్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఆయన క్షేమం కోరి పరామర్శించారు.. ప్రభుత్వపరంగా ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. రేవంత్ చేతిలో అధికారం ఉన్నప్పటికీ ప్రత్యర్థుల విషయంలో ఏమాత్రం దూకుడు కొనసాగించడం లేదు. ప్రతీకారం తీర్చుకోవడం లేదు.. కాకపోతే ప్రత్యర్థులను ఎలా హింసించాలో అలానే హింసిస్తున్నారు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా అరెస్టు చేయడం లేదు. ఎందుకంటే అలా అరెస్టులు చేస్తే ప్రజల్లో సానుభూతి పెరుగుతుంది. అందువల్లే ప్రత్యర్థులపై మానసికంగా పగ తీర్చుకుంటున్నారు రేవంత్. రాజకీయాలలో సరికొత్త స్టైల్ అవలంబిస్తున్నారు.

## రాజ్యాంగం మార్చాడానికి బీజేపీ కుట్ర..

మహేష్ గౌడ్ ఫైర్



**హైదరాబాద్, ఆగస్టు9 :** రాజ్యాంగం మార్చాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. అలాగే.. ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమం ఏ విధంగా జరిగిందో నేటి యువత తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 1942లో బ్రిటీష్ పాలకులను తరిమి కొట్టాలని అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైనదని ఉద్ఘాటించారు. డూ ఆర్ డై నినాదంతో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం చేశారని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ.. కాంగ్రెస్ చరిత్రను తుడిచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్.. నెహ్రూ, సర్దార్, సుభాష్ చంద్రబోస్ లాంటి నేతలను చరిత్రలో లేకుండా చేద్దామని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర సంస్థలను వాడుకొని ప్రతిపక్షాలపై మోదీ ప్రభుత్వం కుట్ర పూరిత దాడి చేస్తోందని మండిపడ్డారు మహేష్ కుమార్ గౌడ్.

## జిల్లా కలెక్టర్లతో విద్యుత్ శాఖ పై
# భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్



**కరీంనగర్:** గ్రామపంచాయతీ భవనం నుంచి మొదలు సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి.ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ఓ ఎఫ్ఆర్ భూముల వివరాలు పంపండి.సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్ పి డి సి ఎల్, సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు.అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్ కు పంపవచ్చని డిప్యూటీ సీఎం సూచించారు.గ్రామపంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నాం అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయి వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు డిప్యూటీ సీఎం సూచించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసింది ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గం లో ప్రారంభించాం ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కలెక్టర్లు ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండా వారంలోగా వివరాలు పంపండి, ఈ విషయాల్లో ఎలాంటి సందేహాలు ఉన్న విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్, సీఎండీలు, ని సంప్రదించాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా
# ఘనంగా రక్షాబంధన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** రక్షా బంధన్ పండుగను ఈ శనివారం(ఆగస్టు 9) దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమను ప్రతిబింబించే ఈ పండుగ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా దేశంలోని అనేక మంది ప్రముఖులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భగవత్‌కు పలువురు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.రక్షా బంధన్ సందర్భంగా, నాగ్‌పూర్‌లోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో ప్రాంతీయ టిబెటన్ మహిళా సంఘం, భారత్ టిబెట్ సహకార వేదిక సోదరీమణులు RSS చీఫ్ మోహన్ భగవత్‌కు రాఖీ కట్టారు. ఆయనకు ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ సేవిక సమితి సోదరీమణులు, మహల్ ప్రాంగణ నివాసితులు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా, ఆర్ఎస్ఎస్ చీఫ్, ఆర్ఎస్ఎస్ లోని అనేక మంది ముఖ్యులకు భారత్ టిబెట్ సహయోగ్ ఉద్యమ మహిళా కార్యకర్తలు రాఖీలు కడుతున్నారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్ మహిళలకు స్వీట్లు బహుకరించారు.అంతకుముందు, ఢిల్లీలోని 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాసంలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాఖీ కట్టి, ఆయనకు దీర్ఘాయుష్షును ప్రసాదించాలని కోరుకున్నారు. ఈ సమయంలో, ప్రధానమంత్రి మోదీ కూడా విద్యార్థులందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ '%శ%'లో ఒక పోస్ట్ ద్వారా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'రక్షా బంధన్ సందర్భంగా దేశవాసులందరికీ శుభాకాంక్షలు' అని ఆయన రాశారు.ప్రతి సంవత్సరం శ్రావణ మాసం పౌర్ణమి రోజున అన్నదమ్ముల ప్రేమ పండుగను జరుపుకుంటారు. ఈ పండుగ రోజున, సోదరీమణులు తమ సోదరుల మణికట్టుపై రక్ష సూత్రాన్ని కడతారు. ఈ పండుగ భారతీయ సంస్కృతిలో అంతర్భాగం మరియు మతపరమైన మరియు పౌరాణిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. రక్షా బంధన్ పండుగ సారాంశం ఏమిటంటే, తమ సోదరుల దీర్ఘాయుష్షు, ఆనందం కోసం సోదరీమణుల ప్రార్థనలు చేస్తారు. తమ సోదరీమణులను రక్షించడానికి సోదరుల వాగ్దానం చేస్తారు. ఈ సంవత్సరం ఈ పండుగ సంబంధాలకు మాత్రమే కాకుండా, దేశం, సమాజం పట్ల బాధ్యత బంధానికి కూడా చిహ్నంగా మారింది.

**రాఖీ పండుగ అంటే కేవలం ఒక దారం కాదు: పవన్ కల్యాణ్**

రాఖీ పండుగ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. అక్కచెల్లెళ్లకు, అన్నదమ్ములకు మధ్య అనుబంధాన్ని చూపే వేడుక రాఖీ పౌర్ణమి అని ఆయన చెప్పారు. రాఖీ అంటే కేవలం ఒక దారం కాదని... అది మన మధ్య అనుబంధాలకు భావోద్వేగాల సంకేతమని పేర్కొన్నారు. మహిళలకు మేలు చేయడానికి తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యతను ఇస్తోందని పవన్ తెలిపారు. తల్లికి వందనం, దీపం-2 పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.

# అన్నకు దూరంగా కవిత

**హైదరాబాద్, ఆగస్టు 9:** తెలంగాణలో సంబరంగా రాఖీ వేడుకలు జరుగుతున్నాయి. చాలా మంది నేతలకు అక్కచెల్లెమ్మలు రాఖీలు కడుతున్నారు. కానీ యావత్ మీడియా ఆసక్తి మాత్రం ఇద్దరిపై ఉంది. వాళ్లే కేటీఆర్, కవిత. ఇద్దరి మధ్య రాజకీయ విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతూ వచ్చింది. అయితే కేసీఆర్ కుటుంబంలో అలాంటి విభేదాలకు తావులేదని బీఆర్ఎస్ కవర్ చేస్తూ వచ్చింది. మొన్న కేటీఆర్‌కు సోషల్ మీడియా వేదికగా బర్త్‌డే శుభాకాంక్షలు చెప్పిన కవిత... రక్షాబంధన్ రోజు రాఖీ కడతారా లేదా అనేది చాలా మందికి అనుమానం. కానీ ఇంత వరకు ఒకరినొకరు విష్ చేసుకోవడం కానీ రాఖీ కట్టించుకున్న ఫొటోలు, వీడియోలు కానీ బయటకు రాలేదు. కవిత రాఖీకి కేటీఆర్ దూరంగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఉన్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఎమ్మెల్యేల అనర్హత కేసుతోపాటు ఎమ్మెల్సీలపై కూడా అనర్హత వేటు వేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తుంది. ఆ కేసు విషయంలోనే న్యాయవాదులతో చర్చలు జరపడానికి ఢిల్లీ వెళ్లినట్టు చెబుతున్నారు. ఇది సందర్భం కాదు కదా అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కవిత రాఖీకి కేటీఆర్ కావాలనే దూరంగా ఉన్నారని ఆమె వర్గీయులు ఆరోపిస్తున్నారు. రాజకీయాల్లో యాక్టివ్ అయిన తర్వాత ఇలా కవితతో కేటీఆర్ రాఖీ కట్టించుకోకపోవడం ఇది సెకండ్ టైం. గతంలో ఆమె జైల్లో ఉన్నప్పుడు కూడా రాఖీ కట్టించుకోలేదు. ఆ సందర్భంగా ఎమోషనల్ ట్వీట్ చేశారు. జైల్లో ఉన్న కారణంగా రాఖీ కట్టలేకపోవచ్చేమో కానీ కష్ట సుఖాల్లో వెన్నంటే ఉంటాను అంటూ అప్పట్లో భావోద్వేగమైన ట్వీట్ చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో కవిత ఉన్నారు.కేటీఆర్ ఢిల్లీలో ఉన్నారు. రాఖీ కూడా కట్టించుకోలేదు. సాధారణంగా అందరికీ చెప్పినట్టుగానే రాఖీ శుభాకాంక్షలు చెబుతూ కవిత ట్వీట్ చేశారు. కేటీఆర్ మాత్రం ఈ ఉదయం నుంచి ఎక్స్‌లో ఎలాంటి పోస్ట్‌లు చేయలేదు. దీంతో కవిత పోస్టు కింద అభిమానులు చాలా ప్రశ్నలు అడుగుతున్నారు. కేటీఆర్‌కు రాఖీ కట్టారా లేదా కడతారా అని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ విభేదాల నేపథ్యంలో అన్న కేటీఆర్‌కు రాఖీ కడతారా అని గతంలో ఓ మీడియా ఇంటర్వ్యూలో అడిగితే రాజకీయా రాజీకయాలేనని రాఖీ రాఖీయే అన్నారు. కచ్చితంగా అందుబాటులో ఉంటే కడతానంటూ చెప్పుకొచ్చారు కవిత. కానీ కేటీఆర్ మాత్రం అందుబాటులో లేకుండా ఢిల్లీ వెళ్లిపోయారని కవిత వర్గీయులు చెబుతున్నారు. చాలా కాలంగా పార్టీలో తనపై కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటూ వచ్చారు కవిత. అయితే నేరుగా ఎక్కడా అన్నపై ఎలాంటి ఆరోపణలు చేయలేదు. తనకు పార్టీలో అన్యాయం జరుగుతోందని గళమెత్తారు. ఇప్పటికి కూడా కేసీఆర్ నాయకత్వానికి జై కొడుతున్న కవిత అన్న నాయకత్వంపై నోరు విప్పడం లేదు. దీంతో కవిత, కేటీఆర్ మధ్య దూరం పెరిగిందని గుసగుసలు వినిపించాయి. ఇప్పుడు రాఖీ పండగతో అవి గుసగుసలు కాదు నిజమే అనే క్లారిటీ వచ్చిందని అంటున్నారు పొలిటికల్ విశ్లేషకులు.



## మీ 10 ఏళ్ల అవినీతికి మేం రక్ష..
## మా దోపిడీకి మీరు రక్ష

ఇదీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరు.?

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్:** అందుకే అవినీతికి పాల్పడ్డారని తెలినా కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోవడం లేదు. విద్యుత్ కొనుగోళ్ల కమిషన్ నివేదికను కేబినెట్ లో ఎందుకు చర్చించలేదు? పెద్ద ఎత్తున వాటా ముట్టినందునే దీనిపై కాంగ్రెస్ నోరు మెదపడం లేదా, ఫోన్ ట్యాపింగ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విచారణపై మాకు నమ్మకం లేదు. జడ్జీలను, సీఎం, కేంద్ర అధికారులను పిలిచి విచారించే స్థాయి సిట్ కు లేదు సీబీఐ విచారణ కోరడానికి అనేక కారణాలున్నాయి. కేంద్రం నేరుగా జోక్యం చేసుకునే అవకాశమే ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు, ఫోన్ ట్యాపింగ్ పై కుటుంబ సభ్యులతో కలిసి గుడిలో ప్రమాణం చేసే దమ్ముందా? ఫోన్ ట్యాపింగ్ జరిగిందని నేను దేవుడి సాక్షిగా ప్రమాణం చేసేందుకు సిద్ధం దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలి. కేటీఆర్ లెక్క కొంపలు ముంచే తెలివి నాకు లేదు ఎస్ఐబీని నీచమైన పనులకు వాడుకున్న దుర్మార్గులా మాకు చెప్పేది? బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం, రోషం ఉంటే ఆ పార్టీని వదిలి బయటకు రావాలి కవితకు కూడా నోటీసులిచ్చి ఫోన్ ట్యాపింగ్ పై విచారణ జరపాలి. ఫోన్ ట్యాపింగ్ కాలేదని హరీష్ రావు ప్రమాణం చేయగలరా?

**కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్:**

కుటుంబ సభ్యులు, జర్నలిస్టులతో కలిసి రాఖీ సంబురాలు జరుపుకున్న కేంద్ర మంత్రి. రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మీ 10 ఏళ్ల అవినీతికి మేం రక్ష..మా దోపిడీకి మీరు రక్ష. అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరికొకరు అవినీతి, దోపిడీలకు రక్షగా నిలుస్తూ ప్రజలను వంచిస్తున్నాయి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని తేలినా కేసీఆర్ కుటుంబంపై కాంగ్రెస్ చర్యలు తీసుకోకపోవడానికి ఆ రెండు పార్టీల మధ్యనున్న 'రక్షా' బంధమే కారణమని ఎద్దేవా చేశారు.

## మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి
# రాఖీ కట్టిన మంత్రి సీతక్క

అన్న చెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతి రూపం రాఖీ పండుగ అన్న మంత్రి



**హైదరాబాద్:** రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని శనివారం నాడు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క..రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి మంత్రుల నివాస సముదాయంలో ఆయనకు రాఖీ కట్టారు. ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకుని రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీతక్క తనకు సొంత సోదరి లాగా అని మంత్రి తన ఆప్యాయతను వ్యక్తం చేశారు. అన్న చెల్లెళ్ల,అక్క తమ్ముళ్ళ అని అనుబంధాన్ని చాటే రాఖీ పండుగ ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# కవిత దారెటు..



**హైదరాబాద్, ఆగస్టు 9:**బీఆర్ఎస్ పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ లీక్ వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. కేసీఆర్ చుట్టు దెయ్యాలు ఉన్నాయంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. లీఖను లీక్ చేసిన వారి పేర్లను బయటిపెట్టాలని%ొ% పార్టీని ప్రక్షాళన చేయాలంటూ కూడా కామెంట్స్ చేస్తున్నారు. ఇదే సమయంలో పార్టీకి దూరంగా ఉంటున్న కవిత జాగృతి సంస్థ పేరుతో యాక్టివ్ గా కార్యక్రమాలు చేపడుతున్నారువరంగల్ సభ తర్వాత కవిత%ొ% పార్టీ అధినేత కేసీఆర్ కు రహస్య లేఖ రాశారు. అయితే ఈ లేఖ బయటికొచ్చింది. ఈ విషయాన్ని కవిత తీవ్రంగా పరిగణించారు. పార్టీలోని కొంత మంది కోవర్టులు%ొ%లేఖను బయటపెట్టారని ఆరోపించారు. కేసీఆర్ దేవుడని.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. అప్పట్నుంచి ఆమె పార్టీ కార్యాలయానికి కాదు.. వ్యవహారాలకు కూడా దూరంగా ఉంటున్నారు.లేఖ లీక్ తర్వాత%ొ% పార్టీపై కూడా కవిత కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. అప్పటి నుంచి ఆ దెయ్యాలు ఎవరు అంటూ కవితను అడుగుతుండగా%ొ%. సమయం వచ్చినప్పుడు బయటపెడతానంటూ ఆమె దాటవేస్తూ వచ్చారు. కట్ చేస్తే ఆమె పూర్తిగా పార్టీకి దూరంగా ఉంటూ కార్యక్రమాలు చేస్తున్నారు. జిల్లాల వారీగా పర్యటిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నేతలు ఎక్కడ కూడా పాల్గొనటం లేదు. కేవలం జాగృతి కార్యకర్తలు, అనుచరులు మాత్రమే ముందు వరుసలో ఉంటున్నా.కవిత గత కొంతకాలంగా బీసీల అజెండాతోనే ముందుకెళ్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా జాగృతి కమిటీలను కూడా బలపేతం చేస్తున్నారు. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ ను కూడా స్వాగతించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు కూడా తన దారికే వస్తారంటూ కామెంట్స్ చేశారు. తాజాగా ఇందిరాపార్క్ వద్ద దీక్షను కూడా చేపట్టారు. బీసీల రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు.ఇక ఇటీవలే పార్టీకి చెందిన సీనియర్ నేత జగదీశ్ రెడ్డిపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. లిల్లీపుట్ అంటూ ఎద్దేవా చేశారు. నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేసిన వ్యక్తి అంటూ మాట్లాడారు. కేసీఆర్ లేకుంటే జగదీశ్ రెడ్డి ఎక్కడ ఉండే వారిని ప్రశ్నించారు.అంతేకాకుండా రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో యువ నాయకుడిని ఉద్దేశిస్తూ కూడా కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కూడా సీరియస్ గానే ఉంది. సీనియర్ నేత అయిన జగదీశ్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.మొత్తంగా బీఆర్ఎస్ కు దూరంగా ఉంటున్న కవిత%ొ%. జాగృతి జెండాతోనే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో ఆఫీస్ ప్రారంభించిన కవిత%ొ% రాబోయే రోజుల్లో సంస్థను మరింత బలోపేతం చేస్తారని తెలుస్తోంది. అయితే ఆమె కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో కూడా ఉన్నారన్న విశ్లేషణలు, అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే కవిత మాత్రమే%ొ% తాను బీఆర్ఎస్ కు నష్టం చేకూర్చే ప్రయత్నాలు చేయనంటూ కూడా చెబుతూ వస్తున్నారు.లేఖ లీక్ నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బీఆర్ఎస్ అధినాయకత్వం అన్నింటిని సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కవితపై చర్యలు తీసుకునే విషయాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే అలా జరిగితే కవిత.. నెక్స్ట్ ఏం చేస్తారనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది..! ఇలా కాకుండా%ొ% కవిత యూటర్న్ తీసుకొని కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తారా అన్న చర్చ కూడా ఓవైపు నుంచి వినిపిస్తోంది..!

# మేడారానికి రైలు దిశగా అడుగులు

**వరంగల్, ఆగస్టు 9:**మేడారానికి రైలు మార్గం వేయాలని.. అది కూడా మణుగూరు నుంచి వేయాలని ఎంపీ ఈటెల రాజేందర్ కేంద్రానికి రిక్వెస్ట్ చేశారు. 15 ఏళ్ల నుంచి ఈ ప్రతిపాదన ఉందని.. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి నిర్ణయం తీసుకోవాలని ఈటెల కోరారు. ఈ రైల్వే లైను అందుబాటులోకి వస్తే.. విజయవాడ, ఖమ్మం, కొత్తగూడం నుంచి వచ్చే వారికి ప్రయాణ సమయం, ఖర్చులు తగ్గే అవకాశం ఉందంటున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర.. తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచింది. రెండేళ్లకు ఒకసారి జరిగే వన దేవతల జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక.. పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. సుమారు కోటికి మందికి పైగా భక్తులు.. తల్లులను దర్శించుకుని.. మొక్కులు చెల్లించుకుంటారు. నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఈ వేడుక కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కూడా కేటాయిస్తుంది. ఈక్రమంలో తాజాగా పార్లమెంటు సమావేశంలో మేడారం జాతర గురించి కీలక అంశం చర్చకు వచ్చింది. మేడారానికి రైలు మార్గం మరోసారి తెర మీదకు వచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. మేడారానికి రైలు మార్గం వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఈ ప్రతిపాదన ఇప్పటిది కాదు.. గత 15 ఏళ్ల నుంచి సాగుతుంది. భద్రాద్రి జిల్లా మణుగూరు నుంచి తాడ్వాయి(మేడారం) మీదుగా రాఘవపురం వరకు కొత్త రైల్వే లైను వేయాలని ఈటల రాజేందర్ కోరారు. బుధవారం నాడు పార్లమెంట్‌లో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. అలానే మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని రిక్వెస్ట్ చేశారు.మేడారానికి రైల్వే లైను ప్రతిపాదన గత 15 ఏళ్లుగా సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం గనుక దీనికి అనుమతిస్తే.. వరంగల్‌లో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాల అభివృద్ధితో పాటుగా సింగరేణి నుంచి బొగ్గు, ఇతర అటవీ ఉత్పత్తులను రవాణా చేయడం సులభం అవుతుంది. దీనితో పాటుగా వరంగల్, కాజీపేట రైలు మార్గాలు సైతం మణుగూరుకు కలిసే అవకాశం ఉంది. పైగా ఈ రైల్వే లైను ప్రతిపాదన ఆమోదం పొందితే మణుగూరు నుంచి తాడ్వాయి వరకు ఇకో టూరిజం అభివృద్ధికి బాటలు పరిచినట్లు అవుతుంది.ఈ రైల్వే లైను అందుబాటులోకి వస్తే.. ఇతర



రాష్ట్రాల నుంచి మేడారం జాతరకు వచ్చే భక్తులకు సమయం, ఖర్చులు తగ్గుతాయి. ఖమ్మం, కొత్తగూడెం, విజయవాడ నుంచి జాతరకు వచ్చే భక్తులు వరంగల్ నుంచి కాకుండా.. డైరెక్ట్‌గా మణగూరు నుంచి మేడారం వేళ్లే అవకాశం లభిస్తుంది. ఈ రైల్వే లైను కోసం కేంద్రం సర్వే జరపగా.. మూడు మార్గాలను ప్రతిపాదించారు. దీనిలో ఏదో ఒకదానికి కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉందంటున్నారు. ఈ రైల్వే లైన్‌కున్న ప్రధాన అడ్డంకి ఏదంటే.. అటవీ శాఖ నుంచి భూములు సేకరించడమే అంటున్నారు అధికారులు.

# హైదరాబాద్ నగరానికి ఏమైంది

**హైదరాబాద్, ఆగస్టు 9:**ఎంత మంది పాలకులు మారినా ఏమున్నది గర్వకారణం.. ఒక్క భారీ వర్షానికే హైదరాబాద్ మునుగుతున్నది నిజం అని హైదరాబాదీలంతా నెత్తినోరు కొట్టుకుంటున్న పరిస్థితి. విశ్వనగరం అంటూ నాలాలు మూసేసి.. చెరువులను కబ్జా చేసి.. ఎక్కడికక్కడ నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మాణాలు ఇల్లు కట్టడంతో చిన్న వానకే హైదరాబాద్ మునుగుతోంది. భారీ వర్షాలకు ఇక హైదరాబాద్ అంతా జలమయం అవుతోంది.హైదరాబాద్ నగరాన్ని మరోసారి భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నగరవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమవుతోంది. ముఖ్యంగా మూసీ నది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అధికారులు హై అలెర్ట్ జారీ చేశారు.వరుసగా కురుస్తున్న వర్షాలతో హిమాయత్‌సాగర్ జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. జలాశయం పూర్తిగా నిండటంతో అధికారులు గేట్లు ఎప్పుడైనా తీయొచ్చని హెచ్చరికలు జారీ చేశారు. దీనివల్ల మూసీ నదిలోకి నీటి ప్రవాహం మరింతగా పెరగనుంది. దీంతో మూసీ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మూసీ పరివాహక ప్రాంతమైన చంద్రాయణగుట్ట, ఎగ్జిబిషన్ గ్రౌండ్, అంబర్‌పేట, మలక్‌పేట, ముసరాంబాగ్, చాదర్ ఘాట్, కాచిగూడ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అత్యంత జాగ్రత్త వహించాలన్న విజ్ఞప్తి చేశారు. అవసరమైతే తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని



సూచించారు.ప్రజలకు ఎలాంటి అత్యవసర సహాయం అవసరమైనా వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 040-21111111 ను సంప్రదించవచ్చని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. ఈ నంబరుకు ఫోన్ చేస్తే వరద ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకొని తక్షణ సహాయం అందిస్తాయి. ఈ జాగ్రత్తలు తీసుకోవాలి ముంపు ప్రాంతాల్లో ఉండే వారు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. విద్యుత్ సరఫరా పరికరాల నుండి దూరంగా ఉండాలి. ప్రభుత్వ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకూడదు. అవసరమైతే ఎలాంటి సంకోచం లేకుండా హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలిహైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మీ జాగ్రత్తే మీ రక్షణ. సహాయానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది.

# తులసి మొక్కకు రాఖీ కట్టి పర్యావరణ ప్రేమ చాటిన చిన్నారి గానవి

**హైదరాబాద్, అత్తాపూర్:**రక్షాబంధన్ పండుగను ప్రత్యేకంగా మార్చుతూ, అత్తాపూర్‌లో నివసించే చిన్నారి గానవి తన పర్యావరణ ప్రేమను చూపించింది. అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగను ఈసారి ఆమె భిన్నంగా జరుపుకుంది.ప్రకృతే మనకు నిజమైన రక్షకుడిగా భావించిన గానవి, తులసి మొక్కకు రాఖీ కట్టి, "పర్యావరణం మనను రక్షిస్తుంది, మనం కూడా పర్యావరణాన్ని రక్షించుకోవాలి" అనే సందేశాన్ని అందించింది. చిన్నారి తల్లిదండ్రులు రాజేష్, జ్యోతి తెలిపారు: "మా కూతురు చిన్న వయసులోనే ప్రకృతి ప్రాధాన్యతను అర్థం చేసుకుంది. తులసి మొక్కకు రాఖీ కట్టి పర్యావరణ సంరక్షణపై అవగాహన కలిగించాలని అనుకుంది" అని గర్వంగా చెప్పారు. ఈ వినూత్న ఆలోచనతో గానవి, రక్షాబంధన్ పండుగను కేవలం మానవ బంధాలకు మాత్రమే కాకుండా, ప్రకృతితోనూ బంధం కట్టే పండుగగా మార్చింది.

## రాఖీ పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు




**హైదరాబాద్:**రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా తెలంగాణ ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది.రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది.ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలనిఆర్టీసీ కోరింది.

## రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది అద్భుతంగా పని చేస్తున్నారు!

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్:**గత రాఖీ పండుగ నాడు ఒక్క రోజే 63 లక్షల మందిని బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేశారు.గత రాఖీకి మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో 1.77 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారు.ఈ రాఖీకి కూడా అదే రీతిలో సిబ్బంది పనిచేస్తున్నారు. సోదరభావానికి ప్రతీకైన రాఖీ పండుగను త్యాగం చేసి నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకుంటూ..ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సోదరులకు రాఖీలు కడుతున్నారు వారందరికీ నా అభినందనలు.ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహిస్తోన్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు రాఖీ పండుగ శుభాకాంక్షలు.

## మారని రైల్వే శాఖ తీరు

**గత అనుభవాల నుండి పాటలు నేర్చుకొని రైల్వే శాఖ**

**సికింద్రాబాద్:**రైల్వే అధికారుల తీరు మారడంలేదు. చివరి నిమిషంలో ట్రైన్ ఫ్లాట్ ఫార్మ్ మారుస్తూ ప్రయాణికుల్ని ప్రమాదంలో నేడుతున్నారు. కుంభమేళా సందర్భంగా ఢిల్లీలో చివరి నిమిషంలో ప్లాట్ ఫారం నెంబర్ చేంజ్ చేస్తూ అనౌన్స్ చేయడంతో 18 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. శనివారం నాడు సికింద్రాబాద్ స్టేషన్ లో ఆదే లోపం మరోసారి పునరావృత్తం అయింది. హైదరాబాద్ టు న్యూ ఢిల్లీ తెలంగాణ ఎక్స్ ప్రెస్ ప్రతిరోజు ప్లాట్ ఫారం నెంబర్ వన్ 1 వస్తుంది. కానీ రైల్వే శాఖ చివరి నిమిషాల్లో ఫ్లాట్ ఫామ్ నెంబర్ 2కు మారుస్తూ అనౌన్స్ చేసింది. దాంతో తో రైల్ మిస్ అవుతుంది అన్న భయాందోళనలో ప్రయాణికులు నేరుగా రైల్వే ట్రాక్ మీదనుండి ప్లాట్ ఫామ్ కు ప్రమాదబరితంగా పరుగులు తీసారు. శనివారం నేడు రాఖీ పౌర్ణమి నేపథ్యంలో భారీగా ప్రయాణికులు వచ్చారు. చివరి నిమిషాల్లో ప్లాట్ఫారం నెంబర్ మార్చడం పట్ల ప్రయాణికులు మండిపడుతున్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలతో వున్నావాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## సైబర్ సెక్యూరిటీ రాజధానిగా హైదరాబాద్

**- షీల్డ్ ఎన్ఎక్స్ జీ 2025**

**సీఐఓ కనెక్ట్ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు**

దేశంలో సైబర్ సెక్యూరిటీకి రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు శాఖల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నగరంలోని పార్క్ హయత్ హోటల్‌లో శుక్రవారం జోహో కార్పొరేషన్‌కు చెందిన మ్యానేజ్‌ఇంజిన్ నిర్వహించిన షీల్డ్ ఎన్ఎక్స్ జీ 2025 సీఐఓ కనెక్ట్ సిరీస్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. తెలంగాణ దేశంలోనే మొట్టమొదటి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింద ..నెలకు 1,200 కుపైగా కేసులు పరిష్కరిస్తోంది. అత్యధిక శిక్ష విధింపు రేటు నమోదు చేసిన ఈ బ్యూరోను జిల్లాల స్థాయికి విస్తరిస్తున్నాం. స్టార్టప్‌లకు, గ్రామీణ ప్రాంత యువతకు సైబర్ మద్దతు అందించేందుకు చర్యలు చేపట్టాం'అని అన్నారు. జోహో సంస్థ తీసుకుంటున్న గ్రామీణ అభివృద్ధి మార్గాన్ని ఈ సందర్భంగా మంత్రి ప్రశంసించారు. పట్టణ%–%గ్రామీణ మధ్య సాంకేతిక అంతరాన్ని తగ్గించాలన్న దిశగా ఇది చక్కటి ఉదాహరణ అన్నారు. డిజిటల్ పరిణామాల దృష్ట్యా డిజిటల్ ఇండియా యాక్ట్, డిపిడిపి యాక్ట్ అమలు కీలకమని పేర్కొన్నారు. ఎథికల్ హ్యాకింగ్ ఫెలోషిప్, సైబర్ హైజీన్ విద్య, ఏఐ ఆధారిత శిక్షణలు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభిస్తుందని మంత్రి తెలిపారు.

## మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

**మహేశ్వరంలో ప్రభుత్వ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనం**

**డాక్టర్ వైద్యం చేసి వేయవలిన కుట్లు,గాజు పెంకును లోపలే పెట్టి కుట్లు వేసిన వాచ్ మెన్**

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్ పై చర్యలు తీసుకోవాలి ు బాధితుల డిమాండ్**



**రంగారెడ్డి:**రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కేంద్రలోని ప్రభుత్వం ఆసుపత్రిలో గత నెల 27వ. తేదీ నా నందిగామ గిరి వర్మ అనే బాలుడు సాయంత్రం సమయంలో బయట ఆడుకుంటుండగా గాజు పెంకు కాళికి గుచ్చుకోవడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకెళ్లారు.డ్యూటీలో ఉన్న డాక్టర్ నిర్లక్ష్యంగా అక్కడే డ్యూటీ లో ఉన్న గేట్ వాచ్మెన్ తో కుట్లు వేయించడం వల్ల గాజు పెంకు కాలులోనే ఉండగానే కుట్లు వేయడం దారుణం.గాయం అయిన కాలు వాపు రావడంతో భయంతో ఒక రెండు రోజులు గడిచిన అనంతరం మరల హాస్పిటల్ కు వెళ్ళగా మాత్రలు రాసి పంపించారు. ఆల మూడు సార్లు వచ్చిన అదే పద్ధతిలో వచ్చిన బాలుడిని పంపించారు.కాలు వాపు మరింత రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ తియగా గాజు పెంకు ఉందిని డాక్టర్ చెప్పగా శుక్రవారం సాయంత్రం అతనికి సర్జరీ చేసి గాజు పెంకు బయటకు తీసారూ.పేద ప్రజలు ప్రవైట్ ఆసుపత్రి వెళ్లలేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే డాక్టర్లు ఇలా నిర్లక్ష్యం చేస్తే పేద ప్రజలు ఎక్కడికి వెళ్లాలి అన్ని బాధితులు ప్రశ్నించారు. అలాగే బాలుడిని ట్రీట్మెంట్ చేసిన డాక్టర్ పైన తగిన చర్యలు తీసుకోవాలిని బాధితులు డిమాండ్ చేశారు.

## రక్షాబంధన్ పండగ సోదరా భావానికి ప్రతిక జిల్లా ఎస్పీ

**రావుల గిరిధర్ జిల్లా ఎస్పీ కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేసిన సరస్వతి శిశు మందిర్ విద్యార్థినిలు**



**వనపర్తి జిల్లా:**శనివారం రోజురాఖి పండగ సందర్భంగా శుక్రవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కి వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థినీలు రాఖీలు కట్టి, స్వీట్స్ పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వారికి ధన్యవాదాలు తెలిపి, జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ అన్నదమ్ములకు అనురాగంతో చేతికి రక్షాబంధనాన్ని కట్టడం గొప్ప సందర్భం... అని దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షాబంధన్ పండగ సోదరా భావానికి ప్రతిక అని తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి సరస్వతీ శిశు మందిర్ విద్యార్థినీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఆధార్ ఆధారిత చెల్లింపులు


**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇకపై ఆధార్ ఆధారిత చెల్లింపులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాంకు ఖాతాలు, ఐఎఫ్ ఎస్ సి, నంబర్లలో తప్పుల వల్ల చాలామంది ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా 9,100 ఆధార్ ఆధారిత చెల్లింపులు చేపట్టగా మెరుగైన ఫలితాలు కనిపించాయి. దీంతో ఇదే విధానంలో చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సినిమా






# కూలీ దెబ్బకు రికార్డులు ఖాళీ



ప్రేక్షకుల్లో కూలీ ఫీవర్ మాములుగా లేదు. సూపర్ స్టార్ రజనీకాంత్ కు దర్శకుడు లోకేష్ కనగరాజ్ తోడవ్వడంతో అంచనాలు అంతకంతా పెరుగుతూ పోతున్నాయి. ట్రైలర్ వచ్చాక కొంచెం మిక్స్ టాక్ వచ్చినప్పటికీ దాని ప్రభావం ఒక్క శాతం లేకపోవడం ట్రేడ్ ని ఆశ్చర్యపరుస్తోంది. తెలుగు రాష్ట్రాల టికెట్ అమ్మకాలు మొదలుపెట్టకుండా కేరళ, తమిళనాడు నుంచే సుమారు నలభై కోట్ల దాకా వసూలు చేయడం కూలీ మేనియాకు నిదర్శనం. ఏపీ తెలంగాణ స్టార్ట్ అయ్యాక ఈ నెంబర్లు ఎక్కడికి చేరుకుంటాయో ఊహించడం కష్టం. బుక్ మై షో సర్వర్ క్రాష్ అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. సలార్ కు అలా జరిగింది. అవర్లీ ట్రెండ్స్ లోనూ కూలీ దూసుకుపోతోంది. సగటున గంటకు అయిదు వేల నుంచి యాభై వేల టికెట్ల మధ్యలో ఊచకోత కొనసాగుతూనే ఉంది. వార్ 2 కన్నా చాలా ముందుగా బుకింగ్స్ మొదలుపెట్టడం కూలీకి బాగా కలిసి వస్తోంది. ఇక్కడే కాదు ఓవర్సీస్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మూడు మిలియన్లు దాటేసిన తలైవర్ మొదటి షో పడే టైంకి ఏ నెంబర్ దగ్గర ఆగుతాడో అంచనా వేయడం కష్టమనేలా ఉంది. విదేశాల్లో కూలి మేనియా మాటలకు అందడం లేదు. ప్రభుత్వ పోలీసులు సైతం ప్రమోషన్ క్యాంపైన్ లో పాలు పంచుకోవడం చూస్తే రజనీకాంత్ రీచ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎలాంటి విజువల్ ఎఫెక్ట్స్ లేని ఒక మాములు కమర్షియల్ యాక్షన్ మూవీకి ఇంత బజ్ రావడం వెనుక రజని ఇమేజ్ తో పాటు లోకేష్ సృష్టించుకున్న ఫాలోయింగ్ కారణంగా నిలిచింది. ఫస్ట్ షో నుంచి జస్ట్ యావరేజ్ టాక్ వచ్చినా చాలు ఈ జంట చేయబోయే విధ్వంసం ఓ రేంజ్ లో ఉంటుంది.

# వార్ 2 ప్రీమియర్ షోలు ఉంటాయా



ఏపీ తెలంగాణలో వార్ 2 స్పెషల్ షోలు తెల్లవారుఝాము నాలుగు గంటల నుంచి వేసేందుకు డిస్ట్రిబ్యూటర్ నాగవంశీ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. సాధారణంగా హిందీలో అంత ఉదయాన్నే ప్రీమియర్లు వేయరు. ముందు రోజు రాత్రి లేదా మహా అయితే మార్నింగ్ ఆరు తర్వాత ఉంటాయి తప్ప వేరే టైమింగ్స్ పెట్టుకోరు. కానీ తెలుగులో అలా కాదు. దేవర, పుష్ప 2కి మిడ్ నైట్ షోలు పడ్డాయి. బ్రహ్మాండంగా వర్కవుట్ చేసుకున్నాయి. ఇదే స్ట్రాటజీ గేమ్ ఛేంజర్, హరిహర వీరమల్లుకు పని చేయలేదు. సరే ఏదైనా కంటెంట్ మీద ఆధారపడి ఉంటుంది కనక ఫలితం వచ్చే దాకా ఎదురు చూడాలి. ఇదిలా ఉండగా వార్ 2 ప్రీమియర్లు వేయడం సేఫా కాదా అనే దాని మీద పంపిణీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎంత జూనియర్ ఎన్టీఆర్ ఉన్నా ఇది హిందీ మూవీ. మనకు డబ్బింగ్ వెర్షనే వస్తుంది. సో బాలీవుడ్ ఫ్లేవర్ తో నిండి ఉంటుంది. నిద్ర పోకుండా అంత చీకటి ఉండగానే ఫ్యాన్స్ వస్తున్న షోల మీద విపరీతమైన అంచనాలు నెలకొంటున్నాయి. యావరేజ్ ఉన్నా చాలు అసంతృప్తితో ఫ్లాప్ అని రుద్దేస్తున్నారు. గుంటూరు కారం లాంటి సినిమాలకు దీని వల్ల జరిగిన డ్యామేజ్ చాలా ఎక్కువ. అందుకే వార్ 2 విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది. పర్మిషన్లైతే అడిగారని వినికిడి. ఇది కాకుండా యష్ రాజ్ ఫిలిమ్స్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావాలి. ఎందుకంటే ఉత్తరాది కంటే రెండు మూడు గంటల ముందే దక్షిణాదిలో షోలు వేయడం వల్ల వచ్చే ఫలితాల గురించి ఒక విశ్లేషణ చేసుకోవాలి. అసలే కూలీతో పోటీ ఉంది. వార్ 2 ని ఎంత లేదనుకున్నా తమిళ అభిమానులు టార్గెట్ చేసుకుని తీరతారు. పరస్పరం నెగటివ్ ప్రాపగండాలు చేసుకోవడానికి కొందరు సిద్ధంగా ఉంటారు. ఇవన్నీ వార్ 2 కాచుకోవాల్సి ఉంటుంది. నేటివిటీ ఫ్యాక్టర్ ఒక్కటే సమస్యగా మారనున్న వార్ 2కి అండగా నిలబడుతోంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులే. దేవరలాగా దీన్ని కూడా కాచుకుంటే బ్లాక్ బస్టర్ ఖాతాలో పడినట్టే.

# సత్యదేవ్ కష్టానికి ఫలితం ఎప్పటికో




టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ యాక్టర్స్‌లో సత్యదేవ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రతిభ పుష్కలంగా ఉన్నా బ్రేక్ అందుకోవడంలో పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. చిరంజీవి గాడ్ ఫాదర్ లో విలన్ గా నటించేందుకు వెనుకాడలేదు. కింగ్డమ్ లో చనిపోయే హీరో అన్నయ్యగా ఎస్ చెప్పాడు. కానీ ఫలితాలు దక్కడం లేదు. నటన పరంగా ప్రశంసలు దక్కుతున్నాయి కానీ అవి కమర్షియల్ గా సక్సెస్ కాకపోవడం ఇబ్బంది పెడుతోంది. ఈ కారణంగానే సత్యదేవ్ తో సినిమాలు కొన్ని చివరి దశ దాకా వచ్చి ఓటిటి డీల్స్, థియేటర్ బిజినెస్ కోసం ఆలస్యమవుతున్న దాఖలాలున్నాయి. తాజాగా అరేబియా కడలి అనే వెబ్ సిరీస్ తో సత్యదేవ్ ప్రేక్షకుల ముందుకొచ్చాడు. తండేల్ కథే ఇది. కాకపోతే కాపీ రైట్స్ విషయంలో రేగిన గందరగోళం వల్ల ఒకే కథ రెండుసార్లు తెరకెక్కింది. ఒకవేళ తండేల్ ఫ్లాప్ అయ్యుంటే ఇప్పుడు సత్యదేవ్ కి అడ్వాంటేజ్ అయ్యేది. కానీ అది సూపర్ హిట్ కావడంతో పాటు వంద కోట్ల గ్రాస్ వసూలు చేసింది. టీవీలో మంచి టిఆర్పి వచ్చింది. అందరూ చూసేసిన స్టోరీ మళ్ళీ వెబ్ సిరీస్ గా రావడంతో ఆడియన్స్ లో అంతగా ఆసక్తి కనిపించలేదు. పైగా తండేల్ కథనే విడమరిచి డీటైల్డ్ గా చెప్పారు తప్పించి దానికన్నా బావుందని చెప్పే అవకాశం అరేబియా కడలి టీమ్ ఇవ్వలేదు. ఇండస్ట్రీలో సక్సెస్ ఎంత ముఖ్యమో చెప్పేందుకు సత్యదేవ్ ఉదాహరణ చాలు. కొన్నిసార్లు అదృష్టం కలిసి రావాలి. ఒకవేళ ఇదే ఉండి ఉంటే అరేబియా కడలి ముందు రిలీజై మంచి పేరు తెచ్చేదేమో. ఆర్టిస్టుగా సత్యదేవ్ బిజీగానే ఉన్నాడు. ఒకప్పటి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఇప్పుడు హీరోగా మారిపోయాడు కానీ హిట్లు వరసగా పడితే కెరీర్ ఊపందుకుంటుంది.

# లోభానికి, త్యాగానికి జరిగే పోరాటం



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్-ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా హీరో ప్రభాస్ ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. 'లోభానికి, త్యాగానికి, చీకటికి, దైవత్వానికి మధ్య జరిగే పోరాటాన్ని అద్భుతంగా ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. ఆకాశమంత ఆరాధన కలిగించేలా శివుని సాక్షాత్కారం టీజర్‌లో స్పిరిచువల్ హైపాయింట్. అలాగే విజువల్ వండర్‌గా ఉంది. సుధీర్ బాబు ప్రజెన్స్ డివైన్ వైబ్స్ కలిగిం చింది. త్యాగంతో పుట్టిన రక్షకుడిగా కనిపించిన పాత్రలో ఆయన లుక్ అదిరిపోయింది. సోనాక్షి కలకలం సృష్టించే శక్తిగా కనిపించింది. ఈ మైథాలజికల్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ హై ఆక్టేన్ స్టోరీటెల్లింగ్, మైండ్‌బ్లోయింగ్ విజువల్స్ అదరగొట్టింది' అని చిత్రయూనిట్ తెలిపింది. జీ స్టూడియోస్, ప్రెర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమా ను ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రెర్ణా అరోరా నిర్మిస్తున్నారు.

# "కపుల్ ఫ్రెండ్లీ" టీజర్ విడుదల




సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ". ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ మూవీ గా "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా తెరకెక్కుతోంది. త్వరలో ఈ సినిమా తెలుగుతో పాటు తమిళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే - 'నెల్లూరుకు చెందిన యువకుడు శివ(సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేసి సరైన ఉద్యోగం లేక చెన్నై నగరంలో ఇబ్బందులు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్ చేస్తుంటాడు. ప్రీతి (మానస వారణాసి) శివ బైక్ పై జర్నీ చేస్తుంది. అపరిచితులుగా కలిసిన శివ, ప్రీతి ప్రేమికులుగా మారడం, సన్నిహితంగా ఉన్న వారి ప్రేమ సన్నివేశాలను చూపిస్తూ టీజర్ ఆసక్తికరంగా సాగింది. ఈ టీజర్ కోసం మ్యూజిక్ డైరెక్టర్ ఆదిత్య రవీంద్రన్ కంపోజ్ చేసిన ' స్పార్క్ ఇన్ యువర్ ఐస్, దే షైన్..' అంటూ సాగే బిట్ సాంగ్ ఆకట్టుకుంటోంది. ' ఒకప్పటి సాధారణ క్షణాలన్నీ జ్ఞాపకాలుగా మారడమే జీవితం..' అంటూ టీజర్ చివరలో వేసిన క్యాప్షన్ "కపుల్ ఫ్రెండ్లీ" బ్యాక్ డ్రాప్ ను రిఫ్లెక్ట్ చేస్తోంది.

# టైమింగ్ మిస్సయిన అతడు



నిన్న సాయంత్రం స్పెషల్ ప్రీమియర్లతో అతడు రీ రిలీజైపోయింది. ఓపెనింగ్స్ పరంగా ఖలేజా రికార్డులను బద్దలు కొడుతుందని ఆశించిన అభిమానులకు ఈసారి టైమింగ్ మిస్సయినట్టు కనిపిస్తోంది. ముందస్తు అంచనాల ప్రకారం ఇవాళ్టితో కలుపుకుని సుమారు అయిదు కోట్ల దాకా గ్రాస్ రావొచ్చని ఒక అంచనా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల ఆశించిన స్థాయిలో పెద్ద ఎత్తున బుకింగ్స్ లేవని ట్రేడ్ టాక్. అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో రెండున్నర కోట్ల దాకా వసూలయ్యాయట. ఏపీ తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పరీక్ష పెడుతున్నాయి. జనం బయటికి రావడానికి జంకుతున్నారు. మూడో వారంలోనూ మహావతార్ నరసింహ ర్యాంపేజ్ బాక్సాఫీస్ వద్ద కొనసాగుతోంది. వీకెండ్ మొత్తం ఎక్కడా టికెట్లు దొరకని పరిస్థితి నెలకొనడంతో డిస్ట్రిబ్యూటర్లు షోలు పెంచుతున్నారు. వీటికి తోడు కింగ్డమ్ రెండో వారం థియేటర్ అగ్రిమెంట్లు కొనసాగుతుండగా వార్ 2, కూలీ కోసం ఎదురు చూస్తున్న మూవీ లవర్స్ వాటికి కావాల్సిన సొమ్ముల కోసం ఇప్పుడు సినిమాలకు వెళ్లడం తగ్గించుకున్నారు. ఇది కూడా అతడు మీద ఎఫెక్ట్ చూపిస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు స్పెషల్ గా ఎప్పటికి మర్చిపోలేని మైలురాళ్ళు ఇవ్వాలని ప్లాన్ చేసుకున్న ఫ్యాన్స్ కి పైన చెప్పినవి అడ్డంకిగా మారుతున్నాయి. సుదర్శన్ 35 ఎంఎంలో రెండు రోజులకు నాలుగు షోలు వేయించుకోవడానికే నానా తంటాలు పడిన వైనం కనిపించింది. అతడుకి చేతిలో ఉన్నవి అయిదు రోజులు మాత్రమే. నిజానికి అతడు చాలా స్పెషల్ గా సెలెబ్రేట్ చేయాల్సిన మూవీ.

## భిన్న కాన్సెప్ట్‌తో 'చాయ్ వాలా'

శివ కందుకూరి హీరోగా 'చాయ్ వాలా' అనే చిత్రాన్ని హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్.పాపుడిప్పు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వం వహిస్తున్నారు.శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో శివ కందుకూరి, రాజీవ్ కనకాల స్కూటీపై జాలీగా తిరుగుతూ కనిపిస్తున్నారు. 'ఈ కథ ప్రేమ, వారసత్వం అనే అంశాల చుట్టూ తిరుగుతుంది. ఓ పర్ఫెక్ట్ చాయ్, కప్పులా ఉంటుంది. భావోద్వేగాలు, సంప్రదాయం, కలలతో నిండిన అద్భుతమైన ప్రయాణాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి. టీజర్ అతి త్వరలో వస్తుంది' అంటూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ మూవీకి ప్రశాంత్ ఆర్.విహారి సంగీతం సమకూరుస్తుండగా, క్రాంతి వర్ల సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పవన్ నర్వా ఈ చిత్రానికి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'శివ కందుకూరి ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కథలను ఎంచుకుని తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఆయన నటిస్తున్న మరో భిన్న కాన్సెప్ట్ చిత్రమిది. ఈ సినిమా తప్పకుండా విశేష ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ తెలిపారు.



# క్రీడలు



## సీఎస్కేను వీడనున్న అశ్విన్..?




పదేళ్ల తర్వాత ఈ సీజన్‌లో తిరిగి చెన్నయ్ సూపర్ కింగ్స్(సీఎస్కే) గూటికి చేరిన స్పినర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రయాణం ఆ జట్టుతో ఒక్క సీజన్‌కే పరిమితయ్యేలా కనిపిస్తుంది. సీఎస్కేను అతను వీడనున్నట్టు వార్తలు వైరల్ అవుతున్నాయి. తనను రిలీజ్ చేయాలని అశ్విన్ మేనేజ్‌మెంట్‌ను కోరినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అశ్విన్ గానీ, సీఎస్కేగానీ ఆ వార్తలను ఇంకా ధ్రువీకరించలేదు.అలాగే, కొట్టిపారేయనూ లేదు. అయితే, సీఎస్కే క్యాంప్‌లో తాజా పరిణామాలు చూస్తుంటే సీఎస్కేను అశ్విన్ వీడనున్నాడనే ప్రచారం సాగుతుంది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్ తాజాగా తన ఐపీఎల్ ఫ్యూచర్‌పై సీఎస్కే మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఎం.ఎస్ ధోనీ, రుతురాజ్ గైక్వాడ్ సహా సీఎస్కే ఉన్నత అధికారులు, టాప్ ప్లేయర్లు గత కొన్ని రోజులుగా చెన్నయ్‌లో సమావేశం అవుతున్నట్టు ఓ ప్రముఖ జాతీయ మీడియా పేర్కొంది. వచ్చే సీజన్ ప్రణాళికల గురించి చర్చించినట్టు తెలిపింది. తనను రిలీజ్ చేయాలని అశ్విన్ రిక్వెస్ట్ చేసినట్టు తెలుస్తోంది. అతను వేరే ఫ్రాంచైజీకి వెళ్లాలని చూస్తున్నట్టు కూడా జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే, ఆటగాళ్లతో మాట్లాడం ప్రీ ఆక్షన్ ప్లాన్ భాగమని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. అశ్విన్‌తో కూడా అలాగే చర్చించి ఉండొచ్చని పేర్కొన్నాయి. ప్లేయర్ల ఫ్యూచర్‌పై నిర్ణయం తీసుకోవడానికి ఇది ప్రారంభ దశ అని, రిటెన్షన్‌కు ఇంకా సమయం ఉందని తెలిపాయి. అశ్విన్ గానీ, సీఎస్కే మేనేజ్‌మెంట్‌గానీ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.2009-2015 వరకు చెన్నయ్‌కు ఆడిన అశ్విన్ ఆ తర్వాత ఇతర జట్లకు ఆడాడు. 10 ఏళ్ల తర్వాత తిరిగి సీఎస్కేలో చేరాడు. ఈ సీజన్‌కు ముందు మెగా వేలంలో చెన్నయ్ ఫ్రాంచైజీ 9.75 కోట్లకు అతన్ని తీసుకుంది. అయితే, ఈ సీజన్‌లో అశ్విన్ నిలకడగా రాణించలేదు. 9 మ్యాచ్‌ల్లో కేవలం 7 వికెట్లే తీశాడు. దీంతో కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడంతో పలు మ్యాచ్‌లకు అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు.

## ప్రాక్టీస్ మొదలుపెట్టిన కోహ్లీ



టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అతను కేవలం వన్డేలలో మాత్రమే ఆడనున్నాడు. ఈ ఏడాది అతను చివరిసారిగా చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. న్యూజిలాండ్‌తో ఆడిన ఫైనలే అతను చివరిగా ఆడింది. అనంతరం ఐపీఎల్‌లో పాల్గొన్నాడు. కోహ్లీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తొలిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విరాట్ కుటుంబంతో కలిసి లండన్‌లో ఉంటున్నాడు. త్వరలోనే అతను తిరిగి మైదానంలో అడుగుపెట్టనున్నాడు. వన్డేలలో పునరాగమనం చేసేందుకు కింగ్ కోహ్లీ సిద్ధమవుతున్నాడు. తాజాగా అతను ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. లండన్‌లోని ఓ ఇండోర్ స్టేడియంలో విరాట్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. అందుకు సంబంధించిన ఫొటోను కోహ్లీ శుక్రవారం సోషల్ మీడియాలో పంచుకున్నాడు. ఆ ఫొటోలో కోహ్లీతోపాటు గుజరాత్ టైటాన్స్ సహాయక కోచ్ నయీమ్ అమిన్ కూడా ఉన్నాడు. కోహ్లీ ప్రాక్టీస్‌ను నయీమ్ అమిన్ పర్యవేక్షిస్తున్నాడు. 'డియర్ బ్రదర్.. నాకు సహాయం చేస్తున్నందుకు నీకు కృతజ్ఞతలు. నిన్ను చూడటం ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది.'అని కోహ్లీ రాసుకొచ్చాడు. అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌లో కోహ్లీ తిరిగి మైదానంలో కనిపించనున్నాడు. అక్టోబర్ 19 నుంచి ఈ సిరీస్ ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో విరాట్ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ఆగస్టులో బంగ్లాదేశ్‌లో టీమిండియా పర్యటించాల్సి ఉండగా.. ఆ సిరీస్ వచ్చే ఏడాదికి వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ సిరీస్ పోస్ట్‌పోన్ అవడం కోహ్లీ పునరాగమనం ఆలస్యమైంది.

## పాక్ క్రికెట్‌లో కలకలం..

## యువ క్రికెటర్ హైదర్ అలీ అరెస్ట్

పాకిస్థాన్ క్రికెట్ మరోసారి తీవ్ర వివాదంలో చిక్కుకుంది. పాక్ యువ బ్యాట్స్‌మెన్, 24 ఏళ్ల హైదర్ అలీ లైంగిక ఆరోపణల కింద యూకేలో అరెస్టయ్యాడు. పాకిస్థాన్ 'ఏ' జట్టు అయిన పాకిస్థాన్ షాహీన్స్‌తో కలిసి ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన ఆయనపై ఓ యువతి ఫిర్యాదు చేయడంతో గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. ఈ ఘటనతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అతడిపై తక్షణమే తాత్కాలిక సస్పెన్షన్ విధించింది.వివరాల్లోకి వెళితే.. పాక్ షాహీన్స్ జట్టు జులై 17 నుంచి ఆగస్టు 6 వరకు యూకేలో పర్యటించింది. ఈ క్రమంలో ఆగస్టు 3న బెక్హామ్ మైదానంలో మ్యాచ్ ఆడుతుండగా పోలీసులు హైదర్ అలీని అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్ మూలాలున్న ఒక యువతి చేసిన లైంగిక ఫిర్యాదు మేరకు అతడిని అరెస్ట్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విచారణ అనంతరం హైదర్ అలీని బెయిల్‌పై విడుదల చేసిన పోలీసులు, తదుపరి విచారణకు సహకరించాలనే షరతుతో అతడి పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పీసీబీ వెంటనే స్పందించింది. యూకే చట్టపరమైన ప్రక్రియలకు తాము పూర్తిగా సహకరిస్తామని, విచారణ పూర్తయ్యే వరకు హైదర్ అలీని సస్పెండ్ చేస్తున్నామని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ కేసులో హైదర్ అలీకి అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని, దీనిపై యూకేలో తాము కూడా అంతర్గత విచారణ జరుపుతామని పీసీబీ ప్రతినిధి ఒకరు తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న సమయంలో హైదర్ అలీ తాను నిర్దోషినని చెబుతూ కన్నీరు పెట్టుకున్నట్లు సమాచారం. ప్రతిభావంతుడైన ఆటగాడిగా పేరున్న హైదర్ అలీ, పాకిస్థాన్ తరఫున రెండు వన్డేలు, 35 టీ20 మ్యాచ్‌లు ఆడారు. పాక్ వైట్-బాల్ హెడ్ కోచ్ మైక్ హెసన్ ప్రణాళికల్లో ఉన్న అతడు, త్వరలో షార్జాలో జరగనున్న టీ20 ట్రై-సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్న తరుణంలో ఈ వివాదం అతడి కెరీర్‌ను ప్రమాదంలో పడేసింది. గతంలో 2010లో స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో సల్మాన్ బట్, మహ్మద్ అమీర్, మహ్మద్ ఆసిఫ్ ఇంగ్లండ్‌లోనే అరెస్టయిన ఘటనను ఈ ఉదంతం మరోసారి గుర్తుచేసింది.

## టీమిండియా ఆత్మవిశ్వాసం రెట్టింపు



ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సుదీర్ఘ టెస్టు సిరీస్‌ను టీమిండియా 22తో సమంగా ముగించిన సంగతి తెలిసిందే. ఏమాత్రం అంచనాలకు లేకుండా బరిలోకి దిగిన భారత జట్టు చిరస్మరణీయ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇంగ్లండ్ వంటి బలమైన జట్టును వారి సొంత గడ్డపై నిలువరించి గిల్ సేన ఔరా అనిపించింది. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవిచంద్రన్ అశ్విన్‌లు అందుబాటులో లేక పోవడంతో సిరీస్ ఆరంభానికి ముందే భారత్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చనే అభిప్రాయాలను సీనియర్ ఆటగాళ్లు, విశ్లేషకులు ఓ అంచనాకు వచ్చారు.కానీ వారి అంచనాలను తారుమారు చేస్తూ సిరీస్‌లో గిల్ బృందం చిరస్మరణీయ ప్రదర్శనతో పెను సంచలనం సృష్టించింది. మాంచెస్టర్, ఓవల్‌లలో జరిగిన టెస్టుల్లో టీమిండియా ప్రదర్శనను ఎంత పొగిడినా తక్కువే. నాలుగో టెస్టులో ఓటమి ఖాయమని భావిస్తున్న సమయంలో భారత ఆటగాళ్లు అసాధారణ ఆటతో జట్టును పరాజయం నుంచి బయటపడేశారు. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను పట్టేయాలని భావించిన ఆతిథ్య టీమ్ ఇంగ్లండ్ ఆశలపై టీమిండియా నీళ్లు చల్లింది. అంతేగాక తొలి టెస్టులో గెలిచి జోరుమీదున్న ఇంగ్లండ్‌ను బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో ఓడించి భారత్ ప్రతీకారం తీర్చుకున్న తీరును ప్రశంసించ కుండా ఉండలేం. తొలి మ్యాచ్ నుంచే టీమిండియా అద్భుత ఆటను కనబరిచింది. మొదటి సిరీస్‌లోనే శుభ్‌మన్ గిల్ తన కెప్టెన్సీ ప్రతిభను చాటాడు. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టులోనే సెంచరీ సాధించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓటమి పాలైనా ఇంగ్లండ్‌కు ముచ్చెమటలు పట్టించింది. ఇక రెండో టెస్టులో గెలిచి ప్రతీకారం తీర్చుకుంది. గిల్ మరోసారి చెలరేగి పోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో అలరించాడు. టీమిండియా విజయంలో గిల్ తనదైన పాత్రను పోషించాడు. మూడో టెస్టులో కూడా భారత్ అద్భుత ఆటను కనబరిచింది. లార్డ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య టీమ్ ఇంగ్లండ్‌ను దాదాపు ఓడించినంత పని చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కీలక ఆటగాళ్లు కాస్త రాణించి ఉంటే లార్డ్‌లో టీమిండియాకు చారిత్రక విజయం దక్కేది. ఈ మ్యాచ్‌లో భారత్ అంచనాలకు మించి రాణించినా ఫలితం లేకుండా పోయింది. ఇంగ్లండ్ అతి కష్టం మీద జయకేతనం ఎగుర వేసింది. మాంచెస్టర్ టెస్టులో కూడా టీమిండియా సత్తా చాటింది. ఇంగ్లండ్ ఆధిపత్యాన్ని తట్టుకుంటూ మ్యాచ్‌లో నిలబడింది. గిల్, రాహుల్, జడేజా, వాషింగ్టన్ సుందర్‌లు అద్భుత పోరాట పటిమను కనబరచడంతో ఈ మ్యాచ్‌ను భారత్ డ్రాగా ముగించింది. ఇక ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులోనూ టీమిండియా చిరస్మరణీయ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇంగ్లండ్‌ను దీటుగా ఎదుర్కొంటూ మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకుంది. అంతేగాక సిరీస్‌ను సమంగా ముగించింది.

## ఆర్ఆర్ కెప్టెన్‌గా ధ్రువ్ జురెల్..

## జట్టు పోస్ట్‌కి అర్థమిదేనా..?




గత ఐపిఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు చెత్త ప్రదర్శన చేసింది. 14 మ్యాచుల్లో కేవలం 4 మ్యాచుల్లో గెలిచి టేబుల్‌లో 9వ స్థానంతో సీజన్‌ను ముగించింది. అయితే ఆర్ఆర్ కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్ జట్టును వీడే ఆలోచనలో ఉన్నాడని సోషల్‌మీడియా కోడై కూస్తోంది. 2027 వరకూ సంజూకి ఆర్ఆర్‌తో అగ్రిమెంట్ ఉన్నా.. అతడని రిలీజ్ చేయాలని జట్టును సంజూ కోరాడట. అయితే అతని స్థానంలో కెప్టెన్సీ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారనే విషయంపై చర్చ మొదలైంది. తాజాగా ఆర్ఆర్ పెట్టిన ఓ పోస్ట్ చూస్తే అభిమానులకు కొంత క్లారిటీ వచ్చిందనే చెప్పుకోవచ్చు. మరికొన్ని రోజుల్లో ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఆడేందుకు భారత కీపర్-బ్యాట్స్‌మెన్ ధ్రువ్ జురెల్ సిద్ధమయ్యాడు. అతడు సెంట్రల్ జోన్‌కి కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని ఆర్ఆర్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తూ.. "స్టంప్స్ వెనక ఉండి మ్యాచ్‌ను మార్చేసే ప్లేయర్ అతడు" అంటూ పేర్కొంది. ఫోటోపై కెప్టెన్ జురెల్ అంటూ క్యాప్షన్ పెట్టింది. దీంతో సంజూ శాంసన్‌ని జట్టు నుంచి తప్పించి.. కెప్టెన్సీ బాధ్యతలను ధ్రువ్‌కి అప్పగిస్తారని.. ఫ్యాన్స్ అనుకుంటున్నారు. మరి కొంతమంది మాత్రం ఈ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లుగా రాజస్థాన్‌కి కెప్టెన్‌గా ఉంటున్న సంజూ జట్టును వీడి.. చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) గూటికి చేరనున్నాడని టాక్. సిఎస్‌కె కూడా అతన్ని తీసుకునేందుకు ఆసక్తిగా ఉందట. ఆరో టైటిల్‌ని లక్ష్యంగా పెట్టుకున్న సిఎస్‌కె సరైన కెప్టెన్ కోసం ఎదురుచూస్తోంది. గత సీజన్‌లో తొలుత కొన్ని మ్యాచులు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీ చేసినా.. అతడు గాయపడటంతో ధోనీకి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. కానీ, జట్టు 4 మ్యాచులు మాత్రమే గెలిచింది. ఇప్పుడు తమ జట్టులోకి సంజూ లేదా కెఎల్ రాహుల్‌ని తీసుకుంటే అది తమకి బాగా కలిసి వస్తుందని సిఎస్‌కె అనుకుంటోంది. ఈ క్రమంలోనే సంజూ ఆర్ఆర్‌ని వీడేందుకు రెడీగా ఉండటంతో అతన్ని తమ జట్టులోకి ట్రేడింగ్ చేసుకోవాలని భావిస్తోంది. సంజూను సిఎస్‌కెకి ఇస్తే.. ఇద్దరు ఆటగాళ్లకు తమకు ఇవ్వాలని రాజస్థాన్ షరతు పెట్టేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఆరోగ్యం



## రాత్రి 7 గంటలకు ముందే భోజనం ఎందుకు చేయాలి?



రాత్రి ఆలస్యం భోజనం చేయడం వల్ల ముఖ్యంగా రాత్రివేళ మన శరీరంలో మెటబాలిజం మందగించడంతో ఆలస్యంగా తీసుకునే ఆహారంలోని కాలరీలు పూర్తిగా ఖర్చవకుండా, కొవ్వు రూపంలో నిల్వ అయ్యే అవకాశముంది. ఇది ఎక్కువకాలం కొనసాగితే శరీరభార పెరగడం ప్రమాదం ఉంటుంది. ప్రతి రోజు సరైన సమయంలో ఆహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటామని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఏ ఆహారం తినాలి? ఏయే సమయంలో తినాలో తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రాత్రి భోజనాన్ని సాయంత్రం 7 గంటల లోపు పూర్తి చేయడం ఉత్తమం. ఎందుకంటే మన శరీరం రాత్రివేళ అతి స్వల్పంగా పనిచేస్తుంది. రాత్రి సమయంలో జీర్ణవ్యవస్థ పనితీరు నెమ్మదిగా మారుతుంది. దీని వల్ల అప్పుడు తీసుకునే ఆహారం పూర్తిగా జీర్ణం కాకపోతే అసిడిటీ, వాంతులు, వాయువు, లేదా పొట్ట నొప్పులు వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా అధిక మోతాదులో ఆహారం తీసుకుంటే రాత్రి నిద్రకు అంతరాయం కలుగుతుంది. దీనివల్ల శరీరం రిఫ్రెష్ కాకుండా, అలసటగా మారి, తదుపరి రోజున పూర్తిగా చురుకుగా ఉండలేనంతగా ప్రభావితం అవుతుంది. ఇంకా ముఖ్యంగా రాత్రివేళ మన శరీరంలో మెటబాలిజం మందగించడంతో ఆలస్యంగా తీసుకునే ఆహారంలోని కాలరీలు పూర్తిగా ఖర్చవకుండా, కొవ్వు రూపంలో నిల్వ అయ్యే అవకాశముంది. ఇది ఎక్కువకాలం కొనసాగితే శరీరభార పెరగడం ప్రమాదం ఉంటుంది. రాత్రి భోజన సమయం, రక్తంలో షుగర్ స్థాయి మధ్యన గట్టి సంబంధం ఉంటుంది. తరచూ రాత్రి భోజనం ఆలస్యంగా చేస్తే, శరీరంలో బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగడం ద్వారా మధుమేహం లేదా ప్రీ-డయాబెటిస్ వంటి సమస్యలు తలెత్తే అవకాశాలు పెరుగుతాయి. ఇంకా ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, రాత్రి ఆలస్యంగా భోజనం చేస్తే హృదయ సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. దీని వల్ల బీపీ (రక్తపోటు), కోలెస్ట్రాల్ స్థాయి వంటి అంశాలు విరుద్ధంగా మారతాయి. అందువల్ల, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే.. రాత్రి భోజనాన్ని సాయంత్రం 7 గంటల లోపు పూర్తిచేయడం మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. రాత్రిపూట తేలికపాటి త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలంటున్నారు. భోజనం తరువాత తక్కువగా నీరు తీసుకుంటూ, కొంత నడవడం శ్రేయస్కరం. ఇలాంటి నియమాలు పాటిస్తే మధుమేహం, గుండెపోటు, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యల నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు.

## మలబద్దకంతో ఇబ్బందిపడుతున్నారా?



ఒత్తిడితో కూడిన జీవితం, జంక్ ఫుడ్ అలవాట్ల కారణంగా కడుపు సంబంధిత సమస్యలు వస్తుంటాయి. దీని నుంచి బయట పడటానికి అధిక మంది వైద్యులను సంప్రదిస్తుంటారు. అయితే కొంతమంది దీని గురించి ఎక్కువగా ఆందోళన చెందుతుంటారు. నేటి జీవన శైలి కారణంగా అనేక మంది లైఫ్‌స్టైల్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. వీటిల్లో మలబద్ధకం ముఖ్యమైనది. ఇది ఎక్కువగా పర్యావరణం, ఆహారం వల్ల వస్తుంది. ఒత్తిడితో కూడిన జీవితం, జంక్ ఫుడ్ అలవాట్ల కారణంగా కడుపు సంబంధిత సమస్యలు వస్తుంటాయి. దీని నుంచి బయట పడటానికి అధిక మంది వైద్యులను సంప్రదిస్తుంటారు. అయితే కొంతమంది దీని గురించి ఎక్కువగా ఆందోళన చెందుతుంటారు. కానీ ఈ సమస్యకు పరిష్కారం ఇంట్లోనే నిమిషంలో దొరుకుతుందనే సంగతి మీకు తెలుసా. ఈ కింది రెండు చిట్కాలతో ఈ సమస్యను సులువుగా పరిష్కరించవచ్చు. వంటగదిలో దొరికే రెండు పదార్థాలు మలబద్ధకం సమస్యను చిటికెలో నివారిస్తుంది. అదే జీలకర్ర నీరు, సోంపు నీరు. జీలకర్ర కడుపు ఆరోగ్యానికి ఓ వరం. దాని నీరు తాగడం వల్ల కడుపులో గ్యాస్, గుండెల్లో మంట, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది ఉబ్బరం, అపానవాయువు నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. జీలకర్ర కడుపులోని వాయువును బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. ఆమ్లత్వాన్ని కూడా తగ్గిస్తుంది. జీలకర్ర సహజ యాంటాసిడ్‌గా పనిచేస్తుంది. ఇది కడుపు చికాకును తగ్గిస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఫైబర్ ఉంటుంది. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. కడుపును శుభ్రంగా ఉంచుతుంది. జీవక్రియను కూడా పెంచుతుంది. జీలకర్ర నీరు జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఒక గ్లాసు నీటిలో 1 టీస్పూన్ జీలకర్ర వేసి మరిగించాలి. సగం నీరు మిగిలిపోయాక, దానిని వడకట్టి గోరువెచ్చగా ఉన్నప్పుడే తాగాలి. వీలైతే జీలకర్రను రాత్రంతా నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తాగడం మంచిది.మౌత్ ఫ్రెషనర్‌గా తినే సోంపు గింజలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటి ప్రభావం వల్ల కడుపు చల్లబరుస్తుంది. అందువల్ల కడుపు చికాకుకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఆమ్లత్వం, గుండెల్లో మంట నుంచి ఉపశమనం కలిగిస్తుంది. సోంపు నీరు కడుపు వేడి, గుండెల్లో మంటను తగ్గిస్తుంది. సోంపు నీరు అజీర్ణాన్ని తగ్గిస్తుంది. ఇందులో జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేసే పదార్థాలు జీర్ణ సమస్యలను నివారిస్తుంది. కడుపు నొప్పి నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఫైబర్ కడుపును శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది.

## గొంతు నొప్పితో బాధపడుతున్నారా..?

గొంతు నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. ఈ సమయంలో ఆహారం తినడం కూడా కష్టం. కానీ కొన్ని ఆహారాలు చికాకును తగ్గించడానికి, మంటను తగ్గించడానికి సహాయపడతాయి. మరికొన్ని లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయి. జ్వరం వచ్చినప్పుడు గొంతు నొప్పి సాధారణం. ఈ సమయంలో నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. ఆహారం కూడా తినలేని పరిస్థితి ఉంటుంది. కానీ కొన్ని ఆహారాలు చికాకు, మంటను తగ్గించడానికి సహాయపడతాయి. కొన్ని లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ సమయంలో మీరు తినవలసిన, తినకూడని ఆహారాలను పరిశీలిద్దాం. చికెన్ లేదా వెజిటబుల్ సూప్ వంటి వేడి పదార్థాలు గొంతు నొప్పిని తగ్గించడానికి, పోషకాలను అందించడానికి సహాయపడతాయి. చికెన్ సూప్ తేలికపాటి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. తేనె దాని యాంటీమైక్రోబియల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో గొంతును కూడా ఉపశమనం చేస్తుంది. ఇది దగ్గును కూడా తగ్గిస్తుంది. ముఖ్యంగా పడుకునే ముందు తినేటప్పుడు. గోరువెచ్చని హెర్బల్ టీ గొంతు కణాలను కూల్ చేస్తుంది. అల్లం, చమోమిలే లేదా గ్రీన్ టీ వంటి టీలు యాంటీమైక్రోబియల్, రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలను కలిగి ఉంటాయి. అరటిపండ్లు, యాపిల్‌సాస్ వంటి మృదువైన, ఆమ్లం లేని పండ్లు గొప్పవి. పెరుగు లేదా కూరగాయలతో స్మూతీలు ఉపశమనం కలిగిస్తాయి. వేయించిన ఆహారాలను నివారించండి. అవి గొంతు పొరను చికాకు పెట్టవచ్చు. మింగడానికి కష్టంగా ఉండే కూరగాయలు నొప్పిని మరింత తీవ్రతరం చేస్తాయి. నారింజ, మొక్కజొన్నలు వంటి వాటి ఆమ్లత్వం గొంతు నొప్పిని మరింత తీవ్రతరం చేస్తుంది. పుల్లని సాస్‌లు, సూప్‌లను నివారించండి. అవి గొంతులో మరిన్ని సమస్యలను కలిగిస్తాయి. మిరపకాయ లేదా వేడి సాస్ వంటివి వాపు, అసౌకర్యాన్ని పెంచుతాయి. కార్బోనేటేడ్ పానీయాలు ఆమ్లత్వం, గొంతు చికాకును పెంచుతాయి. కాఫీ, కెఫిన్ కలిగిన పానీయాలు డీహైడ్రేషన్‌కు కారణమవుతాయి.

## వ్యాయామం చేసినంత మాత్రానా సన్నబడరా?



బరువు తగ్గడానికి వ్యాయామం చాలా ముఖ్యం అయినప్పటికీ, ఆరోగ్యకరమైన ఆహారం లేకుండా అది పూర్తిగా సాధ్యం కాదు. కేలరీల లోటును సృష్టించడానికి సమతుల్యమైన ఆహారం, వ్యాయామం రెండూ అవసరం. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, నిద్ర, ఒత్తిడి నిర్వహణ కూడా ముఖ్యం. బరువు తగ్గడానికి చాలా మంది వ్యాయామంపై మాత్రమే ఆధారపడతారు, కానీ ఇది అసంపూర్ణమైన చర్య. వ్యాయామం శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది. కొవ్వును కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది, కానీ మీరు మీ ఆహారంపై శ్రద్ధ చూపకపోతే, బరువు తగ్గడం కష్టం. వ్యాయామాలపై మాత్రమే ఆధారపడటం వల్ల బరువు తగ్గడంలో పెద్దగా ఫలితం ఉండదని పరిశోధనలు చెబుతున్నాయి. శరీరాన్ని ఫిట్‌గా, శక్తివంతంగా ఉంచడానికి వ్యాయామం అవసరం, కానీ సరైన ఆహారంతో పాటు లేకపోతే, తప్పుడు ఆహారపు అలవాట్ల కారణంగా కాలిపోయిన కేలరీలు తిరిగి వస్తాయి. అందువల్ల బరువు తగ్గడానికి, వ్యాయామంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరించడం కూడా ముఖ్యం. అటువంటి పరిస్థితిలో వ్యాయామంతో మాత్రమే బరువు ఎందుకు తగ్గదని మాకు తెలియజేయండి. బరువు తగ్గడం గురించి మాట్లాడేటప్పుడు, మనకు ముందుగా గుర్తుకు వచ్చేది వ్యాయామం. కానీ వాస్తవం ఏమిటంటే కేవలం వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గదు. దీని వెనుక ఉన్న కారణం ఏమిటంటే, శరీరంలో బరువు పెరగడానికి అతిపెద్ద కారణం ఎక్కువ కేలరీలు తీసుకోవడం, తక్కువ ఖర్చు చేయడం. వ్యాయామం చేయడం ద్వారా, మనం కొంతవరకు కేలరీలను బర్న్ చేస్తా?ం, కానీ మనం ఆహారం ద్వారా అదే లేదా అంతకంటే ఎక్కువ కేలరీలు తీసుకుంటూ ఉంటే, బరువు తగ్గడానికి బదులుగా, బరువు పెరగవచ్చు. ఉదాహరణకు ఒక గంట జాగింగ్‌లో దాదాపు 400500 కేలరీలు బర్న్ అవుతాయి, కానీ మీరు తర్వాత అధిక కేలరీల చిరుతిండి లేదా ఫాస్ట్ ఫుడ్ తింటే చేసిన కష్టమంతా వృథా. అందువల్ల, బరువు తగ్గడానికి, వ్యాయామం మాత్రమే కాదు, జీవనశైలిలో సమతుల్యత కూడా ముఖ్యం. బరువు తగ్గడానికి ఆహారం, వ్యాయామం రెండింటి సమతుల్యత అవసరమని ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ జాన్ వివరిస్తున్నారు. వ్యాయామం కండరాలను టోన్ చేస్తుంది, జీవక్రియను మెరుగుపరుస్తుంది, శక్తి స్థాయిలను పెంచుతుంది. కానీ ఆహారం శరీరంలో కేలరీల తీసుకోవడం నియంత్రించే ప్రధాన అంశం. మీరు తక్కువ కొవ్వు, తక్కువ చక్కెర, అధిక ఫైబర్, పుష్కలంగా ప్రోటీన్, హైడ్రేషన్ వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరిస్తే, శరీరానికి అవసరమైన పోషకాహారం లభిస్తుంది, కొవ్వు నిల్వను నివారించవచ్చు. బరువు తగ్గడానికి రోజువారీ కేలరీల లోటు అంటే రోజువారీ కేలరీల తీసుకోవడం ఖర్చు చేసే కేలరీల కంటే తక్కువగా ఉండాలి. దీని కోసం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమయానికి తినడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం, సమతుల్య ఆహారం చాలా ముఖ్యమైనవి. బరువు తగ్గడంలో 70 శాతం ఆహారం నుండి, 30 శాతం వ్యాయామం నుండి సాధ్యం అవుతుది.

## స్ట్రోక్ వచ్చే ముందు శరీరంలో కనిపించే సంకేతాలివే..



చాలా సార్లు మన శరీరం ప్రమాదాలను ముందుగానే గుర్తించి వాటి గురించి సంకేతాలు ఇవ్వడం ప్రారంభిస్తుంది. కానీ తరచుగా మనం చిన్న చిన్న విషయాలను విస్మరిస్తాము. అవి ప్రమాదకరంగా మారతాయి.. స్ట్రోక్ రాకముందే.. శరీరం మీ ప్రాణాలను కాపాడే 4 భయానక సంకేతాలను ఇస్తుంది. మీరు వాటిని సకాలంలో గుర్తించడం ద్వారా.. ప్రమాదాన్ని నివారించవచ్చు. ప్రజలు తరచుగా స్ట్రోక్‌ను అకస్మాత్తుగా జరిగేదిగా భావిస్తారు.. అది జీవితాన్ని క్షణంలో మార్చగలదు. కానీ వాస్తవికత ఏమిటంటే.. స్ట్రోక్ కు ముందు శరీరం తరచుగా ప్రమాద సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. ఈ సంకేతాలు ఎల్లప్పుడూ స్పష్టంగా కనిపించవు.. కానీ తేలికపాటి లక్షణాలు మాత్రమే కనిపిస్తాయి.. స్ట్రోక్ అనేది మెదడుకు రక్త ప్రసరణకు అంతరాయం కలిగించే ఒక తీవ్రమైన వైద్య పరిస్థితి.. దీనివల్ల మెదడు కణాలు దెబ్బతింటాయి లేదా చనిపోతాయి. ఇది ఒక అత్యవసర పరిస్థితి - తక్షణ వైద్య సంరక్షణ అవసరం.. స్ట్రోక్ లేదా బ్రెయిన్ స్ట్రోక్.. వల్ల ఇది మెదడు దెబ్బతినడం, దీర్ఘకాలిక వైకల్యం లేదా మరణానికి కూడా దారితీయవచ్చు. స్ట్రోక్ అనేది అకస్మాత్తుగా వచ్చే వ్యాధి అని అనుకుంటాం.. కానీ వాస్తవం భిన్నంగా ఉంటుంది. స్ట్రోక్ అనేది జీవితాన్ని క్షణంలో మార్చే సంఘటన అని చాలా మంది అనుకుంటారు. కానీ, శరీరం స్ట్రోక్ ప్రమాద సంకేతాలను చాలా ముందుగానే ఇవ్వడం ప్రారంభిస్తుందని పేర్కొంటున్నారు నిపుణులు.. స్ట్రోక్ కు సంబంధించి కొన్ని ప్రారంభ లక్షణాలను సకాలంలో గుర్తించడం ద్వారా .. తీవ్రమైన పరిస్థితిని నివారించవచ్చు. అకస్మాత్తుగా చాలా తీవ్రమైన తలనొప్పి వచ్చి, మందులు తీసుకున్న తర్వాత కూడా ఉపశమనం లభించకపోతే.. వెంటనే వైద్యులను సంప్రదించండి.. ఇంతకు ముందు ఎప్పుడూ అనుభవించని ఆకస్మిక తీవ్రమైన తలనొప్పి మెదడులో రక్తం గడ్డకట్టడానికి సంకేతం కావచ్చు. అన్ని తలనొప్పులు ఒత్తిడి లేదా నీటి కొరత వల్ల సంభవించవు. కొన్నిసార్లు అవి ఇతర వ్యాధుల సంకేతాలు కూడా. మరోవైపు, వికారం, సరిగ్గా చూడలేకపోవడం లేదా తలనొప్పితో వాంతులు వంటి సమస్య ఉంటే, దానిని తేలికగా తీసుకోకండి. కొన్నిసార్లు ఇది మైగ్రేన్ లేదా ఒత్తిడి వల్ల కలిగే తలనొప్పిగా అనిపిస్తుంది.. కానీ తేడా ఏమిటంటే లక్షణాలు మరింత తీవ్రంగా ఉంటాయి. అటువంటి పరిస్థితిలో, వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అలాగే, రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుకోవడం వల్ల కూడా అటువంటి గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. ఎటువంటి కారణం లేకుండా ఎక్కిళ్ళు నిరంతరం వస్తుంటే, అది కూడా సాధారణం కాదు. ముఖ్యంగా మహిళల్లో, నిరంతర ఎక్కిళ్ళు.. స్ట్రోక్ హెచ్చరిక సంకేతంగా పరిగణించబడతాయి. శ్వాస, మింగడాన్ని నియంత్రించే మెదడులోని భాగం ప్రభావితం కావడం ప్రారంభించినప్పుడు ఇది జరుగుతుంది. సాధారణంగా ఎక్కిళ్ళు కొంతకాలం తర్వాత ఆగిపోతాయి లేదా వాటంతట అవే నయమవుతాయి.. కానీ అది గంటలు లేదా రోజుల పాటు కొనసాగడంతోపాటు.. బలహీనత, మాట్లాడటంలో సమస్యలు లేదా శరీరంలో వింతగా అనిపిస్తే, మీరు వెంటనే ఆరోగ్య నిపుణుడిని సంప్రదించాలి. ఛాతీ నొప్పి ఎల్లప్పుడూ గుండెపోటుకు కారణం కాదు.. తరచుగా ఇది తేలికపాటి బిగుతు, మంట లేదా అసౌకర్యం వల్ల కూడా వస్తుంది. అదే సమయంలో, కొన్నిసార్లు ఛాతీ నొప్పిని ఆమ్లత్వం లేదా గ్యాస్ కారణంగా భావిస్తారు. కానీ ఛాతీ నొప్పి ప్రతిసారీ సాధారణం కాదు.



# వ్యాపారం



## ఎస్‌బిఐ ఫలితాలు భళా




దేశంలోనే అతి పెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆకర్షణీయ ఆర్థిక పలితాలను ప్రకటించింది.ఆర్థిక సంవత్సరం 2025- 26 జూన్ పీపీటీవీ ముగిసిన మొదటి త్రైమాసికం ( క్యూ1) మొండి బాకీలను కట్టడి లో ఉంచడం తో పాటు వడ్డీ ఆదాయం పెరగడం బ్యాంకు మెరుగైన ఆర్థిక ఫలితాలకు ప్రధాన మద్దతును ఇచ్చాయి. ఈ నేపథ్యంలో గడిచిన త్రైమాసికంలో ఆ బ్యాంకు నికర లాభాలు 12.4 శాతం పెరిగి రూ. 19,160.44 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 17,035.16 కోట్ల లాబాలు ఆర్జించది. మార్కెట్ అంచనాలైన రూ. 17,095 కోట్లను అధిగమించింది. నికర వడ్డీ ఆదాయం 0.1 శాతం శాతం తగ్గి రూ. 41,072 కోట్లకు చేరింది. గత ఏడాది రూ. 41,126 కోట్లుగా ఉంది. వడ్డీ ఆదాయం 5.8 శాతం పెరిగి రూ. 1,17,996 కోట్లకు చేరింది. గత ఏడాది రూ. 1,11,526 కోట్ల వడ్డీ ఆదాయం చోటు చేసుకుంది. గడిచిన క్యూ1 లో ఇతర ఆదాయం 55.4 శాతం గణనీయంగా పెరిగి రూ. 17,345 కోట్లకు చేరింది. గత ఏడాది ఇది రూ. 11,162 కోట్లుగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తుల 1.83 శాతంగా, నికర నిరర్థకఆస్తులు 0.47 శాతంగా ఉన్నాయి. రుణాల జారీ 11.8 శాతం పెరిగి రూ. 41.91 లక్షల కోట్లకు, డిపాజిట్లు 8.7 శాతం పెరిగి రూ. 53.28 లక్షల కోట్లకు చేరాయి.

## అమెరికాలో భారత పచ్చళ్ళ వ్యాపారం విలువ రూ. 20 వేల కోట్లు



భారతదేశం సుగంధ ద్రవ్యాలకు పుట్టినిల్లు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిదారుగా మాత్రమే కాకుండా, అతిపెద్ద ఎగుమతిదారుగా కూడా నిలుస్తోంది. భారతదేశం ప్రతియేటా సుమారు రూ. 20,000 కోట్ల విలువైన పచ్చళ్ళు, పాపడ్‌లు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ముఖ్యంగా కెనడా, యుకె, అమెరికాలో ఈ ఉత్పత్తులకు భారీగా డిమాండ్ ఉంది. 2023-24లో రూ. 36,958.80 కోట్ల విలువైన స్పైసెస్ ను ఎగుమతి చేయగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరునెలల్లోనే భారత్ రూ. 29,016 కోట్ల (ఖూవి 3.36 బిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసి రికార్డ్ నెలకొల్పింది. 2027 నాటికి 10 బిలియన్ డాలర్ల ఎగుమతిని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీటిలో ఒక్క అమెరికానే రూ. 5,136 కోట్ల (ఖూవి 594.82 మిలియన్) విలువైన స్పైసెస్ ను దిగుమతి చేసుకోగా.. రూ. 2,766 కోట్ల (ఖూవి 320.36 మిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను యూకే దిగుమతి చేసుకుంది. అమెరికాలో వీటి డిమాండ్ ప్రతియేటా 10% పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా, కెనడా, యుకెలతో సహా అన్ని యూరప్ దేశాల్లో భారతీయ పచ్చళ్లకు, పాపడ్‌లకు డిమాండ్ ఎక్కువే. అక్కడి మార్కట్లలో ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతాయి. చాలాసార్లు ఔట్ ఆఫ్ స్టాక్ బోర్డులు కూడా దర్శనం ఇస్తాయి. అయితే ఇందుకు గల ప్రధాన కారణం భారత్ నుంచి విదేశాలకు పెరుగుతున్న భారీ వలసలు అంటున్నారు నిపుణులు. అలాగే విదేశీయుల్లో భారతీయ రుచుల పట్ల ఆసక్తి, ఆరోగ్యకరమైన సేంద్రీయ ఆహార ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న ఆదరణ కూడా కారణమే అంటున్నారు. ఉదాహరణకు కెనడాలో భారతీయ రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లలో మామిడి, నిమ్మ వంటి పచ్చళ్ళు, భారత్ నుంచి ఎగుమతయ్యే బియ్యం, పాపడ్‌లకు గిరాకీ ఎక్కువగా ఉంది. అలాగే యుకెలో కూడా పచ్చళ్ళు, పాపడ్‌లు బ్రిటిష్-ఇండియన్ వంటకాలలో ప్రధాన భాగంగా మారాయి. భారత్ తన నిర్దిష్ట లక్ష్యాన్ని చేరాలంటే ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లు, అంతర్జాతీయ ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఎగుమతులు ఉండటం, మార్కెట్ అడ్డంకులను అధిగమించాల్సిన అవసరం ఇంకా ఉన్నట్లు తెలుస్తోంది.

## చిన్న పరిశ్రమలకు శరాఘాతం



భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక సుంకాలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)లకు శరఘాతంగా మారాయి.యుఎస్ విధించిన 50 శాతం భారీ సుంకాలతో ఎంఎస్ఎంఇ ఎగుమతిదారులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. ఇప్పటికే వేసిన సుంకానికి మరో 25 శాతం పెంచడంతో మొత్తం 50 శాతానికి చేరిన విషయం తెలిసిందే. ట్రంప్ చర్యలు అత్యంత షాకింగ్‌గా ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ) పేర్కొంది. "ట్రంప్ చర్యలు భారత ఎగుమతులకు తీవ్రమైన ఎదురుదెబ్బ. యుఎస్ మార్కెట్‌కు వెళ్తున్న మన ఎగుమతులలో దాదాపు 55 శాతం నేరుగా ప్రభావితమవుతాయి. ఎగుమతిదారులపై ఖర్చు భారం పెరగనుంది. దీనివల్ల తక్కువ సుంకాలను ఎదుర్కొనే దేశాల ఎగుమతిదారులతో పోలిస్తే మన ఎగుమతిదారులు 30-35 శాతం పోటీతత్వ నష్టాన్ని చవి చూడాల్సి ఉంటుంది.' ఎఫ్ఐఇఒ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు. అధిక టారిఫ్‌లు ముఖ్యంగా టెక్స్‌టైల్స్, మెరైన్ ఉత్పత్తులు (రొయ్యలు), లెదర్ రంగాలను తీవ్రంగా దెబ్బతీయనున్నాయి. ఆగస్టు 7 నుంచే తొలి దశ 25 శాతం సుంకాలు అమల్లోకి రావడంతో ఇప్పటికే అనేక ఆర్డర్లు నిలిచిపోయాయని పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కొత్త సుంకాలతో భారతీయ వస్తువులు అమెరికాలో అత్యధిక దిగుమతి సుంకం రేటును ఎదుర్కొంటున్నాయి. ఇది బ్రెజిల్‌తో సమానంగా ఉంది. "ఎంఎస్ఎంఇలు నడిపే అనేక రంగాలకు ఈ ఆకస్మిక వ్యయాలు, టారిఫ్‌ల పెరుగుదలను భరించడం సాధ్యం కాదు. లాభాలు ఇప్పటికే తక్కువగా ఉన్నాయి. ఈ అదనపు దెబ్బ వల్ల ఎగుమతిదారులు దీర్ఘకాల క్లయింట్‌లను కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ అధిక సుంకాలతో దేశీయ ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్‌లను వెతుక్కోవాల్సి ఉంటుంది." అని అజయ్ సహాయ్ పేర్కొన్నారు. యుఎస్ సుంకాలు సుమారు 47.6 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులను నేరుగా ప్రభావితం చేస్తాయి. ఇది భారతదేశ ఎగుమతులలో 55 శాతానికి సమానం. అందులోనూ ఎంఎస్ఎంఇలపై అధిక ప్రభావం ఉండనుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అధిక టారిఫ్‌లు టెక్స్‌టైల్స్, మెరైన్ ఉత్పత్తులు, లెదర్ రంగాల్లోని లక్షలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆ పరిశ్రమ వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. టెక్స్‌టైల్ తయారీలో 40 లక్షల మంది, దుస్తుల ఉత్పత్తిలో 1.11 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారని అంచనా. ఈ సుంకాల వల్ల ఆర్డర్లు నిలిచిపోవడానికి తోడు టారిఫ్‌లు పెరగడం వల్ల ఎంఎస్ఎంఇలు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొం టాయి. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో 5.8 బిలియన్ డాలర్ల వస్త్రాలు, తోలు, పాదరక్షలకు సంబంధించి 1 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు జరిగాయి. ఆయా రంగాల్లో యుఎస్ చర్యలతో భారత్‌లోని లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుంకాలు తగ్గకపోతే భారీగా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఎఫ్ఐఇఒకు చెందిన ఓ ప్రతినిధి పేర్కొన్నారు. "అధిక సుంకాలు టెక్స్‌టైల్, దుస్తుల ఎగుమతి దారులకు భారీ ఎదురుదెబ్బ. అదే విధంగా వియత్నాం, బంగ్లాదేశ్‌లతో పోటీపడే సామర్థ్యాన్ని భారీగా బలహీన పర్చనుంది." అని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సిఐటిఐ) ఛైర్మన్ రాకేష్ మెహ్రా పేర్కొన్నారు. దీనిపై తక్షణ ప్రభుత్వ జోక్యం అవసరమని అన్నారు.

## మధ్యతరగతికి శాపంగా మారిన ఏఐ..



ఏఐ వల్ల లాభాలు ఎన్నో కానీ ఉద్యోగాలకు మాత్రం ఏఐ ఎసరు పెడుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీలలో ఇప్పటికే భారీగా ఉద్యోగాలు కోతకు గురయ్యాయి.టీసీఎస్, అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ ఇలా పేరు మోసిన కంపెనీల్లో ఇటీవల భారీగా లే ఆఫ్స్ జరిగాయి. కొన్ని కంపెనీలలో ఒకేసారి 12వేల నుండి 15వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇక ఏఐతో మరింత ప్రమాదం పొంచి ఉందని గూగుల్ మాజీ ఉద్యోగి మో గౌడత్ వెల్లడించారు. ఓ పాడ్ కాస్ట్ లో ఆయన మాట్లాడుతూ... 2027 వరకు పరిస్థితులు చాలా మారిపోతాయన్నారు. ఏఐ గణనీయమైన మార్పులు తీసుకువస్తుందని చెప్పారు. ముఖ్యంగా మధ్యతరగతి పతనానికి ఏఐ దారి తీస్తుందని నమ్ముతున్నా అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టాప్ 1శాతంలో లేకపోతే మీరు రైతు అవుతారు, మధ్యతరగతి అనేదే ఉండదు అని చెప్పారు. 2027 నాటికి ఉన్నత విద్యావంతులైన వ్యక్తులు కూడా నిరుద్యోగులుగా మారవచ్చని, దీనివల్ల ప్రస్తుత మధ్యతరగతిపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు. 2027 నాటికి ప్రస్తుతం 350 మందితో పనిచేసే స్టార్టప్ కంపెనీలు కేవలం ముగ్గురితో పనిచేస్తాయని చెప్పారు. గతంలో పారిశ్రామికీకరణ కారణంగా మాన్యువల్ స్థానంలో యంత్రాలు వచ్చాయని, ఇప్పుడు విద్యావంతులైన ఉద్యోగుల స్థానంలో ఏఐ ఆటోమేషన్ వస్తుందన్నారు.

## సేవింగ్స్ ఖాతాలో రూ.50 వేలు ఉండాల్సిందే




దేశంలో రెండో అతిపెద్ద కార్పొరేట్ బ్యాంక్ అయిన ఐసీఐసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రీమియం కస్టమర్ బేసను పెంచుకోవాలనే ఉద్దేశంతో కొత్త నిబంధనను తీసుకొచ్చింది. తమ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్లు కలిగిన ఖాతాదారుల మినిమమ్ బ్యాలెన్స్ పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కొత్త కస్టమర్లకు ఆగస్టు 1న లేదా ఆ తర్వాత ఖాతాలు తెరిచిన వారు మెట్రో, పట్టణ ప్రాంతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ రూ.50 వేలకు పెంచారు. గతంలో ఆ పరిమితి రూ.10 వేలుగా ఉండేది. ఇక సెమీ అర్బన్ పట్టణాల్లో మినిమన్ బ్యాలెన్స్ రూ.25 వేలుగా నిర్ణయించారు. అంతకు ఆ పరిమితి రూ.5 వేలుగా ఉంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఖాతాదారుల మినిమమ్ బ్యాలెన్స్ ఇక రూ.10 వేలుగా డిసైడ్ చేశారు. గతంలో ఆ లిమిట్ రూ.5 వేలుగా ఉండేది. ఒకవేళ ఖాతాదారులు మినిమమ్ బ్యాలెన్స్ మెయిన్‌టెయిన్ చేయని పక్షంలో 6శాతం లోటుతో రూ.500 జరిమానా విధించబడుతుంది. తాజాగా ఐసీఐసీఐ తెచ్చిన నిబంధన చూసి ఖాతాదారులు ఖంగుతింటున్నారు. నెల తిరగక ముందే ఖాతా ఖాళీ అవుతోన్న వేళ ఈ నిబంధనలు ఏంట్రా బాబు.. అని గగ్గోలు పెడుతున్నారు.

## తగ్గనున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఈఎంఐలు




దేశీయ అతిపెద్ద ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన కస్టమర్లకు భారీ ఊరట కల్పించింది. బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది.సవరించిన రేట్లు ఆగస్టు 7 నుంచే అమల్లోకి వచ్చాయని వెల్లడించింది. బ్యాంకు నిర్ణయంతో వినియోగదారులు తీసుకునే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐల భారం తగ్గనుంది. ఎంపిక చేసిన రుణాల కాలవ్యవధులపై బ్యాంకు ఎంసీఎల్ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. రిటైల్ రుణాలపై ప్రభావం చూపే ఏడాది కాలపరిమితి కలిగిన ఎంసీఎల్ఆర్ మాత్రం 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. బ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, సవరించిన తర్వాత రుణాల రేట్లు 8.55 శాతం నుంచి 8.75 శాతం మధ్య ఉంది. ఇదివరకు 8.60 శాతం నుంచి 8.80 శాతం మధ్య ఉండేది. కొత్త రేట్లకు సంబంధించి.. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.55 శాతానికి, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.60 శాతానికి, 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.70 శాతానికి, ఏడాది ఎంసీఎల్ఆర్ 9.05 శాతం నుంచి 8.75 శాతానికి తగ్గించింది. 2 ఏళ్ల ఎంసీఎల్ఆర్ 8.75 శాతం స్థిరంగా ఉంచింది. మూడేళ్ల ఎంసీఎల్ఆర్ 8.75 శాతానికి తగ్గించింది.

# రథోత్సవానికి ప్రత్యేక పూజలు



**మల్దకల్, డిసెంబర్9(స్కై న్యూస్):**ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి రథోత్సవాన్ని తయారు చేయించి నేటికీ 13 సంవత్సరాలు పూర్తి అవుతుంది. మల్దకల్ గ్రామానికి చెందిన దామ శంకరయ్య దంపతులు ఆధ్వర్యంలో శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయానికి రథం తయారు చేయించి బహుకరించారు. నాటి నుండి నేటి వరకు రథోత్సవం ద్వారా దేవాలయానికి ఆదాయం కూడా లభిస్తున్నది. ఈ సందర్భంగా శ్రావణ పౌర్ణమి శనివారం దామ శంకరయ్య దంపతులు రథోత్సవ పూజలు నిర్వహించారు. దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**ఘనంగా శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణం**

ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ శనివారం పౌర్ణమి సందర్భంగా శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పత్తికొండ వాస్తవ్యులు సందీప్ దంపతులు దామ శంకరయ్య దంపతులు గజేందర్ రెడ్డి తాటికుంట చెన్నిపాడు జనార్దన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని అర్చకులు మధుసూదనాచారి తదితరులు నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని దాత దామ శంకరయ్య దంపతులు నిర్వహించారు.

# సీఎం సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరం ..

**పేదప్రజల సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 9 (స్కై న్యూస్):**గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల మండలం వివిధ గ్రామానికి సంబంధించిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధికి నమోదు చేసుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, నాయకులు అశోక్ రెడ్డి, నరేందర్ రెడ్డి , కేశవ్ రెడ్డి ,చంద్రశేఖర్ , సత్యనారాయణ, కురుమన్న , వెంకట్రామిరెడ్డి , మధు, మోహన్ రెడ్డి, నారాయణ , జగదీశ్వర్ రెడ్డి, వీరేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాపు సీతాలక్ష్మి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**కొత్తగూడెం,ఆగస్టు 9(స్కై న్యూస్)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం రామవరం కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసంలో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసానికి వచ్చి రాఖీ కట్టించుకొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా గ్రామ గ్రామాన వాడవాడలో రక్షాబంధన్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారని . అన్నా చెల్లెలు,అక్క తమ్ముళ్లు ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్ జరుపుకుంటారు. సోదరి సోదరుని క్షేమం కోరుతూ సోదరుడు సోదరికి ఎల్లవేళలా రక్షణగా నిలుస్తాడు. ఈ ప్రేమను బంధానికి చిహ్నమేరాఖీ పండుగ జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరుపుకునే ఈ పండుగ ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి అన్న,తమ్ముడు రాఖీ కట్టి వెళుతుంటారు. వీరందరూ క్షేమంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అక్కా చెల్లెళ్లకు,ఆడపడుచులకు, మహిళలు రాఖీ పౌర్ణమి జరుపుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రత్నకుమార్ మాజీ కౌన్సిలర్లు కొల్లాపూర్ ధర్మారావు యూసుఫ్ పరమేష్ యాదవ్ కొండ వేణుగోపాల్ మాచర్ల శ్రీనివాస్ లక్ష్మణ్ విజయ్ సత్యనారాయణ కాజా బక్షి మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో వైభవంగా శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి కళ్యాణం



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 9 (స్కైన్యూస్):**శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో వైభవంగా శ్రీ లక్ష్మీ హైగ్రీవ స్వామి కళ్యాణం జరిగింది,శ్రీ వైష్ణవ సంప్రదాయంలో లక్ష్మీ హైగ్రీవ స్వామి కళ్యాణం జరిగింది ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, జిలకర బెల్లం, మంగళాష్టకాలు,మాంగళ్య పూజ, కన్యాదానం,మాంగళ్య ధారణ, తలంబ్రాలు, చూర్ణిక, కార్యక్రమాలు జరిగాయి. ఆ తర్వాత స్వామివారికి మహా మంగళహారతి తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు సంవృత్ భరద్వాజ్, సంకర్షణ భరద్వాజ్, సాత్విక్ భరద్వాజ్, రాఘవాచార్యులు, పవన్ కుమార్, ధర్మకర్తలు సుహాసిని రెడ్డి, విక్రం సింహారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామ్ చందర్ రావు గారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..



**షాద్నగర్ 9(స్కై న్యూస్:**రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈరోజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామ్ చందర్ రావును హైదరాబాద్ లోని వారి నివాసం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిదంగా తిరుమల తిరుపతి శ్రీవారి ప్రసాదన్ని రామ్ చందర్ రావుకు అందించి, భవిష్యత్తులో రామ్ చందర్ రావు నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం లో బీజేపీ బలోపేతం అవ్వాలని శ్రీవర్ధన్ రెడ్డి కోరారు..

# గద్వాల పట్టణ పద్మశాలీలు ఘనంగా జరుపుకున్న జంధ్యాల పౌర్ణమి......



**జోగులాంబ గద్వాల ,ఆగస్టు 9 (స్కై న్యూస్):**శ్రావణ శుద్ధ పౌర్ణమిని నూలు పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమిగా పిలువగా కొన్నిచోట్ల రాఖీ పౌర్ణమి పిలవబడుతుంది. జోగులాంబ గద్వాల జిల్లా పద్మశాలీలు భక్తిశ్రద్ధలతో జంధ్యాల పౌర్ణమి శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో జరుపుకున్నారు. ఉదయం 6 గంటల నుండి శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో మాకం బీచ్ పల్లి, అక్కల కుమార్, నామాల శ్రీకాంత్ ,అక్కల విశ్వనాథం దంపతులు మార్కండేయ స్వామికి పంచామృతాభిషేకం, గణపతి పూజ , హెూమములు నిర్వహించారు. ఈ కార్యక్రమం పద్మశాలి పట్టణ సేవా సంఘం, పట్టణ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుపుచున్నామని పట్టణ అధ్యక్షుడు నామల శ్రీకాంత్, అక్కల కుమార్ అన్నారు. జంధ్యాల పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు ప్రతి ఒక్కరూ ఇంటి ఆడపడుచులను మెట్టినింటి నుండి పుట్టింటికి ఆహ్వానిస్తారు. ఆప్యాయంగా ప్రేమానురాగంతో అన్నాతమ్ములకు అక్కా చెల్లెళ్ళు రక్షాబంధన్ , రాఖీ కట్టి వారి కుటుంబాలు చల్లంగా ఉండాలని దీవిస్తారు. జంధ్యాల పౌర్ణమిని, నూలుపౌర్ణమిగా దక్షిణాయనంలో శ్రావణపూర్ణిమనాడు సూర్యధ్యానం చేస్తారు. వేదవిద్యలను ఆరంభిస్తారు. శ్రావణ పూర్ణిమనాడు ద్విజులే కాక ఆలయాల్లోని దేవతామూర్తులు కూడా నూతన యజ్ఞోపవీత ధారణ చేస్తారు. దేవతల అలంకారంలో యజ్ఞోపవీతం కూడా ఒకటి. శ్రావణ పూర్ణిమ నాడు ఆలయాలలో పవిత్రారోపణం చేస్తారు. తొమ్మిది పోగులతో చేసిన నూలు దారాన్ని నవసూత్రం అంటారు. దేవతామూర్తికి మోకాళ్ల పర్యంతం ఇరవైనాలుగుసార్లు వేస్తే అది ఉత్తమ పవిత్రమవుతుంది. ఈ నవసూత్ర యజ్ఞోపవీతాన్ని ఆలయాలలో దేవతామూర్తులకు ధరింపచేస్తారు. అలాగే ద్విజులు ఆనాడు నూతన యజ్ఞోపవీతధారణ చేస్తారు. యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతేః యత్సహజం పురస్తాత్ ఆయుష్యమగ్ర్యం ప్రతిముంచ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజః యజ్ఞోపవీతంలోని గ్రంథిని బ్రహ్మముడి అంటారు. ఆ ముడిచివర గాయత్రి ఉంటుంది. జంధ్యం బ్రహ్మతేజస్సు, వర్చస్సు, ఆయుష్షు, యశస్సు అనుగ్రహిస్తుంది. శ్రావణ పూర్ణిమ రోజునే కాకుండా అశౌచ సందర్భాలలో కూడా నూతన యజ్ఞోపవీతం ధరించాలి. జీర్ణమైన యజ్ఞోపవీతాన్ని ఎక్కువ కాలం ధరించకూడదు. కొత్త జంధ్యం వేసుకున్న తరువాత పాతజంధ్యంతో కలిపి పట్టుకుని గాయత్రీ మంత్రాన్ని జపించాలి. తద్వారా నూతన యజ్ఞోపవీతం శక్తివంతం అవుతుంది. ఆ తరువాత పాత జంధ్యాన్ని తులసి కోటలో కానీ, ఇంటిపైకప్పుపై కానీ ఎవరూ తొక్కని చోట పారవేయాలి. శ్రావణ పౌర్ణమినాడు జంధ్యం మార్చుకుని యధాశక్తి గాయత్రీ మంత్ర జపం చేయాలి.

# పల్లె రహదారుల అభివృద్ధిపై ప్రేత్యేక ద్రుష్టి

**రహదారుల నిర్మాణంతో గ్రామాలను అనుసంధానిస్తున్నాం**

**ప్రతి గ్రామానికి పక్కా రహదారుల నిర్మించేదిశగా ప్రణాళిక**

**రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయి**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**2.50కిలోమీటర్ల నన్యాతండా-బేతంపూడి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**





**సుజాతనగర్ ఆగస్టు 9 (స్కై న్యూస్ ) :** గ్రామీణ ప్రాంతాలకు రవాణాసౌకర్యం మెరుగుపర్చేందుకు ముమ్మరంగా రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని, రహదారుల నిర్మాణం, అభివృద్ధిపై ప్రేత్యేక ద్రుష్టి సారించి అనతికాలంలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పంచాయతిరాజ్ రోడ్ల శాఖ రూ. 1.80కోట్ల నిధులతో మండలంలోని బేతంపూడి నుంచి నల్లవాగు మీదుగా నాన్యతాండా వరకు 2.50కిలోమీటర్ల బిటి రోడ్డు పనులకు శనివారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన శంకుస్థాపన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రతి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించి రవాణావ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు గ్రామాలు, పట్టణాలను అనుసంధానించేందుకు నిరంతర కృషి జరుగుతోందని, రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. పంచాయతి రాజ్ శాఖా నుంచి నియోజకవర్గంలో 8.50కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి రూ. 15కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. రహదారులతోపాటు ప్రజల కనీస అవసరాలైన విద్యుత్ సౌకర్యం, వైద్యం, డ్రైన్ల, త్రాగునీటి వసతి కల్పించేందుకు చేసిన కృషి ఫలితంగా ఇప్పటివరకు 80శాతం మేర పనులు పూర్తికాగా, కొన్ని గ్రామాల్లో నిర్మాణదశలో ఉన్నాయన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో సమస్యలులేని గ్రామాలు ఆవిష్కృతమవుతాయని, మునుపెన్నడూ లేని అభివృద్ధిని సాధించి చూపెడుతున్నామన్నారు. నిర్మాణ పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేదిలేదని దీనికి అధికారులే బాధ్యత వహించాల్సిఉంటుందని హెచ్చరించారు. శంఖుస్థాపనికు వచ్చిన ఎమ్మెల్యే కూనంనేనిని శాలువా, పూలమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, టి.పాపారావు, ధర్మారావు, మూడు గణేష్, కొమారి కృష్ణ, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం 11 ఆగస్టు



**కొత్తగూడెం ఆగస్ట్ 9 ( స్కై న్యూస్):**జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్ జయలక్ష్మి జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్డీడీ ) అనేది భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 11 18వ తేదీలలో నిర్వహించే ఒక ప్రధాన కార్యక్రమం. జిల్లాలో 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల వారి లక్ష్యం 3'36'136 అని డాక్టర్ ఎస్ జయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమం 2060 అంగన్‌వాడీ కేంద్రాలు, 1771 పాఠశాలలు కళాశాలల్లో నిర్వహించబడుతుంది. మదర్సాలు, ఐటిఐ, ప్లే స్కూల్ భవిత పాఠశాలలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. అన్ని తల్లిదండ్రులు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గురించి తెలుసుకోవాలని ఆమె అన్నారు. ఆ రోజున చేతులు కడుక్కోవడానికి పద్ధతులను ప్రదర్శించాలి తినడానికి ముంద మలవిసర్జన తర్వాత చేతులు కడుక్కోవడం గురించి అవగాహన కల్పించాలి. జిల్లాలో ఆగస్టు 11వ తేదీని అమలు చేయడానికి అన్ని సన్నాహక పనులు పూర్తయ్యాయి. ప్రతి బిడ్డ అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని డిఎం %ఢ%హెచ్ ఓ తెలిపింది. ఇది ఉపయోగకరంగా ఉంటుంది అల్బెండజోల్ మాత్రల నిర్వహణతో సామూహిక నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లలు కౌమారదశలో (1%-%19 సంవత్సరాల వయస్సు) నులిపురుగుల ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి పిల్లల ఆరోగ్యం, పోషకాహార స్థితి విద్యా ఫలితాలను మెరుగుపరచండి. పేగు నులిపురుగుల ఇన్ఫెక్షన్ల (నేల ద్వారా సంక్రమించే హెల్మిన్త్‌లు లేదా ఎస్ టీ హెచ్ ) గురించి అవగాహన పెంచండి. పరిశుభ్రత పారిశుద్ధ్య పద్ధతులను ప్రోత్సహించండిపర్యవేక్షణలో పిల్లలకు నమలగల మాత్రను ఇస్తారు. ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందుగానే శిక్షణ ఇస్తారు. ఐఈ సి (సమాచారం, విద్య కమ్యూనికేషన్) ప్రచారాలు తల్లిదండ్రులు సమాజాలలో అవగాహన పెంచుతాయి. నులిపురుగుల నిర్మూలన ఎందుకు ముఖ్యమైనది రక్తహీనత, పోషకాహార లోపం మరియు బలహీనమైన మానసిక శారీరక అభివృద్ధిని నివారిస్తుంది. పాఠశాల గైర్హాజరీని తగ్గిస్తుంది పనితీరును పెంచుతుంది. రక్తహీనత నియంత్రణ పోషకాహార మిషన్‌ల వంటి ఇతర ఆరోగ్య కార్యక్రమాలలో మెరుగైన ఫలితాలను సాధించడంలో సహాయపడుతుంది.

# జర్నలిస్టులకు రాఖీ కట్టిన కాపు సీతాలక్ష్మి

**వారి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు**



**కొత్తగూడెం,ఆగస్టు 9(స్కై న్యూస్)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం రామవరం కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసంలో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా జర్నలిస్టులు రత్నకుమార్ కిరణ్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసానికి వచ్చి రాఖీ కట్టించుకొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా గ్రామ గ్రామాన వాడవాడలో రక్షాబంధన్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారని . అన్నా చెల్లెలు,అక్క తమ్ముళ్లు ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్ జరుపుకుంటారు. సోదరి సోదరుని క్షేమం కోరుతూ సోదరుడు సోదరికి ఎల్లవేళలా రక్షణగా నిలుస్తాడు. ఈ ప్రేమను బంధానికి చిహ్నమేరాఖీ పండుగ జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరుపుకునే ఈ పండుగ ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి అన్న,తమ్ముడు రాఖీ కట్టి వెళుతుంటారు. వీరందరూ క్షేమంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అక్కా చెల్లెళ్లకు,ఆడపడుచులకు, మహిళలు రాఖీ పౌర్ణమి జరుపుకుంటారు అని అన్నారు.

# కొత్వాలకు రాఖీ కట్టి అనుబంధాన్ని తెలిపిన ముస్లిం యువతి



**పాల్వంచ ఆగస్టు 9 (స్కై న్యూస్ ):**రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసి ఎమ్మెస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావుకు పాత పాల్వంచకు చెందిన ముస్లిం యువతి సయ్యద్ జాకీరా రాఖీ కట్టి అన్నా చెల్లెళ్ళ అనుబంధాన్ని చాటింది. పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో మహిళలు ఆయనకు రాఖీలు కట్టారు. పాల్వంచ మండలం పరిధిలోని పాత సూరారం గ్రామానికి చెందిన ఆదివాసి యువతులు కొత్వాలకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ తన మీద అభిమానంతో రాఖీలు కట్టిన మహిళలకు జన్మ జన్మలకు రుణపడి వుంటానని, వారి కుటుంబాల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానని అన్నారు.

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**జోగులాంబ గద్వాల ,ఆగస్టు 9(స్కై న్యూస్)** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా గ్రామ గ్రామాన వాడవాడలో రక్షాబంధన్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెలు,అక్క తమ్ముళ్లు ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్ జరుపుకుంటారు. సోదరి సోదరుని క్షేమం కోరుతూ సోదరుడు సోదరికి ఎల్లవేళలా రక్షణగా నిలుస్తాడు. ఈ ప్రేమను బంధానికి చిహ్నమేరాఖీ పండుగ జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరుపుకునే ఈ పండుగ ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి అన్న,తమ్ముడు రాఖీ కట్టి వెళుతుంటారు. వీరందరూ క్షేమంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అక్కా చెల్లెళ్లకు,ఆడపడుచులకు, మహిళలు రాఖీ పౌర్ణమి జరుపుకుంటారు. గ్రామాలలో రక్షాబంధన్ ఘనంగా జరుపుకున్నారు

# సుజాతనగర్ లో ఏం జరుగుతుంది .. ప్రశ్నిస్తే తప్ప

**విలేకరులైతే మాకేంటి నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో**
**అధికారుల అండదండలే మా బలం**
**అందరికీ మామూళ్లు మా దగ్గర నుండి**
**మామూళ్ల మత్తులో అధికారులు**
**సుజాతనగర్ సెంటర్లో అడుగడుగునా వైన్ షాపులు**
**కొత్తగూడెం టు సుజాతనగర్ ఖమ్మం ప్రధాన రహదారిపై సుజాతనగర్ లో అనేక వైన్ షాపులు**
**ప్రశ్నించిన వారిపై తిరుగుబాటు. సోద్యం చూస్తున్న అధికారులు**
**ఆర్ అండ్ బి టాస్క్ ఫోర్స్ పోలీసు వ్యవస్థ సుజాతనగర్ లో నిర్వీర్యం**
**విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు**
**మద్యం షాపులకు లైసెన్స్ తీసుకున్న అధికారులు నిబంధనలు పాటిస్తుంటే**
**బెల్ట్ షాపులకు నిబంధనలు అవసరం లేదు అంటున్న వైన్ షాప్ నిర్వాహకులు**

**సుజాతనగర్ ఆగస్టు 9 (స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సుజాతనగర్ లో శుక్రవారం రోజు జరిగిన సంఘటన వల్ల అనేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సుజాతనగర్ ప్రధాన కూడలిలో ఆర్ అండ్ బి రోడ్డును ఆక్రమించి అనేక బెల్ట్ షాపులు పండ్ల దుకాణాలు కూరగాయల దుకాణాలు చెప్పుల దుకాణాలు ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణాలు ఆటో మెకానిక్ షెడ్లు బైక్ మెకానిక్ షెడ్లు అనేకనేక వ్యాపార సముదాయాలుగా ఏర్పడి సుజాతనగర్ ప్రధాన రహదారిని మూసివేసే విధంగా చుట్టివేశారు. ఆర్టీసీ బస్సు ఆగడానికి చోటు లేని పరిస్థితి సుజాతనగర్లో కండ్లకు గట్టినట్టుగా కనిపిస్తుంది. ఇదే అదునుగా భావించి సుజాతనగర్ ప్రాంతంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులు విచ్చలవిడిగా మద్యం అమ్ముతూ మద్యం తాగడానికి వచ్చిన వారి బండ్లను రోడ్డుపైనే పార్కింగ్ చేసి ప్రజలకు అసౌకర్యం కల్పిస్తున్నటువంటి వైనం మన సుజాతనగర్ లో చూడవచ్చు. ఈ విషయంపై బెల్ట్ షాప్ నిర్వాహకుడిని విలేఖరి ప్రశ్నించగా బెల్ట్ దుకాణం యజమాని నీ ఇష్టం. నీ ఇష్టం వచ్చినటు చేసుకో నీ వల్ల ఏమి కాదు అంటూ దురుసుగా ప్రవర్తించి మద్యం తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఉసిగొలిపి తనపై తిరుగుబాటు చేసిన సంఘటన మనం చూసాం. ఇన్ని సంఘటన జరుగుతున్న



సుజాతనగర్ లో పోలీసు వ్యవస్థ గాని ఎక్సేంజ్ వ్యవస్థ గాని రాజకీయ నాయకులు గాని పలుకుబడి ఉన్న వ్యక్తులు ఈ వ్యవస్థను ఈ అక్రమాలను అదుపు చేయలేక విఫలమవుతున్నారని స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంఘటనలపై పదుల సంఖ్యలో దినపత్రికల్లో ప్రచురించిన ఫలితం శూన్యం. ప్రజలకు ఇబ్బందులు కలిగించిన ఏ కార్యక్రమం చేసిన వెంటనే స్పందించే పోలీసు వ్యవస్థ ఏమైపోయిందో అని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇటువంటి కార్యక్రమాలు పునరావతం కాకుండా తగు చర్యలు అధికార యంత్రాంగం చేపట్టాలని అధికారులు స్పందించి



సకాలంలో రోడ్లపై ఏర్పడుతున్న ట్రాఫిక్ ను నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు నానాటికి ఆశిస్తున్న ఆలోచన బెల్ట్ షాపుల పేరుతో సుజాతనగర్ మండలంలో వివిధ తండాలలో నాటు సారు లభ్యమవుతున్న విషయం తెలిసినదే. నాటు సారాను తండాలలో తక్కువ రేటుకు కొనుగోలు చేసి బిల్డ్ షాపులలో కొంతమంది అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్టు ప్రజలు అనుకుంటున్నారు. ఏది ఏమైనా అధికారులు చొరవ చూపి వ్యవస్థలో జరిగే లోపాలను సరిచేసి ప్రజలకు సరైన రీతిలో సహకరించాలని కోరుకుంటున్నారు.

# ఉత్తరాస్ పల్లిలో బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామస్థుల సంకల్పం

**షాద్నగర్ 9(స్కైన్యూస్):**రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని ఉత్తరాస్ పల్లి గ్రామంలో మద్యపాన వ్యసనాన్ని అరికట్టే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ నాయకులు, పెద్దలు, యువత సమావేశమై బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.మద్యం విక్రయం జరిపే వారికి కఠిన చర్యలు తీసుకుంటామని, దానికి రూ.10 లక్షల జరిమానా విధించడంతో పాటు గ్రామ శిక్ష విధానాల ప్రకారం తగిన శిక్షలు ఉంటాయని తెలిపారు. మద్యం విక్రయం జరుగుతున్న విషయాన్ని సమాచారం ఇచ్చే వారికి ప్రోత్సాహకంగా రూ.10 వేల బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు.గ్రామ నాయకులు మాట్లాడుతూ ం "బెల్ట్ షాపుల ద్వారా మద్యం సులభంగా లభించడం వల్ల యువత ఆరోగ్యం దెబ్బతింటోంది. కుటుంబాలు, సమాజం సమస్యల్లో చిక్కుకుంటోంది. ఈ సమస్యను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొని, గ్రామాన్ని మద్యం ముక్తంగా మార్చే సంకల్పం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండి, సమాజ ఆరోగ్యం, శాంతి భద్రత కోసం తీసుకున్న గ్రామ సమిష్టి నిర్ణయం గా తెలిపారు ..

# సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు 10 ఫ్యాన్ల వితరణ



**నారాయణపేట ఆగస్టు 9( స్కై న్యూస్):**శ్రీ సర స్వతి శిశుమందిర్ రామాలయం పాఠశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టినందుకు తరగతి గదులకు విద్యార్థుల సౌకర్యార్థమే సేవా భారతి విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ 10 ఫ్యాన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సర స్వతి శిశుమందిర్ రామాలయం పాఠశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టినందుకు తరగతి గదులకు విద్యార్థుల సౌకర్యార్థమే సేవా భారతి విభాగ్ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ 10 ఫ్యాన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరసంచాలక్ డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, పతంజలి సురేష్ కుమార్, శిశు మందిర్ జిల్లా కార్యదర్శి సీతారాములు, సహకార దర్శి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా సహకార్యవాహ మ్యాడం ప్రభాకర్,డా. క్రిష్ణారెడ్డి,ప్రధాన ఆచార్యులు దత్తు చౌదరి పాల్గొన్నారు.

# మట్టి ఇల్లు కూలి ఇద్దరికీ గాయాలు



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 9 (స్కై న్యూస్):**గద్వాల పట్టణంలోని వేదనగర్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మట్టి ఇల్లు కూలి ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి గద్వాల పట్టణంలోని వేదానగర్లో మట్టి ఇంటిలో నివాసముంటున్న దోత్రే వినోద్ కుటుంబం రాత్రి నిద్రిస్తుండగా కురిసిన భారీ వర్షానికి పల్లవి పావని కి స్వల్ప గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దోత్రే వినోద్ కిరాయి ఇంటిలో నివాసం ఉంటూ కాలం వెళ్ళదీస్తున్నాడు.

# అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక రాఖీ పండుగ

**బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ**
**తన సోదరుడికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మె సత్యనారాయణ సోదరీమణులు**

**షాద్నగర్ 9(స్కైన్యూస్):**అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక రాఖీ పండుగ అని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా శనివారం కొత్తూరు మండలంలోని ఎస్ బి పల్లి లో ఎమ్మె సత్యనారాయణ నివాసంలో ఆయన సోదరీమణులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సోదర సోదరీమణుల ఆత్మీయతకు అద్దం పట్టే రక్షాబంధన్ రోజున ప్రతి అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్లు ఒకరికొకరం కష్టసుఖాల్లో తోడు ఉన్నామన్న సంకేతంగా రక్షాబంధన్ సంకేతమని ఆయన పేర్కొన్నారు.ఈ



కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎమ్మె శ్రీలత కుటుంబ



సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కి, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేన రెడ్డి కి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆహ్వానం



**షాద్ నగర్ 9(స్కైన్యూస్ )బిజెపి** సీనియర్ నాయకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సోదరుడి కుమార్తె వివాహానికి తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారిని హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారిని త్రిపుర గవర్నర్ శ్రీ నల్లు ఇంద్రసేన రెడ్డి గారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ నెల 13న జరగనున్న వివాహానికి పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి గారి కుటుంబంలో జరుగుతున్న వివాహ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతామని చెప్పారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్స్

**హైదరాబాద్, ఆగస్టు 9:**సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నాడు ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, %ట్రాణజూ% సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు.అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని చెప్పారు. కలెక్టరేట్లలో ఏమైనా మంచి డిజైన్లు ఉంటే కనుక వాటిని హైదరాబాద్ కు పంపాలని ఈ సందర్భంగా కలెక్టర్లకు ఆయన సూచించారు. గ్రామపంచాయతీ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేస్తామన్నారు. వాటి ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపించారు. అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫీసుకి పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై తెలంగాణ ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసింది. ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్లకు భట్టి విక్రమార్క వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించాం. ఈ ఆగస్టు నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలోప్రభుత్వం ఉంది. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కనుక కలెక్టర్లు దీనిపై సత్వరం స్పందించి వారంలోగా వివరాలు పంపండి, ఈ విషయాల్లో ఏమైనా సందేహాలు ఉంటే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, %=జుణజూ ఎజడవీణ% ని సంప్రదించాలని' కలెక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

## టెస్లా సెకండ్ షోరూమ్

**ముంబై, ఆగస్టు 9:**ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా, భారత మార్కెట్‌లో తన కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తోంది. ముంబైలో తొలి షోరూమ్‌ను ప్రారంభించి నెల తిరగకముందే, దేశ రాజధాని ఢిల్లీలో రెండో షోరూమ్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఆగస్టు 11న ఈ కొత్త టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు కంపెనీ అధికారికంగా ప్రకటించింది.ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్)లో, "ఢిల్లీకి వచ్చేస్తున్నాం - వేచి చూడండి" అంటూ ఒక గ్రాఫిక్‌తో కూడిన పోస్ట్‌ను టెస్లా పంచుకుంది. ఢిల్లీలోని అత్యంత ఖరీదైన ఏరోసిటీ ప్రాంతంలో ఉన్న వరల్డ్‌మార్క్ 3 కాంప్లెక్స్‌లో ఈ కొత్త షోరూమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గత నెల ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో టెస్లా తన మొదటి షోరూమ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ హాజరయ్యారు. ఆ సందర్భంగా, టెస్లా తన మిడ్‌సైజ్ ఎస్‌యూవీ 'మోడల్ వై' కారును భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధర సుమారు రూ. 60 లక్షలుగా ఉంది. ఈ ఏడాది మూడో త్రైమాసికం నుంచి మోడల్ వై డెలివరీలు ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది.టెస్లా మోడల్ వై రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. స్టాండర్డ్ రియర్-వీల్ డ్రైవ్ వేరియంట్ 60 %ఎౌష్త్ర% బ్యాటరీతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 500 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. ఇక లాంగ్-రేంజ్ వేరియంట్ 75 %ఎౌష్త్ర% బ్యాటరీతో 622 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. తొలి దశలో ముంబై, పుణె, ఢిల్లీ, గురుగ్రామ్ నగరాల్లోని వినియోగదారులకు డెలివరీలలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఫ్లాట్-బెడ్ ట్రక్కుల ద్వారా నేరుగా వినియోగదారుల ఇంటికే కార్లను డెలివరీ చేయనున్నారు.

# ప్రమాదంలో సింగూరు రిజర్వాయర్

**హైదరాబాద్, ఆగస్టు 9:**హైదరాబాద్‌కు తాగునీరు అందించే సింగూరు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. డ్యామ్ పైభాగంలో రాతి కట్టడం దెబ్బతినడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ హెచ్చరించింది. మరమ్మతులు చేయకపోతే డ్యాం తెగిపోయే ప్రమాదం ఉందని, దిగువన ఉన్న బ్యారేజీలు కూడా దెబ్బతినే అవకాశం ఉందని కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పిట్టగోడకు చీలిక ఏర్పడిందని.. ఒకవైపు గోడ వంగిందని ప్యానెల్ వివరించింది. కట్ట పునాదిని వెంటనే గ్రౌటింగ్ చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఆ వివరాలు.. రాజధాని హైదరాబాద్ నగరానికి తాగు నీరు.. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు తాగు, సాగు నీరు అందించే సింగూరు రిజర్వాయర్ ప్రమాదంలో పడింది. ఆనకట్టకు వెంటనే మరమ్మతులు చేయకపోతే ఏ క్షణమైనా డ్యాం తెగిపోయే ప్రమాదం ఉందని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ హెచ్చరికలు జారీ చేసింది. డ్యామ్ పైభాగంలో రాతి కట్టడం దెబ్బతిన్నదని.. దీనికి వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్యానెల్ సూచించింది. పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. 1976లో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరులో సింగూరు రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించారు. దీని సామర్థ్యం 29.91 టీఎంసీలు. 1989లో ఈ ఆనకట్ట నిర్మాణం పూర్తయింది. హైదరాబాద్



తాగునీటి కోసం దీని నుంచి 6.96 టీఎంసీలు కేటాయించారు. అలానే డ్యాం పరిసర ప్రాంతాల్లో సాగునీటి అవసరాలు తీర్చడానికి, మంజీరా నదిలో పూడికను తగ్గించడానికి ఈ ప్రాజెక్టును నిర్మించారు. డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డీఆర్ఐపీ) కింద సింగూరు ప్రాజెక్టు ఉంది. ఇదిలా ఉంటే చైర్మన్ అశోక్‌కుమార్ గంజు సారథ్యంలో ఆనకట్ట భద్రత సమీక్షా కమిటీ జూన్ 23న డ్యామ్‌ను పరిశీలించింది. ప్రాజెక్టు పరిస్థితిని వివరిస్తూ, వెంటనే చేపట్టాల్సిన మరమ్మతు పనులను తెలియజేస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వాస్తవానికి సింగూరు రిజర్వాయర్ డిజైన్ ప్రకారం దీనిలో 517.8 మీటర్ల వరకు నీటిని నిల్వ చేయాలి. కానీ మిషన్ భగీరథ అవసరాల కోసం 520.50 మీటర్ల వరకు నీరు నిల్వ చేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు 2017 అక్టోబరు 30న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటి నుంచి కూడా సింగూరు రిజర్వాయర్‌లో అనుమతించిన 520 మీటర్లకు మించి.. 522 మీటర్ల కన్నా ఎక్కువగానే నీటిని నిల్వ చేస్తున్నారని కమిటీ గుర్తించింది. దీనివల్లే జలాశయం దెబ్బతిన్నదని తేల్చింది. కట్ట దెబ్బతినడమే కాకుండా మరమ్మతులకు అవకాశం లేకుండా పోయిందని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో వెల్లడించింది. దెబ్బతిన్న రాతి కట్టడాన్ని వెంటనే సరిచేయకపోతే ఆనకట్టుకు ఏ క్షణంలోనైనా గండి పడే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. ఒకవేళ అలా జరిగితే, దిగువన ఉన్న మంజీరా బ్యారేజీ, నిజాంసాగర్‌తోపాటు చెక్‌డ్యామ్‌లు కూడా దెబ్బ తింటాయని పేర్కొంది. ఆనకట్టకు రక్షణగా ఉన్న పిట్టగోడకు నిలువునా చీలిక వచ్చిందని, ఒకవైపు గోడ వంగి ఉందని వివరించింది. కట్ట పునాదిని వెంటనే గ్రౌటింగ్ చేయాలని అభిప్రాయపడింది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి.. వర్షాకాలం అయిపోగానే మరమ్మతులు చేపట్టాలని కమిటీ సూచించింది. కట్ట మరమ్మతులకు అవసరమైన నిధులు డ్రిప్ నుంచి రాకపోవచ్చని, రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని తెలిపింది.

# రాజకీయాలకు సెలవు ఇవ్వబోతున్నా

## మాజీ మంత్రి మల్లారెడ్డి



**మేడ్చల్:**మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసం బోయిన్ పల్లిలో రాఖీ పండగ వేడుకలు ఘనంగా జరిగాయి... తన సోదర సోదరిమణుల తో ఇల్లంత సందడిగా మారింది... ప్రతి సంవత్సరం అన్న దమ్ములకు రాఖీ కట్టడం సంతోషంగా ఉంటుందని మల్లారెడ్డి అక్క చెల్లెలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు... మల్లారెడ్డి మాట్లాడుతూ రాఖీ పండగ తన జీవితం లో ఎంతో ప్రత్యేకమని, రాఖీ పండగ రోజే తన తొలి ఇంజనీరింగ్ కాలేజి ని ప్రారంభించి పాల మల్లారెడ్డి కాస్తా విద్యావేత్త గా మారానని, ఇపుడు అంచెలంచెలుగా ఎదిగి డీమ్డ్ యూనివర్సిటీ స్థాపించే స్థాయికి వెళ్లానని మల్లారెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా డీమ్డ్ యూనివర్శిటీ లు స్థాపించి పేద ప్రజలకు విద్య వైద్యం ను అందించే దిశగా కృషి చేస్తున్నాని అన్నారు..ఈ రాఖీ పండగ రోజున అందరికి అందుబాటులో ఉండే విధంగా వన్ హెల్త్ పేరిట మెడికల్ షాప్ లు ప్రారంభిస్తున్నామని, వీటిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన తెలిపారు... మల్లారెడ్డి ఆసుపత్రి లో కేసీఆర్ కిట్ తరహా %జవీ=% ఫండ్, మల్లారెడ్డి కిట్ ను అందిస్తున్నట్టు మల్లారెడ్డి తెలిపారు... 108 తరహాలో త్వరలో వన్ హెల్త్ పేరిట 100 అంబులెన్స్ లను ప్రారంభించి ఎమర్జెన్సీ సర్వీసులను అందించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు... ఈ సందర్భంగా మల్లారెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు....

# ఒడిస్సా నుండి కేరళకు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు

## జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

**విజయనగరం:**ఒడిస్సాలో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించే క్రమంలో నలుగురు నిందితులు బొండపల్లి పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుండి 100 కిలోల గంజాయి, ఒక షిఫ్ట్ కారు, 4 సెల్ ఫోన్లు, రూ.2,500/-ల నగదు స్వాధీనం చేసుకున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు. బొండపల్లి పోలీసులకు రాబడిన ఖచ్చితమైన సమాచారంతో గొట్లాం బైపాస్ రోడ్డు జంక్షను వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా ఒడిస్సా నుండి మిళనాడు రాష్ట్రానికి షిఫ్ట్ కారులో గంజాయిని తరలిస్తున్న ఇద్దరి నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 48 ప్యాకెట్లలో గల 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారంతో మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, 4గురు నిందితులను రిమాండుకు తరలిస్తున్నట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆగస్టు 9న నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వివరాలను వెల్లడించారు.

# ఇండియా, అమెరికా పచ్చళ్ల వ్యాపారం రూ. 20 వేల కోట్లు

**హైదరాబాద్, ఆగస్టు 9:**భారతదేశం సుగంధ ద్రవ్యాలకు పుట్టినిల్లు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిదారుగా మాత్రమే కాకుండా, అతిపెద్ద ఎగుమతిదారుగా కూడా నిలుస్తోంది. భారతదేశం ప్రతియేటా సుమారు రూ. 20,000 కోట్ల విలువైన పచ్చళ్ళు, పాపడ్‌లు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ముఖ్యంగా కెనడా, యుకె, అమెరికాలో ఈ ఉత్పత్తులకు భారీగా డిమాండ్ ఉంది. 2023-24లో రూ. 36,958.80 కోట్ల విలువైన స్పైసెస్ ను ఎగుమతి చేయగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరునెలల్లోనే భారత్ రూ. 29,016 కోట్ల ( US$ 3.36 బిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేసి రికార్డ్ నెలకొల్పింది. 2027 నాటికి 10 బిలియన్ డాలర్ల ఎగుమతిని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీటిలో ఒక్క అమెరికానే రూ. 5,136 కోట్ల ( US$ 594.82 మిలియన్) విలువైన స్పైసెస్ ను దిగుమతి చేసుకోగా.. రూ. 2,766 కోట్ల (%ఖువి%



320.36 మిలియన్) విలువైన సుగంధ ద్రవ్యాలను యూకే దిగుమతి చేసుకుంది. అమెరికాలో వీటి డిమాండ్ ప్రతియేటా 10% పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా, కెనడా, యుకెలతో సహా అన్ని యూరప్ దేశాల్లో భారతీయ పచ్చళ్లకు, పాపడ్‌లకు డిమాండ్ ఎక్కువే. అక్కడి మార్టుల్లో ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతాయి. చాలాసార్లు ఔట్ ఆఫ్ స్టాక్ బోర్డులు కూడా దర్శనం ఇస్తాయి. అయితే ఇందుకు గల ప్రధాన కారణం భారత్ నుంచి విదేశాలకు పెరుగుతున్న భారీ వలసలు అంటున్నారు నిపుణులు. అలాగే విదేశీయుల్లో భారతీయ రుచుల పట్ల ఆసక్తి, ఆరోగ్యకరమైన సేంద్రీయ ఆహార ఉత్పత్తుల పట్ల పెరుగుతున్న ఆదరణ కూడా కారణమే అంటున్నారు. ఉదాహరణకు కెనడాలో భారతీయ రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లలో మామిడి, నిమ్మ వంటి పచ్చళ్ళు, భారత్ నుంచి ఎగుమతయ్యే బియ్యం, పాపడ్‌లకు గిరాకీ ఎక్కువగా ఉంది. అలాగే యుకెలో కూడా పచ్చళ్ళు, పాపడ్‌లు బ్రిటిష్-ఇండియన్ వంటకాలలో ప్రధాన భాగంగా మారాయి. భారత్ తన నిర్దిష్ట లక్ష్యాన్ని చేరాలంటే ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్ళు, అంతర్జాతీయ ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఎగుమతులు ఉండటం, మార్కెట్ అడ్డంకులను అధిగమించాల్సిన అవసరం ఇంకా ఉన్నట్టు తెలుస్తోంది.

# ఖైరతాబాద్ గణనాధుడికి విశ్వశఆంతి



**హైదరాబాద్, ఆగస్టు 9:**భాగ్యనగరంలో ఏటా అంగరంగ వైభవంగా జరిగే గణేష్ ఉత్సవాలకు కేంద్ర బిందువైన ఖైరతాబాద్ గణపతి మరోసారి భక్తులను దీవించడానికి సిద్ధమవుతున్నాడు. ఈఏడాది ఇక్కడ 71వ సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని 69 అడుగుల భారీ విగ్రహం దర్శనం ఇవ్వనున్నారు. ఈ ఏడాది విగ్రహానికి 'విశ్వశాంతి' అని పేరు పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని పెంపొందించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. విగ్రహం తయారీ పనులు జూన్ 6న సర్వ ఏకాదశి సందర్భంగా మొదలయ్యాయి. ఆగస్టు 25 నాటికి పనులు పూర్తవుతాయని కమిటీ అంచనా వేస్తోంది. ఇప్పటివరకు 50%కి పైగా పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్ రాజ్ తెలిపారు. ఈసారి ఖైరతాబాద్ గణపతి విగ్రహం పూర్తిగా మట్టితో తయారవుతోంది. గత కొన్ని సంవత్సరాల మాదిరిగానే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (%ూూ%)ను పూర్తిగా పక్కన పెట్టారు. గుజరాత్ నుంచి తెప్పించిన మట్టి, జనపనార పొడి, గడ్డి, ఇసుక వంటి పర్యావరణహిత ముడిసరుకులను మాత్రమే ఉపయోగిస్తున్నారు. అలాగే, విగ్రహానికి రంగులద్దడానికి నీటిలో కరిగిపోయే ప్రత్యేక పెయింట్‌ను వాడుతున్నారు. దీనివల్ల నిమజ్జనం సమయంలో ఎలాంటి పర్యావరణ సమస్యలు తలెత్తవు. విగ్రహం తయారీ కోసం దాదాపు 200 మంది కళాకారుల బృందం నిరంతరం శ్రమిస్తోంది. ఇందులో చెన్నై నుంచి వచ్చిన 40 మంది శిల్పులు, ఒడిశా నుంచి వచ్చిన మట్టి కళాకారులు, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వెల్డింగ్ బృందం, ఆదిలాబాద్‌కు చెందిన కళాకారులు ఉన్నారు. ఒడిశాకు చెందిన మట్టి కళాకారుడు జోగారావు మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా ఖైరతాబాద్ గణపతి విగ్రహం తయారీలో తాను భాగస్వామిగా ఉన్నానని చెప్పారు. 1954లో అప్పటి కార్పొరేటర్ దివంగత శంకరయ్య చేత మొదలైన ఈ ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు, ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షలాది భక్తులను ఆకర్షిస్తాయి. ఈసారి కూడా శాంతి, సామరస్యం, భక్తిని పెంపొందించేలా ఉత్సవాలు నిర్వహించడానికి కమిటీ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది.

# మోడీ రాజీపడ్డారా...

మోడీ దౌత్య నీతిపై ప్రతిపక్షాల అవహేళనలు చేస్తున్నారు. ట్రంప్ ను వాటేసుకున్నాడు.. కౌగిలించుకున్నాడు. ఇండియాకు తీసుకొచ్చి సన్మానం చేశాడు. బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పుకున్నాడు. మరి ఇవన్నీ ట్రంప్ విషయంలో చేస్తే.. మోడీకి ట్రంప్ నుంచి మంచి శాస్తి జరిగిందని ప్రతిపక్ష నేతల చేస్తున్నారు. వాళ్లు చెప్పిన వరకూ నిజం. ఇది నిజమే..కానీ ట్రంప్ తోనే కాదు.. అమెరికాలోని అన్ని పార్టీల నేతలతోనూ మోడీ ఇలానే ప్రవర్తిస్తారు. బ్రిటన్ ప్రధానితోనూ, కెనడా ప్రధాని, ఆస్ట్రేలియా ప్రధానితోనూ అంతే స్నేహంగా మోడీ మెలుగుతారు. ఒబామాతో, బైడెన్ తోనూ మోడీ స్నేహం ఒకేలా ఉంటుంది. మోడీ దౌత్యనీతిలో ప్రధాన అంశం 'వ్యక్తిగత సంబంధాలు'.. ఇది కొన్ని సార్లు ఉపయోగపడుతాయి.. మరికొన్ని సార్లు ఉపయోగపడవు. ఖతార్ లో భారతీయులకు ఉరిశిక్ష పడితే ఆ దేశాన్ని ఒప్పించి విముక్తి చేసిన ఘనత మోడీ. ఉక్రెయిన్ తో రష్యా యుద్ధంలో ఒకరోజు యుద్ధం ఆపించి భారతీయులను ఆ దేశం నుంచి తీసుకొచ్చిన ఘనత మోడీది. మోడీ వ్యక్తిగత సంబంధాలు ఉపయోగపడ్డాయి. పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి ఆయన ఇంటికి పిలవకుండానే వెళ్లాడు. పాక్ దాడి చేస్తే యుద్ధం చేస్తున్నారు. కఠినంగా వ్యవహరిస్తున్నారు. జీ జిన్ పింగ్ భారత్ వచ్చారు. చైనాకు మోడీ వెళ్లారు. కానీ చైనా సైనికులు మనపై దాడి చేస్తే మోడీ రాజీపడలేదు. ట్రంప్ మోడీకి పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. రైతులకే భారత్ తొలి ప్రాధాన్యం ఇస్తుంది. మత్స్యకారులు, పశువు పోషకులు విషయంలో కూడా మేము రాజీపడం. దీనికి నేను వ్యక్తిగతంగా మూల్యం చెల్లించాల్సి రావచ్చు. దానికి సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యలు చేశారు. భారత్ పై కొద్ది రోజులుగా డోనాల్డ్ ట్రంప్ విషం కక్కుతూనే ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా 50% సుంకం విధించేశాడు. ప్రధానంగా రష్యాతో చమురు కొనుగోలుతో పాటు యూఎస్ నుంచి డైరీ



ప్రోడక్టు దిగుమతికి నో చెప్పడమే కూడా కారణమని తెలుస్తోంది. 8 కోట్ల మందికి పైగా రైతులు భారత్‌తో పాల ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నారు. ఈ నేపథ్యంలో యుఎస్ నుంచి కూడా ఉత్పత్తులను మనం దిగుమతులు చేసుకుంటే భారత రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒకవేళ యుఎస్ ప్రొడక్ట్స్ వస్తే ఏటా సుమారు లక్షల కోట్ల రూపాయలు దేశ ఆదాయాన్ని కూడా కోల్పోతామని అంచనా వేశారు. ఈ నేపథ్యంలోనే భారత్ నో చెప్పగా ట్రేడ్ డీల్ ఆగిపోయినట్లు కూడా సమాచారం. మెరికా నుంచి ఈ పాల ఉత్పత్తులను దిగుమతులు చేసుకోవడం కూడా మతపరంగా ఒక సున్నితమైన అంశం. మన దేశంలో ఆవుకు గడ్డి ఆహారంగా పెడతారు. కానీ అమెరికా ఆవులకు మాంసం ,మాంస ఉత్పత్తులను ఆహారంగా వేస్తారు. ఇలా చేయడం వల్ల మతపరంగా సున్నితమైన అంశం. ఎన్నో డిమాండ్ల నేపథ్యంలో భారతీ దీన్ని వ్యతిరేకించింది. ఇది స్థానిక రైతులకు కూడా జీవనోపాధి ప్రమాదంలో పడేస్తుంది. ఇప్పటికే రైతులు ఆదాయాలు తక్కువ. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమ్మాన్ నిధి యోజన ద్వారా ప్రతి ఏటా ఆరువేల రూపాయలు కూడా రైతుల కోసం డైరెక్ట్ బెనిఫిట్రస్ జమ చేస్తున్నారు. అంతేకాదు ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన ద్వారా కూడా నీటిపారుదల సమస్యను పరిష్కరించింది. చిన్న రైతుల వ్యవస్థీకృత శక్తి పెరిగింది. ప్రాసెసింగ్ యూనిట్ లో నిల్వాల కూడా వేగవంతం చేసింది. ఎంఎస్ స్వామినాథన్ వార్షికోత్సవాలు ఢిల్లీలో జరుగుతున్నాయి. భారతరత్న, ఫాదర్ ఆఫ్ గ్రీన్ రివల్యూషన్ ఎంఎస్ స్వామినాథన్ మూడు పదుల వయసులోనే దేశ భవితవ్యాన్నే మార్చారు. కరువు భారీ నుంచి రక్షించారు. యూఎస్, మెక్సికో, జపాన్ శాస్త్రవేత్తలతో కలిసి వరి, గోధుమ వంగడాలపై పరిశోధనలు చేసి ఎంతో గాను ఉపయోగపడ్డారు. భారత్ వెనక్కి తిరిగి చూడలేని స్థితిలో ఇప్పుడు ఉందంటే అయిన పాత్ర కీలకం. భారత్ ఇప్పుడు ఆహార ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. అమెరికాతో వివాదం నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. 23వ రష్యా - భారత్ వార్షిక సదస్సుకు రావాలని పుతిన్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో యుద్ధంపై తాజా పరిణామాలను మోడీకి పుతిన్ వివరించారు. వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని పుతిన్‌కు మోడీ సూచించారు. భారత్ శాంతివైపు ఉందన్న స్థిర వైఖరిని ఈ సందర్భంగా మోడీ పునరుద్ఘాటించారు. ఇదిలా ఉంటే.. భారత్‌పై అమెరికా విధించిన టారిఫ్‌లకు ప్రతిస్పందనగా కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోళ్లు నిలిపివేయాలని నిర్ణయించారు. అంతేకాదు.. ఇప్పటికే ఫిక్స్ అయినా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా పర్యటనను కూడా రద్దు చేసుకున్నారు. తాజాగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఇండియాకు ఆహ్వానించారు. దీనిపై ట్రంప్ ఎలా స్పందిస్తారో అని ఆసక్తి నెలకొంది. దేశ ప్రజలను ఎక్కడ తాకట్టు పెట్టడం లేదు.

# ఆర్ధరాత్రి కత్తితో దాడి

**కుత్బుల్లాపూర్:**పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి కొందరు కత్తులతో హల్చల్ చేసారు. బిస్త్రో మండి వద్ద బిర్యానీ కోసం కొందరు వ్యక్తులు వచ్చారు. తూముకుంట కు చెందిన ఓ వ్యక్తి వంశీ గౌడ్ అనే వ్యక్తి కారు మీద మూత్రం చేశాడని ఇద్దరి మధ్య గొడవ జరిగిది. గొడవలో వంశీ గౌడ్(27) అనే వ్యక్తి చేతికి కత్తి గాయం అయింది. అర్ధరాత్రి శబ్దాలు వినిపించడంతో స్థానికులు భయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన వ్యక్తికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స జరిపించారు.

# ఎమ్మెల్యే తలసాని నివాసంలో రాఖీ వేడుకలు

**హైదరాబాద్:**అన్న, చెల్లెలు అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కి పలువురు రాఖీలు కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం వెస్ట్ మారేడ్ పల్లి లోని కార్యాలయం వద్దకు సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు చేరుకొని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. రాఖీలు కట్టిన బ్రహ్మ కుమారీలు రక్షాబంధన్ సందర్భంగా సికింద్రాబాద్ కు చెందిన బ్రహ్మ కుమారీలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి రాఖీ కట్టారు.

# అమెరికాకు షాకిచ్చిన భారత్..



అగ్రరాజ్యం అమెరికాకు భారత్ షాకిచ్చింది. అమెరికాతో కీలకమైన ఆయుధ కొనుగోలు ఒప్పందాలకు భారత్ తాత్కాలికంగా బ్రేకులు వేసింది. భారత ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనంగా 25 శాతం సుంకాలను విధించడంతో ప్రతిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాయిటర్స్ ఓ కథనం ప్రచురించింది. తాజా పరిణామాలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు గత కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. భారత్ తాజాగా తీసుకున్న అనూహ్య నిర్ణయంతో సుమారు 3.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30 వేల కోట్లు) విలువైన రక్షణ ఒప్పందాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇందులో భారత సైన్యం కోసం స్ట్రైకర్ యుద్ధ వాహనాలు, జావెలిన్ యాంటీ-ట్యాంక్ క్షిపణులతోపాటు, నౌకాదళం కోసం ఆరు బోయింగ్ పీ-8%×% గూఢచార విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాలు కూడా ఉన్నాయి. ఈ ఒప్పందాలను ఖరారు చేసేందుకు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్వరలో వాషింగ్టన్‌లో పర్యటించాల్సి ఉండగా తాజా నిర్ణయంతో ఆ పర్యటన రద్దయినట్టు సమాచారం. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్‌తో యుద్ధానికి భారత్ ఆర్థికంగా పరోక్షంగా సహకరిస్తోందని ఆగస్టు 6న డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. దాన్ని కారణంగా చూపుతూ భారత ఎగుమతులపై అదనంగా 25 శాతం సుంకాన్ని విధించారు. దాంతో మొత్తం సుంకాలు 50 శాతానికి చేరాయి. అయితే ట్రంప్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఐరోపా దేశాలు కూడా తమ ప్రయోజనాల కోసం రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్నాయని, తమను మాత్రమే అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించింది. అమెరికా గనుక రష్యాలా సమాన ధరకు చమురును సరఫరా చేస్తే, రష్యా నుంచి దిగుమతులు తగ్గించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని భారత్ తెలిపింది. ట్రంప్ బెదిరింపు ధోరణి, దేశంలో పెరుగుతున్న అమెరికా వ్యతిరేక జాతీయవాదం కారణంగా ప్రధాని మోదీకి ఈ విషయంలో రాజకీయంగా ముందుకు వెళ్లడం కష్టంగా మారిందని, అందుకే తాజా నిర్ణయం తీసుకున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ప్రస్తుతానికి ఇరుదేశాల మధ్య రక్షణ భాగస్వామ్యం, నిఘా సమాచార మార్పిడి, సంయుక్త సైనిక విన్యాసాలు యథా విధిగా కొనసాగుతున్నాయని భారత అధికారులు తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉన్న భారత్.. ప్రధానంగా రష్యాపై ఆధారపడినా ఇటీవలి కాలంలో ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికా నుంచి కొనుగోళ్లను పెంచింది.

## అభ్యంతరాలు చెప్పడానికి ఆలస్యమెందుకు?.. రాహుల్‌కు ఈసీ ప్రశ్న







**ఇంటర్నెట్ డెస్క్:** భాజపా, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న సంచలన ఆరోపణలపై ఎలక్షన్ కమిషన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. బిహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగిస్తున్నామని తాము ఆగస్టు 1న ప్రకటన విడుదల చేసినా.. మార్పులు చేర్పులపై ఇప్పటివరకు ఏ పార్టీ తమను సంప్రదించలేదని ఈసీ స్పష్టం చేసింది. ఓట్ల తొలగింపుపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం ముసాయిదాపై ఇంతవరకు ఎటువంటి అభ్యంతరాలు నమోదు చేయలేదని పేర్కొంది. అభ్యంతరాలు చెప్పడానికి ఆయన ఎందుకింత ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించింది. తాము విడుదల చేసిన ఓట్ల తొలగింపు ముసాయిదాపై తన అభ్యంతరాలను రాహుల్ గాంధీ ఇప్పుడు కాకుండా ఎప్పటిలాగే బిహార్ ఎన్నికలు పూర్తయ్యాక మాత్రమే ఇస్తారేమోనని ఈసీ వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో జరిగిన ఓట్ల చోరీ గురించి రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని హెచ్చరించిన అనంతరం ఈసీ ఈ వ్యాఖ్యలు చేసింది.


ఎన్నికల రిగ్గింగ్‌కు సంబంధించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు సమర్పించాలని ఎన్నికల కమిషన్ రాహుల్‌ను సవాల్ చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. మహారాష్ట్ర, హరియాణా మొదలైన ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో అవకతవకలు జరిగినట్లు పేర్కొన్న వెంటనే ఈసీ ఆ విషయంలో దర్యాప్తు చేయడం మానేసి.. రాహుల్‌గాంధీ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని దబాయిస్తోందన్నారు. అసలు దర్యాప్తే చేయనప్పుడు ఆయన వాదనలు తప్పని ఎన్నికల కమిషన్‌కు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. తాము సమర్పించిన ఆధారాలు ఈసీ ముందే ఉన్నాయని.. వాటిని పరిణగణలోకి తీసుకొని దర్యాప్తు చేయాలని సూచించారు. తాము ఆందోళన వ్యక్తంచేస్తోంది కేవలం ఒక పార్టీ గురించి మాత్రమే కాదని.. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ గురించని ఆమె పేర్కొన్నారు.

**ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోండి: రాహుల్ గాంధీ**

రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసేటప్పుడు, రాజ్యాంగంపై దాడి చేసేటప్పుడు ఎన్నికల అధికారులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడిన వారిని పట్టుకోవడానికి ఎక్కువ సమయం పట్టినా.. ఎప్పటికైనా తప్పనిసరిగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తాను చేస్తున్న ఆరోపణలపై ప్రమాణం చేయాలని ఈసీ చేస్తున్న డిమాండ్‌ను తిప్పికొట్టారు. తాను ఇప్పటికే ఎంపీగా పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగంపై ప్రమాణం చేశానన్నారు.

# వృద్ధుడు.. నలుగురు మహిళలు.. ఇవేం ట్విస్టులు రా సామీ!





**ముంబై:** సైబర్ నేరాలపై ప్రభుత్వాలు, పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ.. సైబర్ మోసగాళ్ల చేతిలో అమాయకులు సులభంగా మోసపోతునే ఉన్నారు. దేశంలో రోజురోజుకు ఇలాంటివి అనేక ఘటనలు వెలుగుచూస్తున్నాయి. యువతే కాదు.. వృద్ధులు సైతం వలపు వలలో పడుతున్నారు. వారి బలహీనతల్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా ముంబైలో 80 ఏళ్ల వ్యక్తి ఫ్రెండ్ రిక్వెస్ట్ అంగీకరించి.. సైబర్ మోసానికి గురై రూ.9 కోట్లు పోగొట్టుకున్నాడు. ముంబైకి చెందిన వృద్ధుడు 2023 సంవత్సరం ఏప్రిల్ నెలలో ఫేస్‌బుక్‌లో షార్వి అనే మహిళకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించగా.. ఆ రిక్వెస్ట్ అంగీకరించలేదు. అయితే, కొన్ని రోజుల తర్వాత షార్వి ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. దీంతో ఆ వృద్ధుడు అంగీకరించాడు. ఇద్దరూ చాటింగ్ ప్రారంభించారు. ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పుడే అసలు కథ మొదలైంది. తన భర్త నుంచి దూరమై పిల్లలతో ఉన్నట్లు నాటకానికి తెర తీసింది. ప్రస్తుతం తన పిల్లలు అనారోగ్యంతో ఉన్నారని.. తనకు కొంత డబ్బు అవసరం అంటూ వాపోయింది. దీంతో కరిగిపోయిన ఆ వృద్ధుడు నగదును పంపించాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల తర్వాత కవిత అనే మహిళ వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపడం ప్రారంభించింది. షార్వి స్నేహితురాలిగా పరిచయం చేసుకున్న ఆమె. ఆ వృద్ధుడికి అసభ్యకర సందేశాలు పంపడం ప్రారంభించింది. అనంతరం డబ్బు డిమాండ్ చేయడం మొదలుపెట్టింది. ఇదిలా ఉండగా.. మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. షార్వి సోదరి నంటూ మరో మహిళా దివాజ్ సందేశాలు పంపించడం మొదలు పెట్టింది. షార్వి చనిపోయిందని.. ఆస్పత్రి బిల్లు చెల్లించాలని స్క్రీన్ షాట్‌లు కూడా పంపించింది. దీంతో ఆ వృద్ధుడు డబ్బులు పంపించాడు. అనంతరం తిరిగి దినాజ్‌ను డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఇదిలా సాగుతుండగా.. ఇంతలోనే జాస్మిన్ అనే మరో మహిళ మెసేజ్ పంపించింది. దినాజ్ స్నేహితురాలినంటూ సాయం చేయాలని అభ్యర్థించింది. దీంతో ఆమెకు కూడా ఆ వృద్ధుడు డబ్బు పంపించాడు. ఇలా ఏప్రిల్ 2023 నుంచి జనవరి 2025 వరకు రూ. 8.7 కోట్లు పంపించాడు. ఇంతటితో ఆ వృద్ధుడు ఆగలేదు.. ఇక ఖాతాలో నగదు అయిపోవడంతో కోడలి దగ్గర రూ.2లక్షలు అప్పుతీసుకున్నాడు. మరింత డబ్బు కావాలంటూ ఆ మహిళలు కోరడంతో కుమారుడి దగ్గర కూడా రూ. 5 లక్షలు అడిగాడు. దీంతో అనుమానం వచ్చి కొడుకు తండ్రిని నిలదీయగా.. ఆ డబ్బు ఎందుకు అవసరమో చెప్పాడు. దీంతో అసలు విషయం బయటపడింది. చివరికి మోసపోయానని తెలుసుకున్న ఆ వృద్ధుడు ఆస్పత్రి పాలయ్యాడు. మోసంపై జూలై 22న సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వృద్ధుడిని మోసం చేసిన నలుగురు మహిళలు తెలిసిన వారై ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## ఎస్సీఓ సదస్సుకు రండి.. ప్రధాని మోదీకి చైనా ఆహ్వానం



భారత్ - చైనా దేశాల మధ్య సంబంధాల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ నెలాఖరులో టియాంజిన్ నగరంలో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ కి శుక్రవారం చైనా అధికారికంగా ఆహ్వానం పలికింది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత ప్రధాని మోదీ తొలిసారి చైనాలో పర్యటించనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో టియాంజిన్‌లో ఎస్సీఓ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు భారత ప్రధాని మోదీ హాజరుకానున్న విషయాన్ని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ధృవీకరించారు. కాగా గల్వాన్ ఘర్షణల అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాదాపు నాలుగేళ్ల పాటు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగాయి. అయితే ఇటీవల వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ విషయంలో ఇరుదేశాల మధ్య ఒక అంగీకారం కుదరడంతో ప్రతిష్టంభన వీడింది. ఈ సానుకూల వాతావరణంలోనే ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. 2019 తర్వాత మోదీ చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం. ఈ పర్యటనకు ముందు ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు ఉన్నతస్థాయి సమావేశాలు జరిగాయి. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఇటీవలే చైనాలో పర్యటించారు. ముఖ్యంగా ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడాలని, లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అజిత్ దోవల్ ఎస్సీఓ భద్రతా సలహాదారుల సమావేశంలో గట్టిగా చెప్పారు. కాగా భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్ సహా మొత్తం పది దేశాలు సభ్యులుగా ఉన్న షాంఘై సహకార సంస్థను 2001లో స్థాపించారు. ఈ ఏడాది టియాంజిన్‌లో జరిగే సదస్సు ఎస్సీఓ చరిత్రలోనే అతిపెద్ద సదస్సుగా నిలవనుందని చైనా వెల్లడించింది. సుమారు 20 దేశాల అధినేతలు, 10 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

## 'ఉజ్వల' కొనసాగింపు, సాంకేతిక విద్యకు 'మెరిట్' స్కీమ్..



**ఇంటర్నెట్ డెస్క్:** ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశఐన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఇందుకోసం రూ.12,000 కోట్లు కేటాయించింది. సాంకేతిక విద్యా సంస్థల అభివృద్ధికి 'మెరిట్' పథకానికి ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్.. ఇందుకోసం రూ.4,200 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ సిలిండర్‌ను కేంద్రం సబ్సిడీపై అందిస్తోంది. దీన్ని 2025-26 ఆర్థిక సంవత్సరానికి కొనసాగించేందుకు కేంద్రం నిర్ణయించగా.. దేశ వ్యాప్తంగా 10.33 కోట్ల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. సాంకేతిక విద్యా అభివృద్ధికి 'మెరిట్' పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.4,200 కోట్లు కేటాయించింది. 275 సాంకేతిక విద్యా సంస్థల్లో దీనిని అమలు చేయనున్నారు. నైపుణ్యాలు, ఉపాధి అవకాశాల పెంపు ప్రధాన లక్ష్యంగా చేపడుతున్న ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 7.5 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నట్లు అంచనా. వీటితోపాటు అస్సాం, త్రిపురలకు రూ.4,250 కోట్లతో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, తమిళనాడులో మరక్కానం-పుదుచ్చేరి నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## 'ఓటు హక్కుపై మీరు దాడి చేస్తే.. మీపై మేం దాడి చేస్తాం'..

భారత ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుపై మీరు దాడిచేస్తే, మీపై మేం దాడి చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంను హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో నిర్వహించిన నిరసన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఇది కేవలం తన గొంతుక కాదని, యావత్ హిందుస్థాన్ గొంతుక అని స్పష్టం చేశారు. ఎన్నికల మోసం ఫిర్యాదుపై తన నుంచి ఈసీ అఫిడవిట్ కోరిందని, కానీ తాను ఇప్పటికే లోక్‌సభలో రాజ్యాంగంపై ప్రమాణం చేశానని రాహుల్ గుర్తుచేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రం 'ఒక వ్యక్తి, ఒక ఓటు' అని, ఈసీ అధికారులు దానిపైనే దాడి చేస్తున్నారని విమర్శించారు. మీరు పేదలపై దాడి చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఎన్నికల్లో మోసం చేసి సులభంగా తప్పించుకోవచ్చని అనుకుంటే పొరపాటని, సమయం పట్టినా మిమ్మల్ని ఒక్కొక్కరిగా పట్టుకుంటామని రాహుల్ వార్నింగ్ ఇచ్చారు. బెంగళూరు సెంట్రల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఒక్క మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌పై మాత్రమే తాము దృష్టి సారించామని, అక్కడ బీజేపీ, ఈసీ కుమ్మక్కై మోసానికి పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయని రాహుల్‌గాంధీ ఆరోపించారు. మహాదేవపురలో మొత్తం 6.5 లక్షల ఓటర్లు ఉంటే, అందులో 1.25 లక్షల ఓట్లను దొంగిలించారని, అంటే ప్రతి ఆరుగురిలో ఒక ఓటును తారుమారు చేశారని రాహుల్‌గాంధీ చెప్పారు. ఈ మోసం ఐదు ప్రధాన పద్ధతుల్లో జరిగిందని ఆరోపించారు.

**ఇవీ రాహుల్ చెప్పిన అక్రమాలు..**

1. సుమారు 12,000 మంది నకిలీ ఓటర్లు ఐదారు పోలింగ్ బూత్‌లలో ఓటు వేశారు.
2. దాదాపు 40,000 ఓట్లను నకిలీ ఐడీలతో నమోదు చేశారు.
3. ఒకే ఇంటి చిరునామాపై వందల ఓట్లు నమోదు చేశారు. ఒక బీజేపీ నేత ఇంట్లో 40 మంది ఓటర్లు ఉన్నట్లు చూపగా, తాము వెళ్లి చూస్తే అక్కడ ఎవరూ లేరు.
4. దాదాపు 4,000 మంది ఓటర్లకు ఫొటోలు లేవని, ఉన్నా అవి అస్పష్టంగా ఉన్నాయి.
5. ఫారం 6 ద్వారా కొత్తగా చేర్చిన 34 వేల ఓట్లలో చాలామంది 89 నుంచి 95 ఏళ్ల మధ్య వయసు వారే ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

వీటిపై రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ రాజ్యాంగం కోసం పనిచేయాలి కానీ బీజేపీ కోసం కాదని హితవు పలికారు. దేశవ్యాప్త ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, పోలింగ్ వీడియో రికార్డింగ్‌లను విడుదల చేస్తే ఈ మోసం కేవలం కర్ణాటకకే పరిమితం కాలేదని, దేశవ్యాప్తంగా జరిగిందని నిరూపిస్తామని రాహుల్ సవాల్ విసిరారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137